www.bharathasakthi.com

# భారత శక్తి ®

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 21 | సంచిక : 40 | హైదరాబాద్ | మంగళవారం,జులై 14 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00

## వింబుల్డన్ కొత్త ఛాంపియన్‌గా నోస్కోవా... సిన్నర్ 'బ్యాక్ టు బ్యాక్' మ్యాజిక్

- తొలి గ్రాండ్‌స్లామ్‌తో వింబుల్డన్ కొత్త ఛాంపియన్ గా అవతరణ
- కన్నీటి వీడ్కోలు పలికిన తల్లికి 'గ్రాండ్‌స్లామ్' అంకితం
- ఆల్-చెక్ ఫైనల్లో ముచోవాపై లిండా నోస్కోవా సంచలన విజయం
- పురుషుల సింగిల్స్ టైటిల్‌ను నిలబెట్టుకున్న జాన్నిక్ సిన్నర్
- హోరాహోరీ పోరులో జ్వెరెవ్‌ను ముంచేసిన వరల్డ్ నంబర్ వన్



**క్రీడా విభాగం (భారత శక్తి ) జూలై 13:** టెన్నిస్ ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్-2026 టోర్నీ సరికొత్త ఛాంపియన్లతో ముగిసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాకర్ అభిమానుల తరహాలోనే టెన్నిస్ ప్రియులను ఉర్రూతలూగించిన


3లో..

## తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల

- 50,544 మంది అర్హత.. 43.94 శాతం పాస్!
- లైఫ్‌టైమ్ వాలిడిటీ.. ఇలా చెక్ చేసుకోండి!

**హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జూలై 13:** తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీ టెట్ - జూన్ 2026) ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ నేడు (జులై 13, సోమవారం) మధ్యాహ్నం 2:30 గంటలకు అధికారికంగా విడుదల చేసింది. ఉపాధ్యాయ కొలువే లక్ష్యంగా ఎదురుచూస్తున్న అభ్యర్థుల

3లో..




## వరుస పేపర్ లీక్‌లపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు..



**న్యూఢిల్లీ(భారత శక్తి):** భారత విద్యా వ్యవస్థపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, ఎంపీ రాహుల్ గాంధీ సోమవారం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశ విద్యా వ్యవస్థ ప్రస్తుతం నిజాయతీ లేని దోపిడీ యంత్రాంగంగా మారిందని ఆయన ఆరోపించారు. వరుసగా జరుగుతున్న ప్రశ్నపత్రాల లీకులు, అవినీతిపై కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం, కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌనం వహిస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ఎంపీ రాహుల్ గాంధీ పోస్టు పెట్టారు. ఈ సందర్భంగా అవినీతి, అన్యాయం, పక్షపాతం, నిజాయితీ లేని వ్యవస్థ అనే పదాలు తనవి కాదని రాహుల్ అన్నారు. అవి భారత విద్యా వ్యవస్థ గురించి

3లో..

## బనకచర్ల ప్రాజెక్టుపై సుప్రీంలో విచారణ

- తెలంగాణ అభ్యర్థనను తిరస్కరించిన ధర్మాసనం



**న్యూఢిల్లీ(భారత శక్తి)** బనకచర్ల ప్రాజెక్టుపై సుప్రీంలో విచారణ జరిగింది. పోలవరం ప్రాజెక్టు, గోదావరి నీటి వినియోగం, పోలవరం-బనకచర్ల అనుసంధానంపై వాదనలను కోర్టు వినింది. తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్నై జస్టిస్ విక్రమ్నాథ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇంజక్షన్ ఉత్తర్వులు ఇస్తూ ఏపీ ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వాలన్న తెలంగాణ

2లో..




## హైరైజ్ కమిటీ 'మాయాజాలం'

### ఎఫ్‌టీఎల్ పరిధిలో 17 అంతస్తుల అక్రమ సౌధం!

- నోటీసుల పేరుతో సాగతీత.. బడా బిల్డర్ల ముందు టౌన్ ప్లానింగ్ 'జీ హుజూర్'
- నాటి టీఎస్-బీపాస్ (TS-bPASS) లొసుగులతో వందల కోట్ల దందా..
- నేడు 'బిల్డ్ నౌ' (Build Now) లోనూ అదే రూటు!
- విచారణకు వెళ్తే ముఖం చాటేసిన ప్రదీప్ కన్స్ట్రక్షన్స్..
- స్పందించని యంత్రాంగంపై వెల్లువెత్తుతున్న విమర్శలు.

**హైదరాబాద్ జూలై 13 (భారత శక్తి ):** చట్టం సామాన్యుడికి ఒకలా.. బడా బాబులకు మరోలా పనిచేస్తోందా? నిబంధనల పేరుతో సామాన్యుల ఇళ్లను కూల్చేందుకు ఉరుకులు పరుగులు పెట్టే టౌన్ ప్లానింగ్ అధికారులు, వందల కోట్ల సామ్రాజ్యం ఉన్న బడా బిల్డర్ల ముందు మోకాళ్లపై సాగిలపడుతున్నారా? అంటే అవుననే అంటోంది నగరంలో వెలుగుచూసిన తాజా భవన నిర్మాణ అనుమతుల కుంభకోణం! గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన టీఎస్-బీపాస్ (TS-bPASS) చట్టాన్ని, అందులోని లొసుగులను వాడుకుని హుస్సేన్ సాగర్ పరివాహక ప్రాంతంలో (పూర్తి నీటి మట్టం - ఖీూ / బఫర్ జోన్) ప్రదీప్ కన్స్ట్రక్షన్స్ అనే సంస్థకు ఏకంగా 17 అంతస్తుల బహుళ అంతస్తుల భవనానికి (హైరైజ్ బిల్డింగ్) అనుమతులు జారీ చేయడం ఇప్పుడు తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ఈ వ్యవహారంలో టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు, హైరైజ్ బిల్డింగ్ కమిటీ పాత్రపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

2లో..




## పర్యావరణ విధ్వంసానికి పచ్చజెండా ఊపుతారా.?

- రంగారెడ్డి, యాదాద్రి కలెక్టర్లు, రెవెన్యూ, మైనింగ్, పి.సి.బి అధికారులపై హరిత ధర్మాసనం ఆగ్రహం!
- బండరావిర్యాల మైనింగ్ మాఫియా గుట్టు రట్టు చేసిన నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (చీ+ు).
- చెరువులను మింగేసిన క్వారీ రాబందులు.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిన అధికారులకు చెంపపెట్టు!

**హైదరాబాద్ జూలై 14 భారతశక్తి:** అధికారుల అండదండలు.. మైనింగ్ మాఫియా ఆగడాలు.. వెరసి పచ్చని పొలాలు కాస్తా బూడిద కుప్పలుగా మారాయి. నిబంధనలను తుంగలో తొక్కి, పర్యావరణాన్ని నిలువునా పాతర వేస్తున్న క్వారీ యజమానులకు కొమ్ముకాస్తున్న రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల కలెక్టర్లకు, స్థానిక మండల రెవెన్యూ అధికారులకు (MROs) జాతీయ హరిత తీర్పుధ్వజం (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ - NGT) గట్టి మొట్టికాయలు వేసింది. పర్యావరణ పరిరక్షణను గాలికి వదిలేసి, ఆక్రమణదారులకు పరోక్షంగా సహకరించిన యంత్రాంగంపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అనుమతులు లేని క్వారీలను తక్షణమే నిలిపివేయాలని, పర్యావరణాన్ని ముక్కలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జస్టిస్ పుష్ప సత్యనారాయణ, నిపుణులైన సభ్యులు డాక్టర్ ప్రశాంత్ గార్గవలతో కూడిన హరిత ధర్మాసనం చారిత్రాత్మక తీర్పును వెలువరించింది.

2లో..

## ప్రజలకు సాగు, త్రాగు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం - ఉప ముఖ్యమంత్రి మంత్రి బట్టి విక్రమార్క




**కన్నాయిగూడెం/ములుగు జిల్లా ప్రతినిధి, జులై 13 (భారత శక్తి) :** రాష్ట్రంలోని ప్రజలకు సాగు,త్రాగు నీటిని అందించడమే ప్రభుత్వ ఏకైక లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క తెలిపారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమక్క సాగర్ ప్రాజెక్ట్ వద్దకు హెలికాప్టర్ లో చేరుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క, నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవిన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లకు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటిడిఏ పి.ఓ. లెనిన్ వత్సల్ టోప్పో, డి ఎఫ్ ఓ వికాస్ మినాలు వారికి

2లో..

## పవన్‌కు ఫ్యాన్స్ ఎక్కువ..

### ఇప్పుడే జనాల్లోకి రాకుండా విశ్రాంతి తీసుకోమని చెప్పాను: సీఎం చంద్రబాబు



**అమరావతి (భారత శక్తి)** జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ హైదరాబాద్, : జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థుల మధ్య కుల వివక్షను దూరం చేసేందుకు కీలక చర్యలు చేపట్టామని వ్యాఖ్యానించారు. ప్రతీ నియోజకవర్గంలో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే అకడమిక్ ఇయర్ నుంచి వీటిని అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను అందించేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేశామని సీఎం వ్యాఖ్యానించారు. విద్యార్థులకు

2లో..




## కేంద్ర సహకారంతోనే తెలంగాణ ప్రగతి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర అభివృద్ధికి ఎంపీలు నడుం బిగించాలి
- ఐఐఎం, మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవనానికి నిధులు తేవడమే లక్ష్యం
- సాగునీటి ప్రాజెక్టుల అనుమతులపై కేంద్రం చొరవ చూపాలి: ఎంపీల సమావేశంలో సీఎం స్పష్టీకరణ

**హైదరాబాద్ జూలై 13 (భారత శక్తి ):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం ఉంటేనే తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించగలమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లడానికి ఎంపీలంతా కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో నిర్వహించిన తెలంగాణ ఎంపీల ప్రత్యేక సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొని, రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా కేంద్రం నుంచి సాధించుకోవాల్సిన ప్రాజెక్టులు, నిధులపై సమగ్రంగా చర్చించారు.

2లో..

## ఇరాన్ సంచలన 'హిట్‌లిస్ట్'..

### ట్రంప్, నెతన్యాహు సహా 13 మంది ప్రపంచ నేతలే టార్గెట్

- నుదిటిపై టార్గెట్ మార్కులతో ఇన్‌ఫోగ్రాఫిక్ కలకలం
- జైలు దుస్తుల్లో అగ్రనేతల ఫోటోలు ప్రచురించిన ఇరాన్ మీడియా
- గల్ఫ్ ప్రాంతంలో ముదురుతున్న ఉద్రిక్తతలు

**ఇరాన్, జూలై 13:** పశ్చిమాసియాలో అమెరికా-ఇరాన్ (US-Iran వార్ ) మధ్య దాడులు ప్రతిదాడులతో యుద్ధం తీవ్రరూపం దాల్చిన వేళ సరికొత్త సంచలనం తెరపైకి వచ్చింది. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ఫిబ్రవరిలో జరిగిన వైమానిక దాడుల్లో మరణించిన సంగతి తెలిసిందే. ఆయన మరణానికి పక్కాగా ప్రతీకారం తీర్చుకుంటామని ఖమేనీ కుమారుడు, ప్రస్తుత ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ప్రతిజ్ఞ చేయగా తాజాగా ఇరాన్ ఇరాన్‌లోని

2లో..



## షాబాద్ నర హంతకుడు రాజ్‌కుమార్ మృతి

- కొత్తూరు మండలం పంజర్లలో రాజ్‌కుమార్ మృతదేహం లభ్యం.. - పోలీసులకు సమాచారం ఇచ్చిన స్థానికులు
- రాజ్‌కుమార్ మృతదేహం పక్కన పాయిజన్ బాటిల్ లభ్యం - మేనమామ ఊరిలో ఆత్మహత్యకు పాల్పడ్డ రాజ్‌కుమార్..
- షాబాద్‌లో బాలిక సహా ఆరుగురిని చంపిన రాజ్‌కుమార్

**హైదరాబాద్, జూలై 13(భారత శక్తి ):** తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన షాబాద్ ఆరుగురి హత్యల కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కుమార్ (35) ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం మధ్యాహ్నం కొత్వాల్ మండలం పెంజర్ల గ్రామ సమీపంలో నిందితుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం పక్కనే విషపు సీసా లభ్యమవడంతో అతను బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. గతంలో తనపై పోక్సో కేసు పెట్టిన మైనర్ బాలిక కుటుంబంపై కక్ష పెంచుకున్న రాజ్ కుమార్, ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చాడు. శుక్రవారం రాత్రి షాబాద్‌లోని సదరు బాలిక ఇంటికి వెళ్లిన నిందితుడు తొలుత బాలిక తల్లి లక్ష్మి (42), అమ్మమ్మ రుక్కమ్మ (60)లను కత్తితో కిరాతకంగా నరికి చంపాడు. అనంతరం మైనర్ బాలికను బలవంతంగా కారులో దైవలగూడ శివార్లలోని చెరువు వద్దకు తీసుకెళ్లి గొంతుకోసి హతమార్చాడు. బాలిక

2లో..



# పర్యావరణ విధ్వంసానికి పచ్చజెండా ఊపుతారా?



### 31 క్వారీలు.. అన్నీ అక్రమమే!

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో 2006లో జారీ చేసిన జీవో నంబర్ 89 ను అడ్డుపెట్టుకొని గత 15 ఏళ్లుగా బండరావిర్యాల, దేశ్‌ముఖి గ్రామాల్లో మైనింగ్ మాఫియా యథేచ్ఛగా చెలరేగిపోతోంది. ట్రిబ్యునల్ నియమించిన ఉమ్మడి కమిటీ జరిపిన శాస్త్రీయ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ఈ ప్రాంతంలో నడుస్తున్న 31 క్వారీలలో కేవలం 3 క్వారీలకు మాత్రమే చట్టబద్ధమైన పర్యావరణ అనుమతులు ఉన్నాయి!మిగిలిన 28 క్వారీలు ఎటువంటి అనుమతులు లేకుండా, నిబంధనలను బేఖాతర్ చేస్తూ నడుస్తున్నాయి. వీటితో పాటు 17 స్టోన్ క్రషర్ యూనిట్లు (రాయి పిండి చేసే కేంద్రాలు), 11 హాట్ మిక్స్ ప్లాంట్లు పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తున్నాయి.

### శాస్త్రీయ విశ్లేషణ: గాల్లో కలిసిన విషం.. ఊపిరి ఆరని వైనం!


ఉమ్మడి కమిటీ పరిశోధనల ప్రకారం, ఈ ప్రాంతంలో కాలుష్య నియంత్రణ చర్యలు పూర్తిగా శూన్యం. క్వారీల నుండి వెలువడే ౹్రావీ 10, ౹్రావీ 2.5 (సూక్ష్మ ధూళి కణాలు) గాలిలో విపరీతంగా పెరిగిపోయాయి. విండ్ బ్రేకింగ్ గోడలు, నీటి స్ప్రింక్లర్లు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. ఈ సిలికా ధూళి స్థానిక నివాసితుల ఊపిరితిత్తులను దెబ్బతీస్తూ, శ్వాసకోశ వ్యాధులకు కారణమవుతోంది. పొలాలపై ఈ రసాయన ధూళి మందంగా పేరుకుపోవడం వల్ల కిరణజన్య సంయోగ క్రియ (ఫ్రాష్ట్రశీశీంఎత్ష్రవంఱం) ఆగిపోయి, పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రైతులు వ్యవసాయాన్ని వదిలేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

### పులిచెర్ల కుంటను మింగేస్తుంటే నిద్రపోతున్నారా కలెక్టర్ గారూ?

నీటిపారుదల శాఖ నివేదికల ప్రకారం, బండరావిర్యాల గ్రామంలోని 'పులిచెర్ల కుంట'అనే చారిత్రాత్మక చెరువు మైనింగ్ మాఫియా చేతిలో పూర్తిగా రూపురేఖలు కోల్పోయింది. 13వ ప్రతివాది అయిన ఒక మెటల్ పరిశ్రమ ఏకంగా చెరువు లోపలి భాగంలో రోడ్లు వేసి, చెరువు కట్టను తెంచేసి ఆక్రమణలకు పాల్పడింది.ఇంత జరుగుతున్నా స్థానిక మండల రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్లు కళ్ళు మూసుకుని కూర్చోవడంపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ ఆస్తులను, జలాశయాలను రక్షించాల్సిన బాధ్యతను విస్మరించినందుకు అధికారుల తీరును తప్పుబట్టింది.

### హరిత ధర్మాసనం నిశ్చయాత్మక ఆదేశాలు:

ధర్మాసనం బాధితుల పక్షాన నిలబడుతూ, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా క్రింది ఆదేశాలను జారీ చేసింది:కలెక్టర్లు, రెవెన్యూ యంత్రాంగానికి హెచ్చరిక: రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల కలెక్టర్లు తక్షణమే నీటిపారుదల శాఖతో కలిసి రంగంలోకి దిగాలి. పులిచెర్ల కుంట చెరువును పాత స్థితికి తీసుకురావాలి. చెరువు పరివాహక ప్రాంతంలో వేసిన అక్రమ రోడ్లను, వ్యర్థాలను తక్షణమే తొలగించాలి. గరిష్ట నీటి మట్టం (Full Tank Level - FTL) సర్వే నిర్వహించి సరిహద్దులు నిర్ణయించాలి. భవిష్యత్తులో ఆక్రమణలు జరిగితే అధికారులదే పూర్తి బాధ్యత.మైనింగ్ శాఖకు కఠిన ఆదేశాలు: చట్టప్రకారం పర్యావరణ అనుమతి (జుజ) లేని ఏ ఒక్క క్వారీ కూడా ఒక్క రోజు కూడా



నడవడానికి వీల్లేదు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం 'ఉల్లంఘన కేటగిరీ' కింద ఉన్న సంస్థలు తుది అనుమతులు వచ్చేవరకూ పనులు పూర్తిగా నిలిపివేయాలి.కాలుష్య నియంత్రణ మండలి (TGPCB) కి టాస్క్: స్థాపన అనుమతి (CTE), నిర్వహణ అనుమతి (CTO) లేని అన్ని స్టోన్ క్రషర్, హాట్ మిక్స్ ప్లాంట్లను తక్షణమే శాశ్వతంగా మూసివేయాలి.

### రైతులకు పాక్షిక ఊరట.. కానీ న్యాయం జరగాలి!

కాలుష్యం కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు కనీస మద్దతు ధర ఆధారంగా లిరూ. 2,88,672/- పరిహారంగా ఇవ్వాలని కమిటీ లెక్కగట్టింది. పర్యావరణాన్ని నాశనం చేసి కోట్లు గడించిన మాఫియాపై, వారికి సహకరించిన అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకున్నప్పుడే బాధితులకు పూర్తి న్యాయం జరుగుతుందని స్థానిక నివాసితులు డిమాండ్ చేస్తున్నారు. ఈ తీర్పుతోనైనా నిద్రపోతున్న ప్రభుత్వ యంత్రాంగం మేల్కొంటుందా లేదా అనేది చూడాలి!

# హైరైజ్ కమిటీ 'మాయాజాలం'..








### నోటీసుల వెనుక 'అంతర్యం' ఏంటి?

ప్రస్తుత ప్రభుత్వం నీటిపారుదల శాఖ (ఇరిగేషన్ విభాగం) ఇచ్చిన ఫిర్యాదుతో 'హైడ్రా' (HYDRAA), మరియు జీహెచ్ఎంసీ (+ఎవీజ) సంయుక్తంగా రంగంలోకి దిగి ప్రదీప్ కన్స్ట్రక్షన్స్‌కు చెందిన 17 అంతస్తుల నిర్మాణం పూర్తిగా అక్రమమని తేల్చి, నోటీసులు జారీ చేసింది. అయితే ఇక్కడే అసలైన పరిశోధనాత్మక ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. లిమొదటి తప్పు ఎవరిది?: రెవెన్యూ విచారణ లేకుండా, నీటిపారుదల శాఖ నుంచి ఎలాంటి అభ్యంతర పత్రం (చీూజ) తీసుకోకుండా అసలు టౌన్ ప్లానింగ్ విభాగం ఈ ఆకాశహర్మ్యానికి పచ్చజెండా ఎలా ఊపింది?

**హైరైజ్ కమిటీ ఉత్తి డొల్లేనా?:** నగరంలో బహుళ అంతస్తుల నిర్మాణాలను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన 'ఉన్నత స్థాయి భవన నిర్మాణ కమిటీ' (హైరైజ్ బిల్డింగ్ కమిటీ) ఈ భారీ ఉల్లంఘనను ఎలా కళ్ళు మూసుకుని ప్రోత్సహించింది? దీని వెనుక చేతులు మారిన 'మూటల' కథ ఎంత?

### ఆన్‌లైన్ వ్యవస్థల మాయాజాలం!

"నగరీకరణ సులభతరం, అవినీతి రహితం" అంటూ గత ప్రభుత్వం ప్రచారం చేసిన టీఎస్-బీపాస్ లోని పారదర్శకత లోపాన్ని ఈ ఘటన బట్టబయలు చేసింది. నిన్న టీఎస్-బీపాస్, నేడు 'బిల్డ్ నౌ'... పోర్టల్స్ పేర్లు మారినా తెరవెనుక చీకటి దందాల రూటు మారలేదనే విమర్శలు వస్తున్నాయి. ఆన్‌లైన్ సిస్టమ్ అని చెబుతూనే, కీలకమైన చెరువుల ఎఫ్‌టీఎల్ మ్యాపులను, బఫర్ జోన్ డేటాన్ని ప్రజా పోర్టల్‌లో స్పష్టంగా ఉంచకుండా చీకట్లో ఉంచారు. ఇదే అదునుగా సామాన్యుల దరఖాస్తులను చిన్న చిన్న కారణాలతో తిరస్కరించే అధికారులు, ప్రదీప్ రెడ్డి లాంటి బడా బాబుల ఫైళ్లను మాత్రం టేబుల్ కింద చేతులు మారుస్తూ క్షణాల్లో క్లియర్ చేసేశారనే ఆరోపణలు ఉన్నాయి. సామాన్యుడి గుడిసెపై ప్రతాపం చూపే వ్యవస్థ, వందల కోట్ల సామ్రాజ్యాల ముందు మోకరిల్లడం మన నయా పారదర్శకతకు నిదర్శనం. పర్యావరణాన్ని బలిపెడుతూ, చారిత్రక సంపదను మింగేస్తున్న ఈ అధికార యంత్రాంగం తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. కేవలం తాత్కాలిక స్వార్థం కోసం చట్టాన్ని తుంగలో తొక్కిన వారు భవిష్యత్తులో చట్టపరమైన చర్యలకు గురికాక తప్పదు.

### ముఖం చాటేసిన యాజమాన్యం.. నిఘా వర్గాలు తేల్చాల్సింది ఏంటి?






ఈ అక్రమ వ్యవహారాలపై 'భారత శక్తి' వరుసగా కథనాలు ప్రచురించినా యంత్రాంగంలో చలనం లేకపోవడం గమనార్హం. దీనిపై వివరణ కోరేందుకు ప్రదీప్ కన్స్ట్రక్షన్స్ కార్పొరేట్ కార్యాలయానికి వెళ్లగా, అక్కడ సమాధానం చెప్పే వారే కరువయ్యారు. వందల కోట్ల నిర్మాణ సౌధం రేపు వివాదాల్లో చిక్కుకుని కొనుగోలుదారులు గగ్గోలు పెడితే ప్రభుత్వం బాధ్యత వహిస్తుందా? ప్రభుత్వం కేవలం నోటీసులతో కాలయాపన చేయకుండా, ఈ అక్రమ అనుమతుల వెనుక ఉన్న టౌన్ ప్లానింగ్ అధికారులను, హైరైజ్ కమిటీ సభ్యులను తక్షణమే విధులనుంచి తొలగించి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. వారి ఆస్తులపై లోతైన దర్యాప్తు జరిపితేనే వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది. ఇప్పటికైనా ఉన్నత స్థాయి నిఘా విభాగాలు, ప్రభుత్వ పెద్దలు ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి తక్షణ చర్యలు తీసుకోవాలని 'భారత శక్తి' డిమాండ్ చేస్తోంది.

# ప్రజలకు సాగు, త్రాగు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

సోమవారం పుష్ప గుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు.ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి తుపాకులగూడెం సమ్మక్క సారలమ్మ బ్యారేజీ గోదావరి నది నీటి ప్రవాహాన్ని నీటి నిల్వ పరిస్థితులను పరిశీలించి, తుపాకులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గుట్టల గంగారం జె చొక్కా రావు దేవాదుల ప్రాజెక్టు వాటర్ పాయింట్ ను, మోటార్ల పనితీరును, ఎత్తిపోతల సామర్థ్యం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవిన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో దేవాదుల ప్రాజెక్ట్ పెండింగ్ పనులు, భూ సేకరణ, ఎత్తిపోతల సామర్థ్యం, సాగు త్రాగునీరు, మోటార్ల పనితీరు పలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను ముందుగానే అంచనా వేసి, రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాగునీరు, తాగునీటి అవసరాలను పూర్తి స్థాయిలో తీర్చేందుకు ప్రజా ప్రభుత్వం దూరదృష్టితో కార్యాచరణ చేపట్టిందని తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న ఎల్‌నినో పరిస్థితుల వల్ల తెలంగాణ రాష్ట్రంలో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్న సందర్భంగా ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్గం తో కలిసి పలు మార్లు విస్తృత స్థాయిలో సమీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.గోదావరి నదిలో ప్రవహిస్తున్న నీటిని గరిష్ఠ స్థాయిలో వినియోగించుకోవాలని, ఎక్కడెక్కడ నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందో అక్కడ ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఇందుకోసం ఎంత వ్యయంతో కూడుకున్న , విద్యుత్ బిల్లులు ఎంత భారమైనా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వెనుకాడబోమనే స్పష్టమైన నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుందని పేర్కొన్నారు.గోదావరి జలాలను లిఫ్ట్ చేసి వ్యవసాయ భూములకు సాగునీరు అందించడం, చెరువులను నింపడం, భూగర్భ జలాలను పెంపొందించడం, గ్రామీణ ప్రాంతాలకు, పట్టణాలకు తాగునీటిని సమృద్ధిగా అందించడం లక్ష్యంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.దేవాదుల ఎత్తిపోతల పథకం రాష్ట్రంలోని లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే అత్యంత కీలక ప్రాజెక్టు అని, ఈ ప్రాజెక్టు సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించి రైతులకు నమ్మకమైన నీటి వనరును అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో తీసుకుంటున్న ఈ చర్యల వల్ల ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటూ, రైతాంగ ప్రయోజనాలను పరిరక్షించడం, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడడం, సాగునీటి వనరులను బలోపేతం చేయడం సాధ్యమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేవాదుల ఎత్తిపోతల పథకం రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య ఇస్తుందని, ప్రాజెక్టును పూర్తి సామర్థ్యంతో వినియోగించి రైతులకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.దేవాదుల ప్రాజెక్టు పనుల పురోగతి, పంపింగ్ వ్యవస్థ, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, భూసేకరణ, పెండింగ్ పనులు తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించి, అధికారులతో కలిసి ప్రాజెక్టు భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకున్నామని స్పష్టం చేశారు.దేవాదుల ప్రాజెక్టులో ఉన్న 10 పంపుల్లో 7 పంపులు పనిచేస్తున్నాయని, మరో ఒకటి రెండు రోజుల్లో అన్ని 10 పంపులను పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ములుగు, వరంగల్ చీఫ్ ఇంజనీర్లను ఆదేశించారు.ప్రాజెక్టు పరిధిలోని 22 రిజర్వాయర్లలో వివిధ దశల్లో నీటిని నింపుతున్నామని, ఒక్క రిజర్వాయర్ కూడా ఖాళీగా ఉండకుండా పూర్తి సామర్థ్యంతో నింపడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ప్రాజెక్టు పనులకు సంబంధించి రూ.194 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు సమీక్షలో వివరించారని, ఆర్థిక శాఖ మంత్రి సహకారంతో ఆ రూ.194 కోట్ల నిధులను వెంటనే విడుదల చేస్తున్నట్లు సభాముఖంగా ప్రకటించారు.ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని తెలిపారు. అవసరమైన నిధులు ఎంతైనా ప్రభుత్వం సమకూరుస్తుందని, భూసేకరణ కారణంగా ప్రాజెక్టు పనులు ఎక్కడా ఆగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.దేవాదుల ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 38.16 టీఎంసీలు అని పేర్కొంటూ, ఆ సామర్థ్యానికి అనుగుణంగా నీటిని ఎత్తిపోసి ప్రాజెక్టు రూపకల్పనలో ఉన్న మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించే దిశగా పనులను వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు. కొత్త ఆయకట్టు, స్థిరీకరణ ఆయకట్టు రెండింటికీ నీరు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.ప్రాజెక్టు అమలులో



ఎక్కడైనా సాంకేతిక లేదా పరిపాలనాపరమైన అడ్డంకులు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని చీఫ్ ఇంజనీర్లకు సూచించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం గోదావరి జలాలను అత్యధికంగా వినియోగించి తెలంగాణ చరిత్రలోనే అత్యధిక వ్యవసాయ విస్తీర్ణంలో పంటలు సాగు చేశామని తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక వరి దిగుబడులు ప్రజా ప్రభుత్వ హయాంలోనే నమోదయ్యాయని చెప్పారు.యాసంగి సీజన్‌లోనే 84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించి, వరి కొనుగోళ్ల రూపంలో సుమారు రూ.84 వేల కోట్లకు పైగా చెల్లింపులు చేశామని, యాసంగి పంటకే రూ.19 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో పనిచేస్తోందని స్పష్టం చేశారు.దేవాదుల ప్రాజెక్టు ద్వారా సుమారు 6.14 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని, ఇందులో దాదాపు 92 శాతం ఆయకట్టు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉండగా, మిగిలిన భాగం నల్లగొండ జిల్లాలో విస్తరించి ఉందన్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రాజెక్టును సందర్శించి, ఏడాది వ్యవధిలో పూర్తిచేయాలని స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారని తెలిపారు. ఆ లక్ష్య సాధన కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఇంజనీరింగ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర సహకారంతోనే
# తెలంగాణ ప్రగతి

### హైదరాబాద్‌కు 'ఐఐఎం'.. బీజేపీ ఎంపీలదే బాధ్యత!

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు ప్రతిష్టాత్మక భారతీయ నిర్వహణ సంస్థ (ఐఐఎం)ను తీసుకురావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. ఈ విషయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి చెందిన రాష్ట్ర ఎంపీలు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. అలాగే, మహానగరంలో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు చేపట్టే మెట్రో రైలు విస్తరణకు కేంద్ర ప్రభుత్వ సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. మెట్రో విస్తరణకు సంబంధించిన రుణాల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.

### భూసేకరణ పూర్తి.. 'ఆర్ఆర్ఆర్'కు నిధులు తేవాలి

రాష్ట్ర ఆర్థిక రంగానికి ఊతమిచ్చే ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణంలో ప్రధాన ఘట్టమైన భూసేకరణ ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇక కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులను త్వరితగతిన రప్పించుకుని ఆర్ఆర్ఆర్ నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాల్సి ఉందన్నారు. దీంతో పాటు ప్రతిష్టాత్మక మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి 'పట్టణ సవాలు నిధి' (అర్బన్ ఛాలెంజ్ ఫండ్) అనుమతులు వచ్చేలా ఎంపీలు గట్టిగా ప్రయత్నించాలని ఆదేశించారు.

"కేంద్రం సహకరిస్తే బహిరంగంగా ఒప్పుకుంటాం" "రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం సహకరిస్తే, ఆ విషయాన్ని మేం నిరభ్యంతరంగా, బహిరంగంగా చెబుతాం. కేంద్రం అందించే సహకారాన్ని అంగీకరించేందుకు మాకు ఎలాంటి అహంభావాలు, భేషజాలు లేవు. మాకు కావాల్సింది కేవలం తెలంగాణ అభివృద్ధి మాత్రమే."సాగునీటి ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ 'అభ్యంతర రహిత పత్రం' (చీూజ) తప్పనిసరిరాష్ట్రంలో సాగునీటి రంగానికి సంబంధించిన కీలక అంశాలను ముఖ్యమంత్రి ఈ సమావేశంలో ప్రస్తావించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి అభ్యంతర రహిత పత్రం (ఎన్ఓసీ) రావాల్సి ఉందన్నారు.

**డిండి ప్రాజెక్టు: 30 టీఎంసీలు**

**పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం: 90 టీఎంసీలు**

మొత్తం 120 టీఎంసీల నీటి వినియోగానికి సంబంధించిన ఈ ఎన్ఓసీ అంశం ప్రస్తుతం చర్చల దశలో ఉందని, ఈ వివాదాన్ని పరిష్కరించి అనుమతులు వేగంగా వచ్చేలా కేంద్ర ప్రభుత్వం కూడా చొరవ చూపాలని కోరారు. కేంద్రం నుంచి క్లియరెన్స్ వస్తే ఈ ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేయవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల తుంగభద్ర జలాశయం గేట్ల ప్రారంభోత్సవ పర్యటన సందర్భంగా కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ఈ విషయమై సుదీర్ఘంగా చర్చించినట్లు సీఎం గుర్తుచేశారు. అదేవిధంగా గోదావరి - కావేరి నదుల అనుసంధానం వల్ల తెలంగాణ రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

### పెండింగ్ అనుమతులపై ప్రత్యేక నిఘా

రాష్ట్ర రవాణా, పారిశ్రామిక రంగానికి ఊపునిచ్చే పలు కీలక ప్రాజెక్టుల అనుమతులను వీలైనంత త్వరగా సాధించాలని ముఖ్యమంత్రి ఎంపీలకు దిశా నిర్దేశం చేశారు. 1. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు క్లియరెన్స్ 2. రేవు అనుసంధానత (పోర్ట్ కనెక్టివిటీ) 3. బుల్లెట్ రైలు ప్రాజెక్టు ప్రతిపాదనలు 4. ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాల (ఎయిర్‌పోర్ట్స్) పునరుద్ధరణ, అనుమతులుఈ ప్రాజెక్టులన్నింటికీ కేంద్రంలోని వివిధ మంత్రిత్వ శాఖల నుంచి వీలైనంత త్వరగా అనుమతులు లభించేలా ఎంపీలు ఢిల్లీలో నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఇరాన్ సంచలన 'హిట్‌లిస్ట్'..

స్థానిక మీడియా ఒక సంచలన 'రివేంజ్ హిట్‌లిస్ట్' (హిట్ లిస్ట్ )ను విడుదల చేసింది.

### ట్రంప్, నెతన్యాహు సహా 13 మంది ప్రపంచ నేతలు!

ఇరాన్‌కు చెందిన ప్రముఖ అధికారిక దినపత్రిక 'హంషహ్రీ' ఒక ప్రత్యేక ఇన్ఫోగ్రాఫిక్‌ను ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. "ప్రతీకారం ఖాయం.. ఈ నేరగాళ్లు తమ పడకలపై ప్రశాంతంగా చనిపోలేరు" అంటూ మొజ్తాబా ఖమేనీ ఇచ్చిన హెచ్చరికతో పాటు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 13 మంది అగ్రనేతల ఫోటోలను జైలు దుస్తుల్లో ఉంచి, వారి నుదిటిపై టార్గెట్ మార్కులతో కూడిన హిట్‌లిస్ట్‌ను ప్రచురించింది. ఈ జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నంబర్-1 టార్గెట్‌గా ఉండగా.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, బ్రిటన్ ప్రధాని కైర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ సహా పలువురు ఐరోపా అగ్రనేతల పేర్లు ఉన్నాయి.

### ఉగ్రరూపం దాల్చుతున్న యుద్ధం.. హై అలర్ట్‌లో గల్ఫ్!

అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్లు కూడా ఈ లిస్ట్‌లో ఉండటంతో అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేగుతోంది. ఈ హిట్‌లిస్ట్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ.. ఇరాన్ హిట్‌లిస్ట్‌లో తాను నంబర్-1గా ఉన్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయని, ఒకవేళ అమెరికా నేతలపై ఇరాన్ ఎలాంటి సాహసానికైనా ఒడిగడితే ఇరాన్ ఉనికి లేకుండా భారీ సైనిక చర్య తీసుకుంటామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుతం హర్మూజ్ జలసంధిలో అమెరికా యుద్ధనౌకలు, ఇరాన్ దళాలు పరస్పరం క్షిపణులతో దాడులు చేసుకుంటుండటంతో గల్ఫ్ ప్రాంతం మొత్తం తీవ్ర యుద్ధ మేఘాల మధ్య అట్టుడుకుతోంది.

## షాబాద్ నర హంతకుడు రాజ్‌కుమార్ మృతి

కుటుంబాన్ని అంతం చేసిన అనంతరం నిందితుడు తన స్వగ్రామానికి చేరుకుని సొంత భార్య సరిత (30), నాలుగేళ్ల కుమారుడు, ఏడాదిన్నర వయసున్న మరో చిన్న కుమారుడిని సైతం అదే రీతిలో అత్యంత దారుణంగా చంపేశాడు. ఆ తర్వాత తన తండ్రికి ఫోన్ చేసి, "రెండు కుటుంబాల కథ ముగించాను, నేను కూడా చనిపోతున్నా" అని చెప్పి మొబైల్ స్విచ్ఛాఫ్ చేసి పరారయ్యాడు. ఘటన అనంతరం ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి ఆధ్వర్యంలో 8 ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. నిందితుడి కోసం ముమ్మరంగా వేట కొనసాగుతున్న తరుణంలోనే, సోమవారం పెంజర్ల పొలాల్లో రాజ్ కుమార్ శవమై తేలడంతో ఈ దారుణ ఉదంతం విషాదాంతంగా ముగిసింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పవన్‌కు ఫ్యాన్స్ ఎక్కువ..

బ్రేక్‌ఫాస్ట్, లంచ్ స్కూల్లోనే అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. విద్యార్థులకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ లోపల ఉన్న ప్రాంతంలో మొదటగా వీలైనన్ని తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను పెంచుతున్నామని వివరించారు.రాష్ట్రంలో ఉన్న ఎస్సీలకు వారి జనాభా శాతం కంటే ఎక్కువ అవకాశాలను కల్పిస్తున్నామని సీఎం వెల్లడించారు. రాజకీయాల్లో, ఇతర రంగాల్లో కీలక స్థానాల్లో ఎస్సీలకు అవకాశాలు కల్పించామని వ్యాఖ్యానించారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్నామని తెలిపారు. ఎస్సీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## బనకచర్ల ప్రాజెక్టుపై
# సుప్రీంలో విచారణ

అభ్యర్థనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ప్రధాన పిటిషన్లో లోపాలు ఉన్నాయని, లోపాలు సరిదిద్దే వరకు విచారణ చేపట్టడం కుదరదనిజస్టిస్ విక్రమ్నాథ్ ధర్మాసనం స్పష్టం చేసింది. పిటిషన్పై విచారణ జరపకుండా నోటీసులు కూడా ఇవ్వలేమని పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వ పిటిషన్ లో లోపాలు సరిదిద్దాకే విచారణ చేపడతామని వెల్లడించింది. నిబంధనలకు విరుద్ధంగా తెలంగాణ పిటీషన్ లిస్ట్ అయింది. నిబంధనల ప్రకారమే విచారణకు రావాలని ధర్మాసనం సూచించింది.అయితే అంతవరకూ ఏపీ ప్రభుత్వానికి నోటీసులివ్వాలన్న తెలంగాణ వాదననూ ధర్ఆయసనం పట్టించుకోలేదు

# సంపాదకీయం

భారత శక్తి VOICE OF INDIAN

## డిఫెన్స్ రంగంలోకి భారత్

వాస్తవానికి ప్రపంచ ఆర్థిక శక్తిగా అమెరికా ఉంది. తర్వాత స్థానంలో చైనా ఉంది. రష్యా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఈ జాబితాలో ఇండియా వచ్చి చేరింది. ఆర్థికంగా బలోపేతమైన స్థానంలో ఉంది. ఇప్పుడు డిఫెన్స్ రంగంలో కూడా భారత్ సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ఏకంగా చైనా కు దిమ్మ తిరిగే విధంగా షాకిచ్చింది.కొంతకాలం గా డిఫెన్స్ రంగంలో భారత్ అనేక రకాలుగా ప్రయోగాలు చేస్తోంది. కొత్త కొత్త ఆయుధాలను రూపొందిస్తుంది. వివిధ దేశాలతో ఒప్పందాలు కూడా కుదుర్చుకుంటున్నది. తన ఆయుధ శక్తిని ఇటీవల కాలంలో ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ప్రదర్శించింది. పాకిస్తాన్ లో ఉగ్రవాద శిబిరాల మీద దాడులు చేసింది. ఖచ్చితమైన లక్ష్యాల మీద దాడులు చేసి భారత్ తన స్థాయిని నిరూపించుకుంది. అయితే ఇక్కడితోనే భారత్ ఆగిపోవడం లేదు. ఏకంగా ప్రపంచ ఆయుధ శక్తులుగా వెలుగొందుతున్న అమెరికా, రష్యా తర్వాత భారత్ స్థానాన్ని సంపాదించుకుంది.భారతస్థాయిని డబ్ల్యూడిఎంఎంఏ సంస్థ తన వార్షిక ర్యాంకింగ్ ల ద్వారా ప్రకటించింది. ఈ జాబితాలో భారత్ మూడో స్థానంలో ఉండడం విశేషం. ఆధునికీకరణ.. లాజిస్టికల్ మద్దతు.. పరస్పరంగా చేసే దాడులు.. రక్షణ సామర్థ్యాలు వంటి ఆధారంగా ఈ రేటింగ్ ఇచ్చింది. ప్రత్యేకమైన మిషన్, ప్రత్యేకమైన బాంబర్ దళం, సిఏఎస్ శిక్షణ.. వంటి వాటిని డబ్ల్యూ డి ఎం ఎం ఏ పరిధిలోకి తీసుకుంది. ఇందులో అత్యధికంగా టీవీఆర్ స్కోర్ 242.9. దీనిని యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా సాధించింది. ఆ తర్వాత స్థానంలో రష్యా ఉంది. రష్యా తర్వాత భారత్ కొనసాగుతోంది.టీవీఆర్ రేటింగ్స్ ప్రకారం చూసుకుంటే యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా 242.9 పాయింట్లు తో మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో యునైటెడ్ స్టేట్స్ నేవీ విభాగం కొనసాగుతోంది. నేవీ విభాగానికి 142.4 టీవీఆర్ రేటింగ్ ఉంది. తర్వాత స్థానంలో 114.2రేటింగ్ తో రష్యన్ వైమానిక దళం కొనసాగుతోంది.. 112.6 టీవీఆర్ రేటింగ్ తో యునైటెడ్ స్టేట్స్ ఆర్మీ కొనసాగుతోంది. 85.3 టీవీఆర్ రేటింగ్ తో యునైటెడ్ స్టేట్స్ మెరైన్స్ కొనసాగుతోంది. భారత వైమానిక దళం 64.9 టివిఆర్ రేటింగ్ తో ఆరవ స్థానంలో కొనసాగుతోంది.. వాస్తవానికి దేశాల ప్రకారం చూసుకుంటే అమెరికా మొదటి స్థానంలో.. రష్యా రెండవ స్థానంలో.. ఇండియా మూడో స్థానంలో ఉంది. 63.8 టివిఆర్ రేటింగ్ తో చైనా నాలుగో స్థానంలో.. ర్యాంకు పరంగా ఏడవ స్థానంలో ఉంది. పరేషన్ సిందూర్ తర్వాత భారత్ సొంత రక్షణపై మరింత దృష్టిపెట్టింది. స్వదేశీ ఆయుధాల తయారీకి ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలో సరికొత్త ఆయుధాలను వేగంగా తయారు చేస్తోంది. ఇక ఇటీవలికాలంలో సముద్ర రక్షణపైనా మోదీ దృష్టి పెట్టారు. ఈమేరకు వివిధ దేశాలలో పర్యటిస్తూ.. సముద్ర రక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు భారత నౌకాదళాన్ని బలోపేతం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఐఎన్ఎస్ మహేంద్రగిరిని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ జాతికి అంకితం చేశారు. ప్రాజెక్ట్ 17ఏ కింద నిర్మించిన ఈ స్వదేశీ స్టెల్త్ ఫ్రిగేట్ భారతదేశ రక్షణ ఉత్పత్తి సామర్థ్యానికి మరో ముఖ్యమైన ఉదాహరణగా నిలిచింది. ఇది కేవలం ఒక నౌక కమిషనింగ్ మాత్రమే కాదు, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం వైపు సాగుతున్న ప్రయాణంలో ఒక మైలురాయి.ఈ యుద్ధనౌక స్టెల్త్ టెక్నాలజీతో తయారైంది. దీని రూపకల్పనతో శత్రు రాడార్ల నుంచి సులభంగా గుర్తించడం కష్టం. బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్షిపణులు, అధునాతన గగనతల రక్షణ వ్యవస్థలు, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధ సామర్థ్యాలు దీనిలో భాగం. ఇవి బహుముఖ యుద్ధ పరిస్థితుల్లో నౌకను అత్యంత సమర్థవంతంగా మార్చుతాయి. ఆధునిక ఆయుధ వ్యవస్థలతో సన్నద్ధమైన ఈ ఫ్రిగేట్ భారత నౌకాదళం మొత్తం సామర్థ్యాన్ని పెంచుతుంది.ఐఎన్ఎస్ మహేంద్రగిరి ప్రాజెక్ట్ 17ఏ కింద నిర్మించిన ఆరవ స్టెల్త్ ఫ్రిగేట్. ఈ ప్రాజెక్టు ద్వారా భారతదేశం విదేశీ సాంకేతిక సహాయం లేకుండా అధునాతన యుద్ధనౌకలను నిర్మించే సామర్థ్యాన్ని సాధించింది. స్వదేశీ నిర్మాణం వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా, సాంకేతిక జ్ఞానం స్వంతం అవుతుంది. ఇది రక్షణ రంగంలో ఆత్మనిర్భరతను పటిష్టం చేస్తుంది, భవిష్యత్తులో మరిన్ని నౌకల నిర్మాణానికి పునాది వేస్తుంది.రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హిందూ మహాసముద్రంలో శాంతి, స్థిరత్వానికి భారతదేశం ఒక ముఖ్యమైన భరోసాగా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశ వాణిజ్యంలో 90 శాతం కంటే ఎక్కువ సముద్ర మార్గాల ద్వారా జరుగుతుంది. అందువల్ల సముద్ర భద్రతను కాపాడడం ఆర్థిక వృద్ధికి, జాతీయ భద్రతకు అవసరం. భవిష్యత్ యుద్ధాల్లో కొత్త సాంకేతికతలను స్వీకరించాలని సైనిక బలగాలకు రాజ్‌నాథ్‌సింగ్ సూచించారు. ఇది కేవలం ప్రస్తుత సవాళ్లను ఎదుర్కొనడానికి మాత్రమే కాకుండా, రేపటి మారుతున్న యుద్ధ వ్యూహాలకు సిద్ధం కావడానికి కూడా ముఖ్యం.ఐఎన్ఎస్ మహేంద్రగిరి ఆగమనం భారతదేశం సముద్ర రక్షణ వ్యూహాన్ని బలపరుస్తుంది. హిందూ మహాసముద్రంలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో, అధునాతన స్టెల్త్ ఫ్రిగేట్లు భారత్‌ను 'నెట్ సెక్యూరిటీ ప్రొవైడర్'గా మార్చడానికి సహాయపడతాయి. స్వదేశీ నిర్మాణం ఆర్థికంగా లాభదాయకం మాత్రమే కాకుండా, విదేశీ ఆధారిత్వాన్ని తగ్గిస్తుంది. భవిష్యత్తులో సముద్ర యుద్ధాలు మరింత సాంకేతికంగా మారే అవకాశం ఉంది. సముద్ర భద్రతను కాపాడడం ద్వారా భారతదేశం తన ఆర్థిక ప్రయోజనాలను రక్షించుకోవడమే కాకుండా, ప్రాంతీయ శాంతిని కాపాడే బాధ్యతను కూడా నెరవేర్చగలుగుతుంది.

కొంతకాలంగా డిఫెన్స్ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతోంది. రీసర్చ్ అండ్ డెవలప్మెంట్ వింగ్ ను పూర్తిగా ఆధునికరిస్తోంది. కొత్త కొత్త ఆయుధాలను.. యుద్ధ విమానాలను.. మిస్సైల్స్ ను తయారు చేస్తోంది. అందువల్లే ఇండియా మూడో స్థానంలో ఉంది. ఇదే రేంజ్ గనక కొనసాగిస్తే భారత్ రష్యా స్థానాన్ని ఆక్రమించే అవకాశం ఉందని డిఫెన్స్ రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

## ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 13 (భారత శక్తి) 1 నుంచి 19 సంవత్సరాల వయసు ఉన్న వారందరికీ నులిపురుగుల నివారణ (ఆల్బెండజోల్) మాత్రలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం నిర్మల్ అర్బన్ మండలం సోఫీనగర్ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అంతర్జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆల్బెండజోల్ మాత్రల వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. ఆల్బెండజోల్ మాత్రల వల్ల నులిపురుగులు నశించి, రక్తహీనత రాకుండా ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం విధిగా మాత్రలను తీసుకోవాలని అన్నారు. విద్యార్థులంతా ఆహారం తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అనారోగ్యానికి గురికాకుండా ఉండేలా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, డీఈవో భోజన్న, ఇమ్యూనైజేషన్ అధికారి నయనా రెడ్డి, అధికారులు రవీందర్, ప్రిన్సిపల్స్ డానియల్, తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాలలో వైద్య శిబిరాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్.



నిర్మల్ జిల్లా ప్రతినిధి,జూలై 13 (భారత శక్తి): నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఐఏఎస్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆరోగ్య పరిరక్షణలో భాగంగా అల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేసి వాటి ఉపయోగాల గురించి వివరించారు. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, వసతి గృహం, భోజనశాల తదితర సౌకర్యాలను పరిశీలించి విద్యార్థినులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థినుల ఆరోగ్యం, విద్యకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థినులతో ముచ్చటించి వారి సమస్యలను తెలుసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భైంసాలో ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి.

**ప్రత్యేక అధికారులకు సబ్ కలెక్టర్ సంగీత్ కుమార్ ఆదేశం.**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 13 (భారత శక్తి) భైంసా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని భైంసా సబ్ కలెక్టర్ మండల స్థాయి ప్రత్యేక అధికారులను ఆదేశించారు. సోమవారం భైంసా పట్టణంలో నిర్వహించిన మండల స్థాయి ప్రత్యేక అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఇంటింటి సర్వే, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి ప్రత్యేక అధికారి తనకు కేటాయించిన ప్రాంతంలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. బీఎల్‌వోలు (BLO\T), సూపర్‌వైజర్లు, ఇతర సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని, వంద శాతం ఫారాల సేకరణ జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని పేర్కొంటూ, అర్హులైన ఓటర్లు అధికారులు అందించే సమాచారానికి సహకరించి, తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని సబ్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో మండల స్థాయి ప్రత్యేక అధికారులు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల

ఉత్కంఠకు తెరదించుతూ, ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే ఫలితాల లింక్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చారు. జూన్ 16 నుంచి 22 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) పద్ధతిలో ఈ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే.

### 50,544 మంది అర్హత.. 43.94 శాతం పాస్!

ఈ ఏడాది టెట్ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,53,752 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 1,15,028 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులు (In-service Teachers) 23,623 మంది ఉండగా, ఇతర అభ్యర్థులు 91,405 మంది ఉన్నారు. విడుదలైన ఫలితాల ప్రకారం మొత్తం మీద 50,544 మంది (43.94 శాతం) అభ్యర్థులు టెట్‌లో అర్హత (Qualified) సాధించారు. వీరిలో ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు 8,804 మంది క్వాలిఫై కావడం విశేషం.

### లైఫ్‌టైమ్ వాలిడిటీ.. ఇలా చెక్ చేసుకోండి!

జూలై 2 వరకు స్వీకరించిన ప్రాథమిక కీ అభ్యంతరాలను సబ్జెక్ట్ నిపుణుల కమిటీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తుది ఫలితాలను సిద్ధం చేశారు. టెట్ నిబంధనల ప్రకారం జనరల్ అభ్యర్థులకు 60 శాతం, బీసీలకు 50 శాతం, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు 40 శాతాన్ని అర్హత మార్కులుగా నిర్ణయించారు. ఈ పరీక్షలో క్వాలిఫై అయిన వారికి దక్కే టెట్ సర్టిఫికెట్ జీవితకాలం (లైఫ్ టైం వాలిడిటీ ) చెల్లుబాటు అవుతుంది. అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేసి అధికారిక పోర్టల్ https://tgtet.aptonline.in ద్వారా తమ మార్కుల మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

## వరుస పేపర్ లీక్‌లపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు..

విద్యార్థులు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలని పేర్కొన్నారు. విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం చేయాల్సిన వ్యవస్థ.. వారిని, వారి కుటుంబాలను అప్పులు, మానసిక ఒత్తిడి, నిరాశల వైపు నెడుతోందని ఆయన ఆరోపించారు. దేశంలో కొనసాగుతున్న అవినీతే పేపర్ లీక్ మాఫియాకు కారణమైందని రాహుల్ విమర్శించారు. పోటీ పరీక్షల కోసం సంవత్సరాల తరబడి కష్టపడిన లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ఈ మాఫియా ఒక్కసారిగా నాశనం చేస్తోందని ధ్వజమెత్తారు. వీటన్నింటినీ చూస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌనం వహిస్తున్నారని విమర్శించారు. జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికే ఈ అంశంపై కేంద్రం ముఖం చాటేస్తోందన్నారు. అలాగే దీనిని ప్రశ్నించాల్సిన మీడియా కూడా దీర్ఘకాలంగా మౌనంగా ఉందని ఎంపీ పేర్కొన్నారు.దేశ విద్యా రంగంలో విప్లవం అవసరమని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ చేపట్టిన 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమంలో విద్యార్థులంతా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. జులై 17న డెహ్రాడూన్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి హాజరై విద్యార్థుల గొంతుకను మరింత బలంగా వినిపిద్దామని అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఛాత్రోన్ కీ గూంజ్ రిజిస్ట్రేషన్‌కి సంబంధించిన లింక్‌ను ఎంపీ రాహుల్ గాంధీ తన పోస్టులో షేర్ చేశారు.

## వింబుల్డన్ కొత్త ఛాంపియన్‌గా నోస్కోవా... సిన్నర్ 'బ్యాక్ టు బ్యాక్' మ్యాజిక్

ఈ మెగా టోర్నీలో మహిళల విభాగంలో చెక్ రిపబ్లిక్ యువ సంచలనం లిండా నోస్కోవా సరికొత్త చరిత్ర లిఖించగా పురుషుల విభాగంలో ఇటలీ స్టార్ జాన్నిక్ సిన్నర్ తన ఆధిపత్యాన్ని చాటుకున్నారు.

### కన్నీటి సాక్షిగా.. కల నిజమైంది!

మహిళల సింగిల్స్ ఫైనల్లో చెక్ రిపబ్లిక్‌కు చెందిన 21 ఏళ్ల యువ సంచలనం లిండా నోస్కోవా అద్భుత విజయం సాధించి వింబుల్డన్ కొత్త రాణిగా అవతరించింది. శనివారం జరిగిన ఆల్-చెక్ ఫైనల్స్ పోరులో తన తోటి దేశస్థురాలు, గట్టి ప్రత్యర్థి కరోలినా ముచోవాపై 6-2, 5-7, 6-3 తేడాతో నోస్కోవా అద్భుత విజయాన్ని అందుకుంది. కెరీర్‌లో మొట్టమొదటి సారి ఒక గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు చేరిన ఈ యువ క్రీడాకారిణి, ఒత్తిడిని అధిగమించి ప్రతిష్టాత్మక ట్రోఫీని ముద్దాడింది. ట్రోఫీ అందుకున్న అనంతరం నోస్కోవా కోర్టులోనే తీవ్ర భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతమైంది. తన టెన్నిస్ కెరీర్ కోసం ఎంతో శ్రమించి, గత వింబుల్డన్ టోర్నీకి ముందే క్యాన్సర్‌తో మరణించిన తన తల్లికి ఈ చారిత్రాత్మక విజయాన్ని అంకితం ఇస్తున్నట్లు ప్రకటించి స్టేడియంలోని వారందరినీ కదిలించింది. -"అమ్మ ఎప్పుడూ నేను వింబుల్డన్ గెలవాలని కోరుకునేది.. ఈ రోజు తను పైనుంచి నన్ను చూసి గర్వపడుతుంటుంది"- అంటూ నోస్కోవా ఎమోషనల్ అయింది.

### సిన్నర్ 'బ్యాక్ టు బ్యాక్' మ్యాజిక్!

మరోవైపు పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ నంబర్ వన్, ఇటలీ స్టార్ ఆటగాడు జాన్నిక్ సిన్నర్ సంచలన ఫామ్‌ను కొనసాగిస్తూ టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు. ఆదివారం రాత్రి హోరాహోరీగా సాగిన ఫైనల్ పోరులో జర్మనీకి చెందిన సెకండ్ సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌పై 6-7 (7-9), 7-6 (7-2), 6-3, 6-4 తేడాతో సిన్నర్ పట్టుదలతో పోరాడి విజయం సాధించాడు. మొదటి సెట్ కోల్పోయినప్పటికీ, ఆ తర్వాత పుంజుకుని వరుసగా మూడు సెట్లు గెలిచి టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ విజయంతో వింబుల్డన్ చరిత్రలో వరుసగా రెండోసారి (బ్యాక్ టు బ్యాక్) టైటిల్స్ డిఫెండ్ చేసుకున్న 10వ ఆటగాడిగా సిన్నర్ ఓపెన్ ఎరాలో రికార్డు సృష్టించాడు. ఇది అతనికి కెరీర్‌లో 5వ గ్రాండ్ స్లామ్ టైటిల్ కావడం విశేషం.

## మళ్ళీ రాజకీయాల్లోకి జూనియర్..?



హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జూలై 13: టాలీవుడ్ అగ్రకథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ రాజకీయ అరంగేట్రంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న వార్తలకు ఎట్టకేలకు బ్రేక్ పడింది. జులై 18న తారక్ అధికారికంగా రాజకీయాల్లోకి రానున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని స్పష్టత వచ్చింది. ఈ ఊహాగానాలపై ఎన్టీఆర్ అభిమానుల సంఘం అధికారికంగా స్పందిస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది.

### అది సామాజిక సేవా కార్యక్రమం మాత్రమే!

జులై 18వ తేదీన అభిమాన సంఘాల ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'ఊరు-వాడ' కార్యక్రమానికి తారక్ పొలిటికల్ ఎంట్రీకి ఎలాంటి సంబంధం లేదని సదరు లేఖలో ఫ్యాన్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. ఇది పూర్తిగా ఒక సామాజిక సేవా కార్యక్రమం మాత్రమేనని వెల్లడించింది. సమాజ శ్రేయస్సు కోసమే ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపడుతున్నామని, దీనికి రాజకీయ రంగు పులమవద్దని అభిమానులు, ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ ప్రకటనతో గత కొద్దిరోజులుగా ఇటు సినీ, అటు రాజకీయ వర్గాల్లో రేకెత్తిన ఉత్కంఠకు తెరపడినట్లయింది. 'జులై 18న జరగనున్న ఊరు-వాడ కార్యక్రమానికి ఎప్పుడో ప్రణాళికలు రూపొందించాం. దీన్ని రాజకీయాలతో ముడిపెట్టొద్దు. అసత్య ప్రచారాలను నమ్మొద్దు. ఇలాంటి వాటిని ప్రచారం చేయొద్దని మీడియా సంస్థలు, సోషల్ మీడియా పేజీలకు విజ్ఞప్తి చేస్తున్నాం. దీని వల్ల అభిమానులు అనవసరంగా అయోమయానికి గురవుతున్నారు"


## బద్దిపల్లిలో ఓటర్ నమోదు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు

**కొత్తపల్లి మండలం(భారత శక్తి)** బద్దిపల్లి గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించిన ఓటర్ నమోదు కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సింగిరాల వెంకటస్వామి, బీఎల్‌ఏ మునిగల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవడం, వివరాలను సరిచూసుకోవడం యొక్క ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి అర్హుడూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

# దేవుడి పేరుతో 'సీతయ్య' దందా..!

- సూర్యాపేట ఉమామహేశ్వరస్వామి ఆలయంలో యథేచ్ఛగా భక్తుల దోపిడీ
- దేవాదాయ శాఖ పరిధిలో లేని ఆలయం - ఆడిగే నాథుడే కరువు
- రూ. 200 చెల్లిస్తేనే గర్భగుడిలోకి ప్రవేశం.. - బయటి పూజా సామగ్రికి నో ఎంట్రీ!
- ప్రశ్నిస్తే శాపనార్థాలు.. పర్సనల్ క్యూఆర్ (QR) కోడ్ తో నిత్యం లక్షల వసూళ్లు
- ఒక్క సోమవారమే 2000 పైగా టోకెన్ల విక్రయం.. - లెక్కాపత్రం లేని ఆదాయం






**సూర్యాపేట, భారత్ శక్తి జిల్లా ప్రతినిధి, జూలై 13:** సూర్యాపేట పట్టణంలోని సైనికపురి కాలనీలో ఉన్న శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయం ఆధ్యాత్మికతకు బదులు అక్రమ వసూళ్లకు అడ్డాగా మారింది. ఈ ఆలయం దేవాదాయ శాఖ పరిధిలో లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని 'సీతయ్య' అనే వ్యక్తి భక్తుల నుంచి యథేచ్ఛగా దోపిడీకి పాల్పడుతున్నాడు. "శివయ్య తర్వాత నేనే ఇక్కడ అంతా నా ఇష్టమే" అంటూ నిరంకుశంగా వ్యవహరిస్తున్న తీరుపై భక్తులు తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అభిషేకానికో రేటు.. దర్శనానికో రూలు

ఆలయంలో సీతయ్య చెప్పిందే వేదం, ఆయన పెట్టిందే రేటు అన్నట్లుగా పరిస్థితి తయారైంది. గుడి బయట ఏకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి పంచామృత అభిషేకానికి రూ. 200, రూ. 700 చొప్పున వసూలు చేస్తున్నారు. భక్తులు భక్తిశ్రద్ధలతో బయటనుంచి పాలు, కొబ్బరికాయలు తీసుకొస్తే వారిని గర్భగుడిలోకి అనుమతించరు, కనీసం స్వామివారి ముందు కొబ్బరికాయ కూడా కొట్టనివ్వరు. అక్కడే రూ. 200 చెల్లించి టికెట్ కొంటేనే గర్భగుడిలోకి ప్రవేశం, దైవ దర్శనానికి అనుమతి ఇస్తున్నారు. డబ్బులు ఇచ్చుకోలేని సామాన్య భక్తులను దూరంగా ఉన్న మరో లైన్లో నిలబెట్టి కేవలం దూరం నుంచే దర్శనం చేసుకునేలా నిబంధనలు పెట్టారు.

### ప్రశ్నిస్తే శాపాలు.. భయభ్రాంతులకు గురవుతున్న భక్తులు

గత కొన్నేళ్లుగా ఈ ఆలయంలో ఇదే తంతు కొనసాగుతోంది. రోజువారీగా వేల రూపాయలు, ప్రత్యేక దినాల్లో లక్షల రూపాయలు వసూలు చేస్తున్న సీతయ్య ఆ డబ్బుకు ఎటువంటి లెక్కలు చూపించడం లేదు. "దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే నేను శివయ్యను, నన్ను ప్రశ్నిస్తే మీకు శాపం తగులుతుంది" అంటూ భక్తులను, సామాన్యులను, చివరికి బాధ్యత గల జర్నలిస్టులను సైతం భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. భగవంతుడికి, భక్తుడికి మధ్య దళారిలా మారిన ఇతను గోడ మీద తన వ్యక్తిగత ఫోన్ పే (ఫ్రాష్ట్రశీఅవూవ) స్కానర్ పెట్టి, విరాళాలు, టికెట్ల డబ్బులను నేరుగా తన సొంత ఖాతాలోకి మళ్లించుకుంటున్నాడు. దీనిపై ఎవరూ నోరు మెదపకూడదని, ప్రశ్నిస్తే దేవుడి ఆగ్రహానికి గురవుతారని భయపెడుతున్నాడు.

### ఒక్క సోమవారమే లక్షల్లో ఆదాయం..లెక్కలు నిల్

ప్రత్యేక దినాల్లో ఈ దోపిడీ మరింత తారాస్థాయికి చేరుతోంది. ఉదాహరణకు, ఒక ప్రత్యేక సోమవారం రోజున దాదాపు 2000కు పైగా అభిషేకం టోకెన్లు అమ్ముడయ్యాయి.

ఒక్కో టోకెన్ కు కనీసం రూ. 200 చొప్పున చూసుకున్నా (అందులో రూ. 700 టోకెన్లు కూడా ఉన్నాయి) ఒక్క రోజే లక్షల రూపాయల ఆదాయం వచ్చింది.

కానీ ఆ లెక్కలు ఎవరికీ చెప్పాల్సిన అవసరం తనకు లేదని సీతయ్య దురుసుగా ప్రవర్తిస్తున్నాడు. ప్రతి సోమవారం, పండుగ రోజుల్లో జరిగే ప్రత్యేక పూజల ద్వారా వచ్చే లక్షల రూపాయలతో పాటు, ఆలయ ప్రాంగణంలో ఉన్న ఇతర చిన్న గుడుల వద్ద హుండీల నుంచి వచ్చే ఆదాయానికి సైతం ఎలాంటి జవాబుదారీతనం లేదు.

### అధికారులు స్పందించాలి

ఒక పవిత్రమైన దేవాలయాన్ని తన సొంత వ్యాపార కేంద్రంగా మార్చుకుని, భక్తుల మనోభావాలతో ఆడుకుంటున్న సీతయ్య వ్యవహారంపై జిల్లా యంత్రాంగం, దేవాదాయ శాఖ అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ఆలయాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని, భక్తులకు స్వేచ్ఛగా, ప్రశాంతంగా దర్శనం చేసుకునే అవకాశం కల్పించాలని, ఇప్పటివరకు గుడి పేరుతో జరిగిన వసూళ్లపై సమగ్ర విచారణ జరపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# భారత్ టెక్స్ 2026,మోదీ 5 ఎఫ్ విజన్ సాకారం

## - కేంద్ర వస్త్రాల శాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గరీటా



**న్యూ ఢిల్లీ, భారత శక్తి ప్రతినిధి, జూలై 13:** కశ్మీరీ పష్మినా ఇచ్చే అద్భుతమైన వెచ్చదనం నుంచి అస్సాంలోని ముగా సిల్క్ గంభీరమైన మెరుపు వరకు, శక్తివంతమైన రాజస్థానీ బంధానీ జ్యామితీయ నమూనాల నుంచి శాశ్వతమైన కాంచీవరం పట్టు, సుసంపన్నమైన శైలి వరకు, భారతదేశ భౌగోళిక మరియు సాంస్కృతిక వైవిధ్యం దారాలతో నేసిన ఒక సజీవమైన పటం. నేడు, ఈ అసమానమైన నాగరికతా ఒకే గొడుగు కిందికి వచ్చింది. జూలై 14 నుంచి 17 వరకు న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత్ మండపంలో 'భారత్ టెక్స్ 2026' ప్రారంభం, మన దేశంలోని అద్భుతమైన వైవిధ్యం ఒకే చోట ఆవిష్కృతమవుతోంది. వస్త్రాలు కేవలం మన వారసత్వ ప్రతిబింబం మాత్రమే కాదు; అవి భారతదేశ స్థూల ఆర్థిక నిర్మాణానికి ఒక బలమైన పునాది. జీడీపీకి 2.3%, పారిశ్రామిక ఉత్పత్తికి 13%, ఎగుమతులకు 8.6% సహకారం అందిస్తూ, ఈ రంగం వృద్ధి మరియు సమానత్వానికి ఒక భారీ ఇంజిన్గా నిలుస్తోంది. 10 కోట్లకు పైగా ప్రజలకు జీవనోపాధిని కల్పిస్తూ, వ్యవసాయం తర్వాత భారతదేశంలో రెండవ అతిపెద్ద ఉపాధి రంగంగా ఉంది. గ్రామీణ వర్గాలను బలోపేతం చేయడంతో పాటు దేశవ్యాప్తంగా లక్షలాది మంది మహిళల ఆర్థిక స్వయంప్రతిపత్తిని కల్పిస్తోంది. ఈ ఆర్థిక శక్తిని నిజంగా అభినందించాలంటే, భారత్ టెక్స్ను అనుభూతిని చెందాల్సిందే. తయారీ, సృజనాత్మకతలో మన పూర్తి ఆధిపత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా రూపొందించిన భారతదేశ అతిపెద్ద, ప్రపంచ స్థాయి వస్త్ర వాణిజ్య ప్రదర్శన ఇది. దేశీయ తయారీదారులు, రాష్ట్ర పెవిలియన్లు, అంతర్జాతీయ ప్రదర్శనదారులు, ప్రపంచ కొనుగోలుదారులను ఒకే చోటికి చేర్చే సమగ్ర మార్కెట్. దీని ద్వారా హై-వాల్యూ సోర్సింగ్, కార్పొరేట్ భాగస్వామ్యం, బ్రాండ్ ప్రదర్శన సాధ్యమవుతుంది. ఈ గొప్ప చొరవ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటే, భారత్ టెక్స్ మునుపటి రెండు ఎడిషన్లు తీసుకొచ్చిన అపారమైన గర్వం, స్పష్టత నాకు గుర్తుకొస్తున్నాయి. గత భారత్ టెక్స్ ఎడిషన్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వస్త్ర రంగాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, మనం నాటిన విత్తనం నేడు మహా వృక్షంగా ఎదుగుతోందని అభివర్ణించారు. ఈ గొప్ప ప్రదర్శన మన గొప్ప సంప్రదాయాలను జరుపుకోవడమే కాకుండా, అభివృద్ధి చెందిన భారత్ యొక్క అపారమైన అవకాశాలను కూడా తెలియజేస్తోందని ఆయన పేర్కొన్నారు. భారీగా అంతర్జాతీయ కొనుగోలుదారులను ఆకర్షించి, సహకార వేగాన్ని పెంచిన మొదటి రెండు ఎడిషన్ల అద్భుతమైన విజయం ఒక బలమైన పునాదిని వేశాయి. 'భారత్ టెక్స్ 2025' సమయంలో నా వ్యక్తిగత అనుభవం ప్రకారం, ప్రభుత్వం-ప్రభుత్వం మరియు వ్యాపారం-ప్రభుత్వం మధ్య జరిగిన చర్చలు ఆచరణాత్మక ఫలితాలుగా మారి భవిష్యత్తుపై సానుకూల దృక్పథాన్ని ఇచ్చాయి. అలాగే భారతదేశ కార్యాచరణ సామర్థ్యాలపై ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న నమ్మకాన్ని నిరూపించింది. ఈ మూడవ ఎడిషన్ ఆ వేగాన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ, గత సామర్థ్యాన్ని సంపూర్ణ పారిశ్రామిక ఆధిపత్యంగా మారుస్తుంది. ఈ సంవత్సర వేడుక స్థాయి ఒక అద్భుతమైన వ్యూహాత్మక పారిశ్రామిక ప్రణాళికను ప్రతిబింబిస్తుంది.

భారత్ మండపంలోని ప్రత్యేక ప్రదర్శన హాళ్లలో విస్తరించి ఉన్న ఈ ఎగ్జిబిషన్.. ఫైబర్, యార్న్, ఫ్యాబ్రిక్, అపెరల్ అండ్ ఫ్యాషన్, హోమ్ టెక్స్టైల్స్, టెక్నికల్ టెక్స్టైల్స్, అనుబంధ పరిశ్రమలతో కూడిన భారతదేశ పూర్తి వస్త్ర విలువ గొలుసును ప్రదర్శిస్తుంది. ప్రధాన మంత్రి మోదీ యొక్క పరివర్తనాత్మక 5ఎఫ్ విజన్: ఫార్మ్ టు ఫైబర్ టు ఫ్యాక్టరీ టు ఫ్యాషన్ టు ఫారిన్ ను ప్రతిబింబిస్తూ, 1,600 పైగా ప్రదర్శనదారులు వారి ప్రాంతీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని నేరుగా ప్రపంచ వేదికపైకి తీసుకువస్తున్నారు. మొత్తం విలువ గొలుసును ఒకే పారిశ్రామిక నిరంతర ప్రక్రియగా అనుసంధానించి, తయారీలోని ప్రతి దశను స్వదేశీంగా నిర్వహించగల భారతదేశ స్వయంసమృద్ధ సామర్థ్యాన్ని ఈ వేడుక ప్రదర్శిస్తుంది. ఈ ప్రతిపాదనకు ప్రపంచవ్యాప్తంగా లభించిన స్పందన అసాధారణమైనది. ఈ ఎడిషన్లో యునైటెడ్ స్టేట్స్, యునైటెడ్ కింగ్డమ్, జపాన్, పోర్చుగల్, స్పెయిన్, న్యూజిలాండ్, సౌత్ కొరియా, సౌత్ ఆఫ్రికా మరియు నేపాల్ తో పాటుగా 14 దేశాల నుంచి అంతర్జాతీయ ప్రదర్శనదారులు పాల్గొంటున్నారు. వీరితో పాటు ఐక్యరాజ్యసమితి, యూరోపియన్ యూనియన్ నుంచి బలమైన ప్రాతినిధ్యం ఉంది. దీర్ఘకాలిక భాగస్వామ్యాలను అన్వేషించేందుకు అనేక దేశాల నుంచి మంత్రుల ప్రతినిధి బృందాలు, ఉన్నత స్థాయి వ్యాపార ప్రతినిధులు పాల్గొంటున్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనలో ప్రదర్శించే 20,000 లకు పైగా వస్త్ర ఉత్పత్తులను సందర్శించేందుకు 110 కి పైగా నమోదిత దేశాల నుంచి 7,000 లకు పైగా కొనుగోలుదారులు, 1.3 లక్షల మంది వాణిజ్య సందర్శకులు వస్తారని భావిస్తున్నారు. ఈ వాణిజ్య కార్యకలాపాలకు తోడుగా 3,500 లకు పైగా బిజినెస్-టు-బిజినెస్ సమావేశాలు జరుగుతాయి. అలాగే వ్యక్తిగత భారతీయ రాష్ట్రాలు వారి ప్రత్యేక పారిశ్రామిక మౌలిక సదుపాయాలను ప్రదర్శించేందుకు ప్రత్యేక 'స్టేట్ ఇన్వెస్టర్ కనెక్ట్ సెషన్స్' ను కూడా నిర్వహిస్తారు. నిజమైన పారిశ్రామిక నాయకత్వానికి జ్ఞానం, భవిష్యత్తు ప్రణాళికపై లోతైన నిబద్ధత అవసరం. భారత్ టెక్స్ 2026 ఈ బాధ్యతను 'గ్లోబల్ టెక్స్టైల్ డైలాగ్' ద్వారా నెరవేరుస్తుంది. ఇందులో ప్యానెల్ చర్చలు, రౌండ్టేబుల్స్, మాస్టర్క్లాస్లు, స్టేట్ సెషన్స్, అవార్డ్స్ పిచ్ ఫెస్ట్లు, వర్క్షాప్లతో కూడిన 100 కి పైగా సెషన్లు ఉంటాయి. 370 మందికి పైగా అంతర్జాతీయ, జాతీయ సీఎక్స్ఓలు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తల నేతృత్వంలో జరిగే ఈ సెషన్లు.. వాణిజ్యం మరియు పెట్టుబడుల విస్తరణ, సాంకేతికత మరియు ఆవిష్కరణల పురోగతి, ఫ్యాషన్ మరియు క్రాఫ్ట్లను ఉన్నతీకరణ పై దృష్టి సారిస్తాయి. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, సంస్థాగత సహకారంలో పలు వ్యూహాత్మక ఒప్పందాలు మరియు రంగానికి సంబంధించిన నివేదికల ఆవిష్కరణలు కూడా ఈ వేడుకలో జరగనున్నాయి. ఈ చర్చలలో సుస్థిరత మరియు వనరుల పునరుత్పాదకత అనే కీలక అంశానికి పెద్దపీట వేశారు. మునుపటి ఎడిషన్లో ప్రధాని మాట్లాడుతూ, ప్రపంచ ఫ్యాషన్ రంగం 'పర్యావరణం కోసం ఫ్యాషన్' అనే విజన్ను ఎక్కువగా స్వీకరిస్తోందని, సుస్థిరత అనేది ఎల్లప్పుడూ భారతదేశ వస్త్ర వారసత్వంలో అంతర్భాగంగా ఉందని గుర్తుచేశారు. ఈ భారత్ టెక్స్ ఎడిషన్ ప్రపంచ పర్యావరణ సవాళ్లను ఒక భారీ అవకాశంగా మారుస్తోంది. వనరుల సామర్థ్యాన్ని పెంచడానికి, వ్యర్థాలను నిర్మూలించడానికి మన సాంప్రదాయ పద్ధతులను సరికొత్త ఆవిష్కరణలు ఎలా ఆధునీకరిస్తున్నాయో ఇది ప్రదర్శిస్తుంది. ఇది నేరుగా మన చేనేత కార్మికులకు, కళాకారులకు ప్రయోజనం చేకూరుస్తుంది. మన వస్త్రాల శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ సమర్థవంతమైన నాయకత్వంలో, మంత్రిత్వ శాఖ ఈ ఆధునీకరణ మరియు సుస్థిర వృద్ధి చర్యలను క్షేత్రస్థాయిలో వేగవంతం చేసింది. మన మొత్తం వస్త్ర విలువ గొలుసుకి బలమైన ఆధునిక సాంకేతికత, విస్తరించదగిన విధాన చట్రాలు, మెరుగైన మార్కెట్ అనుసంధాన మద్దతు ఉండేలా చూసింది. భారత్ టెక్స్ ద్వారా ప్రతిబింబిస్తున్న అసాధారణ స్థాయి మరియు ఆత్మవిశ్వాసం, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత దశాబ్ద కాలంగా అమలు చేసిన నిరంతర విధాన సంస్కరణల ఫలితమే. గత 12 ఏళ్లలో, మోదీ ప్రభుత్వం పరివర్తనాత్మక చర్యల ద్వారా వస్త్ర విలువ గొలుసులోని ప్రతి లింక్ను బలోపేతం చేసింది. వస్త్రాల కోసం ప్రవేశపెట్టిన ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ రూ.31,687 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించింది. ఇది మ్యాన్-మేడ్ ఫైబర్ దుస్తులు, బట్టలు, సాంకేతిక వస్త్రాలలో పెద్ద ఎత్తున తయారీని ప్రోత్సహిస్తూ భారీ ఉపాధిని సృష్టిస్తోంది. అదే సమయంలో, ప్రధాన మంత్రి 5ఎఫ్ విధానాన్ని ప్రతిబింబిస్తూ ఏడు 'పీఎం మిత్ర' పార్కులను సమగ్ర తయారీ పర్యావరణ వ్యవస్థలుగా అభివృద్ధి చేస్తున్నారు. క్షేత్రస్థాయి సాధికారత కూడా అంతే దృఢంగా ఉంది. నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ద్వారా 794 చేనేత క్లస్టర్లలో దాదాపు రూ.2,000 కోట్లు పెట్టుబడి పెట్టారు. దీని ద్వారా 1.17 లక్షల మంది చేనేత కార్మికులకు ఆధునిక మగ్గాలు, సుమారు 90,000 మంది కార్మికులకు నైపుణ్య శిక్షణను అందించారు.

అలాగే నేషనల్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ కింద హస్తకళల రంగానికి రూ.1,335 కోట్ల కంటే ఎక్కువ నిధులు కేటాయించారు. అంతేకాకుండా, 1.5 లక్షల కంటే ఎక్కువ మంది చేనేత కార్మికులను గవర్నమెంట్ ఇ-మార్కెట్ప్లేస్ పోర్టల్లోకి తీసుకువచ్చారు. 'వీవర్స్ ముద్రా స్కీమ్' ద్వారా దాదాపు 3 లక్షల మంది లబ్ధిదారులకు ఎలాంటి పూచీకత్తు లేని రుణాలను అందించారు. మన దేశీయ తయారీదారులు, కళాకారులు, ఆవిష్కర్తలను నేరుగా ప్రపంచ మార్కెట్లతో అనుసంధానించారు. ఈ వారం మనకు కనిపిస్తున్న భారీ ప్రపంచ స్థాయి వేడుక ముందడుగు కోసం ఈ సమగ్ర సంస్కరణలు మనల్ని నిర్మాణాత్మకంగా సిద్ధం చేశాయి. భారత్ మండపంలోని శక్తివంతమైన ప్రదర్శన హాళ్లను చూస్తున్నప్పుడు, మన దృక్పథం కేవలం ఈ వాణిజ్య ప్రదర్శన పరిధిని దాటి చాలా దూరం విస్తరిస్తుంది. భారతదేశ వస్త్ర పరిశ్రమను వి350 బిలియన్ల ప్రపంచ శక్తిగా మార్చాలనే మన 'విజన్ 2030' రోడ్మ్యాప్లో ఈ ఈవెంట్ ఒక కీలకమైన మైలురాయిగా నిలుస్తుంది. ఈ ప్రయాణం 'వికసిత్ భారత్ ఏ2047' జాతీయ లక్ష్యంతో సంపూర్ణంగా సరిపోలుతుంది. భారతదేశంలో సగర్వంగా రూపకల్పన, సుస్థిరంగా తయారీ, భారీ స్థాయిలో అనుసంధానమైన మన కార్మికుల అద్భుతమైన శక్తిని, సృష్టికర్తల ఆవిష్కరణలను, గ్లోబల్ టెక్స్టైల్స్ భవిష్యత్తును వీక్షించేందుకు.. రాబోయే నాలుగు రోజుల పాటు భారత్ టెక్స్ 2026 లో మాతో చేరాల్సిందిగా ప్రతి ఒక్కరినీ నేను ఆహ్వానిస్తున్నాను.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి

## - సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట





భద్రాచలం, జూలై 13 (భారతశక్తి): ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియ, ఎన్యుమరేషన్ ఫారాలలో ఓటర్ల నమోదు తీరును భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట పరిశీలించి పలు సూచనలు చేశారు. సోమవారం భద్రాచలం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ, మెడికల్ కాలనీ లలో ఇంటింటా చేపడుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు)తో మాట్లాడారు. కాలనీలలో ఇప్పటివరకు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాల వివరాలు, విధులు నిర్వహిస్తున్న బీఎల్వోల సంఖ్య, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై సబ్ కలెక్టర్ ఆరా తీశారు. సంబంధిత బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఫారాల పంపిణీతో పాటు ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ నిర్ణీత గడువులోగా ఫారాల సేకరణ చేపడుతున్నట్లు సబ్ కలెక్టర్ కు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పూర్తి పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటిని బీఎల్వోలు తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఓటర్ల నుంచి ఎన్యూమరేషన్ ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, అందులోని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు . అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి సత్వర పరిష్కారం చూపాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే ఈ కీలక కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని సబ్ కలెక్టర్ కోరారు. అధికారులు, బీఎల్వోలు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించి ఓటర్ల జాబితా సవరణను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఎల్వోలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులతో ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్న రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ ప పద్మావతి అశోక్ గౌడ్



మెదక్ జిల్లానర్సాపూర్, రెడ్డిపల్లి, జూలై 13 (భారతి శక్తిన్యూస్): గ్రామాభివృద్ధి, ప్రజా సేవలో ముందుండే రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్ జన్మదిన వేడుకలు సోమవారం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చిన్నారుల సమక్షంలో ఎంతో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధిగా తన జన్మదినాన్ని ఆర్భాటాలకు దూరంగా, చిన్నారులతో కలిసి జరుపుకోవడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్ పాఠశాల విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి, వారికి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులతో ముచ్చటిస్తూ వారి చదువు, ఆరోగ్యం, భవిష్యత్తుపై ఆరా తీశారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, తల్లిదండ్రులు ఉపాధ్యాయుల పేరు నిలబెట్టాలని ఆమె ఆకాంక్షించారు. గ్రామాభివృద్ధితో పాటు విద్య, పారిశుద్ధ్యం, తాగునీరు, మౌలిక సదుపాయాల కల్పనకు తమ పంచాయతీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని సర్పంచ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులకు అవసరమైన సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. జన్మదిన వేడుకల సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్కు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మరిన్ని సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగుతూ గ్రామాభివృద్ధికి విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భరత్ గౌడ్, వార్డు సభ్యుడు మహేష్ గౌడ్, ఆశా వర్కర్లు జ్యోతి, దేవి, నిర్మల, యువ నాయకులు లక్ష్మణ్ గౌడ్, కృష్ణ గౌడ్, విష్ణు, రాజు నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ




**జగిత్యాల, జూలై 13 (భారత శక్తి ప్రతినిధి):** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ధర్మపురి మున్సిపల్ చైర్పర్సన్ వేముల నాగలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగుల నివారణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం వైద్య సిబ్బంది సూచనల మేరకు ఆల్బెండాజోల్ మాత్రలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనబట్ల దినేష్, కౌన్సిలర్లు సంఘీ ఆనంద్, చీపిరి శెట్టి రాజేష్, ప్రశాంత్, పవన్ మరియు డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీనివాస్ డాక్టర్ శివకుమారి, డాక్టర్ వినయ్,వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గుట్టురట్టయిన పేకాట తావు ఐదుగురు అరెస్ట్, నగదు స్వాధీనం





భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల,జూలై 13: గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామ శివారులో జోరుగా సాగుతున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై సిహెచ్. శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.పోలీసుల కథనం ప్రకారం లింగన్నపేట గ్రామ శివారులోని పోచమ్మ దేవాలయం సమీపంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పేకాట ఆడుతూ పట్టుబడిన లింగన్నపేట గ్రామానికి చెందిన బుస దేవరాజు, ఆకుల శ్రీనివాస్, బుస శ్రీనివాస్, కాసం అంతయ్య, బండల వేణుగోపాల్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 21,100ల నగదుతో పాటు 5 మొబైల్ ఫోన్లు, 4 మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) హెల్ప్ డిస్క్ కార్యక్రమాన్ని పరిశీలించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్, జూలై 13(భారత శక్తి ):కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 277వ డివిజన్ మహాదేవపురం పరిధిలోని దేవేందర్ నగర్ గాజులరామారం సర్కిల్-గాజు=గా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) హెల్ప్ డిస్క్ కార్యక్రమాన్ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా హన్మంతన్నమాట్లాడుతూ, ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి పారదర్శకంగా, నిష్పాక్షికంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితమైన వివరాలను నమోదు చేయాలని అధికారులను కోరారు.ప్రజలు కూడా బీఎల్ఓలు అందజేసే ఎన్యుమరేషన్ ఫారమ్‌లను సక్రమంగా పూర్తి చేసి సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్న ఆయన, ప్రతి అర్హులైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం సామాజిక బాధ్యత అని అన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిద్ధునోళ్ళ సంజీవ్ రెడ్డి, డీసీసీ సెక్రటరీ గణేష్, ఐ.ఎన్.టి.యూ.సి నాయకులూ దేగుల సతీష్ బాబు, లలిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పెన్షన్ కోసం పోతే అకౌంట్ లో రూ.1500 కోట్లు.



పట్నా, జూలై 13(భారత శక్తి ): బిహార్ రాష్ట్రంలో నమ్మశక్యం కాని ఘటన వెలుగుచూసింది. ముజఫర్‌పూర్ జిల్లాలోని తటియా సిహో గ్రామానికి చెందిన కామేశ్వర్ మిశ్రా (82) అనే వృద్ధుడు తన నెలవారీ వృద్ధాప్య పింఛను డబ్బులు 1,100 విత్‌డ్రా చేసుకునేందుకు ఆదివారం స్థానిక కామన్ సర్వీస్ సెంటర్ (సి ఎస్ సి )కు వెళ్లాడు. డబ్బులు విత్‌డ్రా చేసిన అనంతరం ఖాతాలో మిగిలిన బ్యాలెన్స్ ఎంత ఉందో చూపించే 'రశీదు' (స్లిప్) చూసి అతడితో పాటు అక్కడ ఉన్న సిబ్బంది ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఆ వృద్ధుడి బ్యాంకు ఖాతాలో ఏకంగా 759.69 కోట్లు (7,59,69,51,951) ఉన్నట్లు స్క్రీన్‌పై దర్శనమిచ్చింది.

### కొడుకు ఖాతాలోనూ మరో 759 కోట్లు!

ఈ ఆశ్చర్యం నుంచి తేరుకోకముందే దివ్యాంగుడైన అతని కుమారుడు (దివ్యాంగ పింఛను లబ్ధిదారుడు) ఖాతాను కూడా అదే కేంద్రంలో తనిఖీ చేశారు. అక్కడ మరింత పెద్ద వింత ఎదురైంది. తండ్రి ఖాతాలో ఉన్నట్లే కొడుకు అకౌంట్‌లో కూడా దాదాపు అంతే మొత్తంలో 759 కోట్లకు పైగా బ్యాలెన్స్ చూపెట్టింది. ఇలా తండ్రీకొడుకుల ఇద్దరి ఖాతాల్లో కలిపి ఏకంగా 1,500 కోట్ల పైచిలుకు ధనం ఉన్నట్లు రశీదులు రావడంతో ఈ వార్త కాస్తా క్షణాల్లో ఊరంతా దావానలంలా వ్యాపించింది. పేద కుటుంబానికి చెందిన తాము రాత్రికి రాత్రే వందల కోట్లకు అధిపతులమయ్యామనే వార్తతో స్థానికులు పెద్ద ఎత్తున వారి ఇంటికి తరలివచ్చారు.

### ట్విస్ట్ ఇచ్చిన బ్యాంక్ అధికారులు.. అసలేం జరిగిందంటే?

ఈ భారీ అమౌంట్ విషయమై సదరు వృద్ధుడు స్పందిస్తూ "మా ఖాతాల్లోకి ఇంత పెద్ద మొత్తంలో డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో మాకు అస్సలు అర్థం కాలేదు. అందుకే వెంటనే బ్యాంకు అధికారులకు సమాచారం అందించాం" అని తెలిపాడు. దీనిపై రంగంలోకి దిగిన స్టేట్ బ్యాంక్ అధికారులు ఆ రెండు ఖాతాలను పరిశీలించి అసలు నిజం వెల్లడించారు. ఇది సాంకేతిక లోపం కారణంగా జరిగిన పొరపాటని, వారి ఖాతాల్లోకి నిజంగా ఎలాంటి సొమ్ము జమకాలేదని స్పష్టం చేశారు. కేవలం సర్వర్ సమస్య వల్ల స్క్రీన్‌పై, రశీదుపై మాత్రమే అంత పెద్ద అంకెలు కనిపించాయని, కొద్దిసేపటికే ఆ రెండు ఖాతాల్లోని బ్యాలెన్స్ యథాస్థితికి చేరుకుందని అధికారులు క్లారిటీ ఇవ్వడంతో కథ సుఖాంతమైంది.

# ఆసియా కోటా పెరిగితే భారత్‌కు లైన్ క్లియర్!

క్రీడా విభాగం (భారత శక్తి )జూలై 13: ప్రస్తుతం అమెరికా, మెక్సికో, కెనడాల్లో 48 జట్లతో సాగుతున్న ఫిఫా ప్రపంచకప్-2026 మెగా టోర్నీ సంచలన ప్రజాదరణతో ప్రస్తుతం సెమీఫైనల్స్ దశకు చేరుకుంది. ఈ టోర్నీకి వస్తున్న రికార్డు స్థాయి రెస్పాన్స్‌ను చూసి, తదుపరి 2030 శతాబ్ది ఉత్సవాల ప్రపంచకప్‌లో జట్ల సంఖ్యను ఏకంగా 64కు పెంచే ఆలోచన ఉన్నట్లు ఫిఫా అధ్యక్షుడు గియాన్ని ఇన్ఫాంటినో అధికారికంగా వెల్లడించారు. ప్రపంచంలోని ప్రతి దేశం వరల్డ్‌కప్‌లో ఆడాలనే కలను నిజం చేసుకునేందుకు ఇదొక సదావకాశంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక మార్పు ఖరారైతే, భవిష్యత్తులో భారత్ కూడా మెగా టోర్నీ బరిలోకి దిగే అవకాశాలు మెండుగా ఉన్నాయంటూ సరికొత్త చర్చ మొదలైంది.

### - ఆసియా కోటా పెరిగితే భారత్‌కు లైన్ క్లియర్!

ప్రపంచకప్‌లో పాల్గొనే టీమ్‌ల సంఖ్యను 48 నుంచి 64కు పెంచితే, అదనంగా మరో 16 దేశాలకు అవకాశం లభిస్తుంది. దీనివల్ల ఏషియన్ ఫుట్‌బాల్ కాన్ఫెడరేషన్ (ఏఎఫ్‌సీ)కు దక్కే డైరెక్ట్ అర్హత (క్వాలిఫికేషన్) స్లాట్లు 5 నుంచి ఏకంగా 11 లేదా 12కు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆసియా ఖండంలోని ఫుట్‌బాల్ జట్లలో జపాన్, దక్షిణ కొరియా, ఇరాన్, ఆస్ట్రేలియా, సౌదీ అరేబియా మొదటి 5 స్థానాల్లో బలంగా ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో ఖతార్, ఇరాక్, ఉజ్బెకిస్థాన్, యూఏఈ, జోర్డాన్ దేశాలు రేసులో నిలుస్తాయి.

### - ఒమన్, చైనాలతో టీమ్ ఇండియా పోరు!

ప్రస్తుతం ఆసియా ర్యాంకింగ్స్‌లో 15వ స్థానంలో ఉన్న భారత్‌కు కూడా ఈ 64 జట్ల ఫార్మాట్ పెద్ద వరం కానుంది. ఆసియాకు దక్కే 11 లేదా 12వ చివరి స్లాట్ కోసం భారత్ ప్రధానంగా ఒమన్, బహ్రెయిన్, సిరియా, చైనా, వియత్నాం, థాయ్‌లాండ్ వంటి జట్లతో గట్టిగా పోటీ పడాల్సి ఉంటుంది. చిన్న జట్లకు కూడా వరల్డ్‌కప్‌లో ఆడే ఛాన్స్ ఇవ్వకపోతే ఆయా దేశాల్లో ఫుట్‌బాల్ గేమ్‌కు ఆదరణ తగ్గుతుందని ఫిఫా బాస్ పేర్కొన్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో బ్లూ టైగర్స్ (భారత జట్టు) ప్రపంచ వేదికపై గర్జించడం ఖాయంగా కనిపిస్తోంది.



# విజయవాడలో నకిలీ హెచ్‌యూఐడి ఉపయోగించిన లేజర్ మార్కింగ్ యంత్రాన్ని స్వాధీనం చేసుకున్న బీఐఎస్ విజయవాడ






విజయవాడ, జూలై 13(భారత శక్తి ): నకిలీ హెచ్‌యూఐడి ఉపయోగించిన లేజర్ మార్కింగ్ యంత్రాన్ని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్), విజయవాడ బ్రాంచ్ ఆఫీస్ వారు స్వాధీనం చేసుకున్నారు. 13 జూలై 2026న మెస్సర్స్ లక్ష్మీ దేవిజ్యువెలరీ, 27-14-34, షాప్ నెం.16, గ్రౌండ్ ఫ్లోర్, బాలాజీ జ్యువెల్ వరల్డ్, గవర్నర్ పెట లలో విజయవంతమైన సోదాలు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. ఆపరేషన్ సమయంలో బి. రాజగోపాల్ (జాయింట్) సహా బిఐఎస్ అధికారుల బృందం డైరెక్టర్), షణ్ముఖ శివ పల్లి (జాయింట్ డైరెక్టర్), దుర్గం వివేక్ వర్ధన్ రెడ్డి (డిప్యూటీ డైరెక్టర్), హాల్‌మార్కింగ్ ప్రతినిధులు బిడిఎన్ మల్లేశ్వరావుతో పాటు పుట్ట అజయ్ కుమార్, ఫస్ట్ ఫ్లోర్ లోని న షాప్ నెం.10 నుండి ఒక లేజర్ మార్కింగ్ యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఫ్లోర్, ఏపీ జ్యువెల్ మార్కెట్, గవర్నర్ పేట, విజయవాడ, ఇది మార్కింగ్ ప్రాంతంపైన పేర్కొన్న ప్రధాన దుకాణం. నకిలీ వాటిని ముద్రించడానికి ఆ యంత్రాన్ని ఉపయోగిస్తున్నారు. చెల్లుబాటు అయ్యే గుర్తింపు లేకుండా BIS హాల్‌మార్క్‌లు అదనంగా, ఒక డిజిటల్ వీడియో రికార్డర్, ఒక కంప్యూటర్ మరియు నకిలీ హాల్‌మార్క్‌లు ఉన్న రెండు బంగారు చెవిపోగులు స్వాధీనం చేసుకున్నారు. తద్వారా తప్పనిసరి హాల్‌మార్కింగ్ నిబంధనలను స్పష్టంగా ఉల్లంఘించినట్లుబిఐఎస్ చట్టం, 2016 ప్రకారం వారిపై బిఐఎస్ చట్టంలోని సెక్షన్ 29 కింద చర్యలు చర్యలు తీసుంటామని శ్రీమతి ప్రేమ్ సజనీ పట్నాల, సైంటిస్ట్-ఇ / డైరెక్టర్ & BIS హెడ్, విజయవాడ బ్రాంచ్ వారు తెలిపారు.2016, BIS చట్టం 2016లోని సెక్షన్ 15 (3) కింద ఉల్లంఘనకు, ఇది ఇలా నిర్దేశిస్తుంది:- 1 సంవత్సరం వరకు జైలు శిక్ష, లేదా- మొదటి ఉల్లంఘనకు 1,00,000 కంటే తక్కువ కాకుండా జరిమానా- జరిమానా అనేది ఇందులో ప్రమేయం ఉన్న వస్తువుల విలువకు 5 రెట్ల వరకు విస్తరించవచ్చు. ఉల్లంఘన.- అదనంగా, ఈ నేరం విచారణార్హమైనది, మరియు దీనికి జైలు శిక్ష కూడా విధించవచ్చు.నేరం తీవ్రతను బట్టి, 1 సంవత్సరం వరకు జైలు శిక్ష, లేదా జరిమానా మరియు జైలు శిక్ష రెండూ విధించవచ్చునని తెలిపారు. ఈ క్రింది భాగాలు నిజమైన హాల్‌మార్క్ గల బంగారంఆభరణం:హాల్‌మార్కింగ్ యొక్క ప్రామాణికతBIS కేర్ మొబైల్ యాప్‌లో ధృవీకరించబడిందిHUID నంబర్‌ను నమోదు చేయడం. BIS వినియోగదారులందరినీ ఇలా కోరుతోంది: - BIS కేర్ యాప్‌ను (గూగుల్ ప్లే స్టోర్ మరియు ఆపిల్ యాప్ స్టోర్‌లో లభిస్తుంది) ఉపయోగించండిధృవీకరణ వివరాలను సరిచూసుకోండి.- BIS మార్కుల (ISI, CRS, హాల్‌మార్క్, మొదలైనవి) దుర్వినియోగాన్ని నేరుగా దీ×ూ ద్వారా నివేదించండికేర్ యాప్. సమాచారం అందించిన వారి గుర్తింపులు గోప్యంగా ఉంచబడతాయి.అందువల్ల వినియోగదారులు హాల్‌మార్క్ దుర్వినియోగం (అనగా,HUID లేకుండా) / ISI మార్క్‌తో BIS విజయవాడ బ్రాంచ్ ఆఫీస్, ఛ56-2-11, మొదటి అంతస్తు, మార్క్‌ఫెడ్ బిల్డింగ్, ఏపీఐఐసీ కాలనీ రోడ్, ఆటో నగర్, విజయవాడ- 520007.
బిఐఎస్ కేర్ మొబైల్ యాప్‌ను ఉపయోగించి లేదా hvjbobis@bis.gov.in కు ఇమెయిల్ పంపడం ద్వారా కూడా ఫిర్యాదులు చేయండి.

## జాతీయ నులిపురుగుల దినోత్సవం ఆల్ఫోర్స్‌లో ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ.




నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 13(భారత శక్తి): జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనం అనంతరం ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు విద్యార్థులకు మాత్రలు వేయించారు. నులిపురుగుల నివారణతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటిన భైంసా పోలీసులు.. ఆత్మహత్యకు యత్నించిన మహిళకు ధైర్యం




నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూలై 13 (భారత శక్తి): కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనతో ఇంటి నుంచి బయటకు వచ్చిన ఓ మహిళకు భైంసా పోలీసులు సకాలంలో అండగా నిలిచి మానవత్వాన్ని చాటారు. పోలీసుల వివరాల ప్రకారం, ఆదివారం (జూలై 12) రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో భైంసా పట్టణంలోని నిర్మల్ చౌరస్తా వద్ద ఓ మహిళ ఒంటరిగా అనుమానాస్పదంగా సంచరిస్తుండగా భైంసా రూరల్ ఎస్సై సుప్రియ, పెట్రోలింగ్ సిబ్బంది గమనించారు. వెంటనే ఆమెను ఆపి వివరాలు తెలుసుకోగా, ఇంట్లో కుమారునితో జరిగిన మాటామాటల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై ఇంటి నుంచి బయటకు వచ్చానని, ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనతో ఉన్నానని ఆమె తెలిపింది.పరిస్థితి తీవ్రతను గుర్తించిన ఎస్సై సుప్రియ మహిళకు ధైర్యం చెప్పి, ఆమెకు అవసరమైన మానసిక భరోసా కల్పించారు. అనంతరం సురక్షితంగా ఆమెను ఇంటికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు, కుమారునికి అప్పగించారు.సోమవారం భైంసా టౌన్ పోలీసులు మహిళా పోలీసు సిబ్బందితో కలిసి ఆ కుటుంబాన్ని సందర్శించి కౌన్సిలింగ్ నిర్వహించారు. కుటుంబ సభ్యులు పరస్పరం అవగాహనతో, సామరస్య వాతావరణంలో జీవించాలని, కుటుంబ సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. అలాగే ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా భైంసా టౌన్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, కుటుంబ సమస్యలు లేదా మానసిక ఒత్తిడితో ఎవరూ ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోవద్దని, అవసరమైతే పోలీసుల సహాయం లేదా కౌన్సిలింగ్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ప్రజల భద్రత, సంక్షేమమే లక్ష్యంగా భైంసా పోలీసులు 24 గంటలూ అందుబాటులో ఉంటారని తెలిపారు.

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

### ఏఎంసీ వైస్ చెర్మన్ సాదుల పవన్ కుమార్




నంగునూరు, జులై 13(భారత శక్తి ): నంగునూర్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను అత్యంత కచ్చితత్వంతో పూర్తి చేయాలని, ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం సాదుల పవన్ కుమార్, నంగునూరు మండల కేంద్రంలో పర్యటించి, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని పరిశీలించారు. ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ఎలా జరుగుతోందో క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు, హెల్ప్‌డెస్క్‌ల పనితీరును కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు), సిబ్బందితో మాట్లాడి ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నితీష్, జీపీఓ దేవరాజు, ఎఫ్ ఏ నరసింగరావు, బిఎల్ఓల ఽరాజమల్లవ్వ, విమల, లక్ష్మి, లక్ష్మి, రేణుకా, జహీర్, స్వప్న, సుజాత, లావణ్య, బిల్ కలెక్టర్ అశోక్ కుమార్, లవన్ కుమార్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ముధోల్ నియోజకవర్గ రిపోర్టర్ కు అక్రిడిటేషన్ కార్డు అందజేసిన డిపిఆర్ ఓ. విష్ణువర్ధన్.



నిర్మల్, జిల్లా ప్రతినిధి, జూలై 13 (భారత శక్తి) రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మీడియా ప్రతినిధుల అక్రిడిటేషన్ కార్డుల రెండో జాబితాలో ఆమోదం పొందిన ముధోల్ నియోజకవర్గ రిపోర్టర్ జల్ల రాజేశ్వర్ జిల్లా ప్రజా సంబంధాల అధికారి (డిపిఆర్ఓ) విష్ణువర్ధన్ అక్రిడిటేషన్ కార్డును అందజేశారు.ఈ సందర్భంగా డిపిఆర్ఓ విష్ణువర్ధన్ మాట్లాడుతూ, అక్రిడిటేషన్ కార్డు జర్నలిస్టులకు అధికారిక గుర్తింపుతో పాటు మరింత బాధ్యతను కల్పిస్తుందని అన్నారు. ప్రజా సమస్యలను నిష్పాక్షికంగా వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని సూచించారు.

# షేక్ అహ్మద్‌కు అక్రిడిటేషన్ కార్డు అందజేసిన డిపిఆర్ఓ విష్ణువర్ధన్.



నిర్మల్, జిల్లా ప్రతినిధి, జూలై 13: (భారత శక్తి) రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మీడియా ప్రతినిధుల అక్రిడిటేషన్ కార్డుల రెండో జాబితాలో ఆమోదం పొందిన స్టాఫ్ రిపోర్టర్ షేక్ అహ్మద్కు అక్రిడిటేషన్ కార్డును జిల్లా ప్రజా సంబంధాల అధికారి (డిపిఆర్ఓ) విష్ణువర్ధన్ అందజేశారు. ఈ సందర్భంగా డిపిఆర్ఓ విష్ణువర్ధన్ మాట్లాడుతూ, అక్రిడిటేషన్ కార్డు జర్నలిస్టులకు అధికారిక గుర్తింపుతో పాటు బాధ్యతలను మరింత పెంచుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను నిష్పాక్షికంగా వెలుగులోకి తీసుకువస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. అక్రిడిటేషన్ కార్డు అందుకున్న షేక్ అహ్మద్ మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యలపై బాధ్యతాయుతంగా వార్తలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# కౌలు రైతులకు రైతు భరోసా అమలు చేయాలి

## నర్సాపూర్ ఆర్ డి ఓ కు జాతీయ మాల మహానాడు మెమోరండం


## మెదక్ జిల్లా అధ్యక్షులు కల్లూరి సంజీవ



మెదక్ జిల్లా నర్సాపూర్, జూలై 13 (భారత శక్తి న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు వెంటనే రైతు భరోసా పథకాన్ని అమలు చేసి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేస్తూ జాతీయ మాల మహానాడు మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు కల్లూరి సంజీవ్ ఆధ్వర్యంలో సోమవారం నర్సాపూర్ ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవులు మాట్లాడుతూ, రాష్ట్రంలో కౌలు సాగు చేసే రైతుల్లో అధిక శాతం మంది దళిత, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారేనని తెలిపారు. స్వంత భూమి లేకపోయినా భూములను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ రాష్ట్ర ఆహార భద్రతకు తమ వంతు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే పంట సాగుకు పెట్టుబడి భారమంతా భరిస్తున్న కౌలు రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాల నుంచి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో కౌలు రైతులకు రైతు భరోసా అందిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేస్తూ, ఆ హామీని వెంటనే అమలు చేసి అర్హులైన ప్రతి కౌలు రైతుకు రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. కౌలు రైతుల సమస్యలను ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించి, వారి జీవనోపాధికి భరోసా కల్పించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు మెదక్ జిల్లా అధ్యక్షుడు కల్లూరు సంజీవ్, జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్ల ఆనంద్ కుమార్, యూత్ జిల్లా అధ్యక్షుడు దాడిగా నరేష్, ఎంఆర్‌పీఎస్ జిల్లా సీనియర్ నాయకుడు మన్నె భిక్షపతి, నవీన్, మైపాల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళ హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

## మెదక్ కోర్టు సంచలన తీర్పు



మెదక్ జిల్లా నర్సాపూర్, జూలై13(భారత శక్తి న్యూస్): మెదక్ జిల్లాలో సంచలనం సృష్టించిన మహిళ హత్య కేసులో నిందితుడికి మెదక్ జిల్లా జిల్లా ప్రధాన న్యాయస్థానం జీవిత ఖైదు విధిస్తూ కీలక తీర్పు వెలువరించింది. నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.25 వేల జరిమానా కూడా విధించింది. వివరాల ప్రకారం, మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఎల్లారెడ్డిగూడ తండా గ్రామపంచాయతీ పరిధిలోని జయరాం తండాకు చెందిన మెగావత్ భుజాలి (52) గతంలో హత్యకు గురయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, మహబూబ్‌నగర్ జిల్లా అయ్యగారిపల్లి తండాకు చెందిన కేతావత్ గోపాల్ (54) నిందితుడిగా గుర్తించి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలు, వాంగ్మూలాలను సమగ్రంగా పరిశీలించిన మెదక్ జిల్లా జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ సోమవారం నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ తీర్పు ప్రకటించారు. ఈ కేసులో పటిష్టమైన సాక్ష్యాధారాలను సమర్పించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, ప్రభుత్వ న్యాయవాది పాత్రను అధికారులు అభినందించారు.

# మహిళా భద్రతకు "సహచరి"

## మల్కాజిగిరి పోలీసులు తీసుకున్న విప్లవాత్మక నిర్ణయం

## తెలంగాణ పోలీసింగ్‌లో నూతన అధ్యాయానికి నాంది

## 'సహచరి' అమలులో ప్రభుత్వ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (SERP) భాగస్వామ్యం




ఎల్బీనగర్, జూలై 13 (భారత శక్తి): సమాజంలో మహిళల భద్రతను కేవలం చట్టపరమైన అంశంగా కాకుండా, సామాజిక బాధ్యతగా భావిస్తూ మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఒక విప్లవాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పోలీస్ కమిషనర్ శ్రీమతి బడుగుల సుమతి ఆధ్వర్యంలో ప్రారంభమైన "సహచరి" కార్యక్రమం తెలంగాణ పోలీసింగ్‌కు సరికొత్త దిశానిర్దేశం చేస్తోంది. మహిళల రక్షణ, సాధికారత, కుటుంబ సంక్షేమం, సామాజిక భద్రత అనే నాలుగు ప్రధాన స్తంభాలపై రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమం, పోలీస్ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు మహిళల్లో భద్రతా భావనను పెంపొందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ (రాజు-రా) ను భాగస్వామ్యం చేయడం విశేషం. మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాలు, పోలీస్ శాఖ, స్థానిక సమాజం కలిసి పనిచేసే సమగ్ర నమూనాగా"సహచరి" రూపొందింది. సమస్య వచ్చిన తర్వాత స్పందించడం కాదు... సమస్యలు తలెత్తకుండా ముందుగానే నివారించడం, బాధిత మహిళలకు అండగా నిలవడం, అవసరమైన చట్టపరమైన, మానసిక, సామాజిక సహాయాన్ని అందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది.

# ప్రజావాణిలో 114 దరఖాస్తులు స్వీకరణ అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

## - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జులై 13: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన 114 దరఖాస్తులను స్వీకరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులను కలెక్టర్ స్వయంగా వారి సమస్యలను తెలుసుకున్నారు. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ, వాటిని ప్రాధాన్యతతో పరిశీలించి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం పెండింగ్ దరఖాస్తులపై ఆరా తీశారు. తహసీల్దార్ లు, ఆయా శాఖల అధికారులు ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులతో పాటు, ఆయా సంక్షేమ, అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని, ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల



పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండరాదని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్ వి గిరి, పీడీసీ



రవితేజ, డిఆర్ఓ పాండు, జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆమె భద్రతకు "పోలీస్ అక్క" కార్యక్రమం

## - సూర్యాపేట జిల్లాల్లో పోలీస్ అక్క కార్యక్రమం ప్రారంభించిన- జిల్లా ఎస్పి - నరసింహ

## - మహిళలకు, బాలికలకు భద్రత కల్పించడమే లక్ష్యం-ఎస్పి నరసింహ

సూర్యాపేట (భారత శక్తి ప్రతినిధి) జులై 13: తెలంగాణ పోలీసు వినూత్నంగా చేపట్టిన బిపోలీసు అక్కబి అనే కార్యక్రమంలో భాగంగా ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయం నందు ఎస్పి నరసింహ ఐపిఎస్ గారి అధ్వర్యంలో మహిళా పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించి పోలీసు అక్క కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమం నందు అన్ని పోలీసు స్టేషన్ ల నుండి బిపోలీస్ అక్కబి లు హాజరైనారు. ఈ సందర్భంగా ఎస్పి గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పోలీస్ అధ్వర్యంలో డిజిపి గారు మహిళల, బాలికల, విద్యార్థినుల రక్షణ కోసం పోలీస్ అక్క అనే విశిష్టమైన, వినూత్నమైన కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగినది. సమాజంలో మహిళలకు, పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు దైర్యం కల్పించడం, పోలీసు స్టేషన్ కు వచ్చే మహిళా పిర్యాదుదారులకు, బాధితులకు భరోసా కల్పించడం, స్నేహపూర్వక వాతావరణంలో వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం చేయడం ఈ పోలీస్ అక్క కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. మహిళలు, విద్యార్థినులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా లేదా భయపడకుండా తమ సమస్యలను ఒక సొంత అక్కతో పంచుకున్నట్లు పోలీసులతో పంచుకునేలా చేయడం అన్నారు. మన సమాజంలో మహిళల, విద్యార్థినుల రక్షణలో, భద్రతలో ఎన్నో మార్పులు, ఎన్నో చట్టాలు ఆదునికరించబడ్డాయి, కొత్త చట్టాలు వచ్చాయి, షీ టీం, బరోసా సెంటర్, సఖీ సెంటర్, ఇలా అనేక రక్షణ విభాగాలు వచ్చాయి, సతీసహగమనం లాంటి పరిస్థితుల నుండి శాస్త్ర సాంకేతిక



అవిష్కరణలు చేయడం, చట్టాలను, ప్రభుత్వ పాలనను నడిపించే స్థాయికి మహిళలు ఏదిగారు అన్నారు. మహిళలకు హక్కులను సాధించడంలో ఎందరో మహానుభావులు కృషి చేసినారు. ఇలాంటి సమాజంలో ఇప్పుడు మహిళల, విద్యార్థినుల రక్షణ పోలీసు అక్క బాధ్యత అన్నారు. మహిళల, విద్యార్థినుల రక్షణలో పోలీసు అక్క పటిష్టంగా పని చేయాలని అన్నారు. పోలీసు స్టేషన్ కు వచ్చే బాధితులకు భద్రత, భరోసా కల్పించడం తో పాటుగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న బాలికల విద్యాలయాలను, కాలనీలోని మహిళా సంఘాలను సందర్శించి మహిళల రక్షణ చట్టాల గురించి, షీ టీం, బరోసా పోలీస్, పోక్సో చట్టాల గురించి అవగాహన కల్పించాలి అన్నారు. నెలలో ఒక రోజు బాలికల హాస్టల్స్ నందు నిద్రించి స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించాలి



అన్నారు. పోలీస్ యూనిఫాం ధరించి పోలీస్ అక్క ఆదర్శంగా ఉండాలని కోరారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళా కానిస్టేబుల్‌ను "పోలీస్ అక్క"గా నియమించాం అన్నారు. దీని ద్వారా ఆకతాయిల వేధింపులు, ర్యాగింగ్ బాల్య వివాహాల వంటి సామాజిక అరిష్టాల నివారణకు ఇది ఎంతో తోడ్పడుతుంది. బాధితుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతూ చట్టపరమైన చర్యలు కౌన్సెలింగ్ అందిస్తారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినులలో ఆత్మస్థైర్యం పెరిగి, తమకు ఏ సమస్య ఎదురైనా తక్షణమే స్పందించే ధైర్యం కల్గుతుంది అన్నారు. సమస్యలు, వేదింపులు ఉంటే డయల్.100, 112 లను సంప్రదించి పోలీసు సేవలు పొందవచ్చు అన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజు భార్గవి, మహిళా ఎస్ఐ లు మౌనిక, నీలిమ, జాన్సీ రాణి, ఏఎస్ఐ లు సైదాని, అరుణా దేవి, కవిత, మహిళా సూపరింటెండెంట్ సబితా రాణీ, శ్రీదేవి, అన్ని పోలీస్ స్టేషన్ ల పోలీసు అక్కలు పాల్గొన్నారు.

# ఎల్‌బీనగర్‌లో తీవ్ర ఉద్రిక్తత

## - యుద్ధభూమిగా మారిన జాతీయ రహదారి

- యాదగిరిగుట్ట పాలకమండలి సభ్యురాలిపై అనుచిత వ్యాఖ్యలు.. బీసీ సంఘాల ఆగ్రహం
- యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడి నివాసం వద్ద పరస్పర దాడులు.. రాళ్లు, కర్రలతో విరుచుకుపడ్డ ఇరువర్గాలు
- పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసుల లాఠీఛార్జ్.. 10 కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు





హైదరాబాద్ జూలై 13 భారత శక్తి: రాజధాని నగరంలోని ఎల్‌బీనగర్ ప్రాంతం ఒక్కసారిగా రణరంగంగా మారింది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యురాలు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌పై రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి అనుచరులు అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు తీవ్ర ఘర్షణకు దారితీశాయి. ఈ ఘటనను నిరసిస్తూ బీసీ సంఘాలు ఉమ్మడిగా ఆందోళనకు దిగడంతో ఎల్‌బీనగర్ పరిసర ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

### - శివచరణ్ రెడ్డి నివాసం ముట్టడి.. రాళ్ల వర్షం

తమ సామాజికవర్గానికి చెందిన మహిళా నాయకురాలిని అవమానించడాన్ని నిరసిస్తూ భారీ సంఖ్యలో తరలివచ్చిన బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు శివచరణ్ రెడ్డి నివాసాన్ని ముట్టడించారు. ఆయన వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలకు, బీసీ సంఘాల ప్రతినిధులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అది కాస్తా ముదిరి ఇరువర్గాలు కర్రలు, రాళ్లతో పరస్పరం దాడులు చేసుకునే వరకు వెళ్ళింది. ఈ ఘర్షణలో పలువురికి గాయాలైనట్లు సమాచారం.

### - జాతీయ రహదారిపై బైఠాయింపు.. దిష్టిబొమ్మ దహనం

ఈ దాడి అనంతరం ఆగ్రహం వ్యక్తం చేసిన బీసీ సంఘాల నేతలు ఎల్‌బీనగర్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ, శివచరణ్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

### - బీసీ నేతల డిమాండ్:

"వెంటనే జక్కిడి శివచరణ్ రెడ్డిని పదవి నుంచి తొలగించి, కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలి. ఈ విషయమై ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, ఆందోళనలను మరింత ఉధృతం చేస్తాం."

### - రంగంలోకి పోలీసులు.. లాఠీఛార్జ్

పరిస్థితి చేతులు దాటిపోతుండటంతో సమాచారం అందుకున్న పోలీసులు భారీ బలగాలతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరువర్గాలను చెల్లాచెదురు చేయడానికి, శాంతిభద్రతలను అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చింది. ఆందోళనకారులను బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ప్రస్తుతం అక్కడ భారీగా పోలీసులను మోహరించి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

### - స్తంభించిన ట్రాఫిక్.. నరకప్రాయంగా మారిన ప్రయాణం

ఈ ఆకస్మిక ఆందోళనలు, ధర్నాల కారణంగా ఎల్‌బీనగర్ జాతీయ రహదారిపై సుమారు 10 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పరిస్థితిని చక్కదిద్ది, రద్దీని క్లియర్ చేయడానికి ట్రాఫిక్ పోలీసులకు గంటల సమయం పట్టింది. ఈ ఘటనతో ఎల్‌బీనగర్ పరిసర ప్రాంతాల్లో ఇంకా భయాందోళన వాతావరణం కొనసాగుతోంది.

# తండ్రి కష్టమే స్ఫూర్తి..


## - జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆల్ ఇండియా 550వ ర్యాంక్ సాధించిన పోలీస్ కానిస్టేబుల్ కుమారుడు - నర్ర రోహిత్

## - రోహిత్ ను అభినందించిన డీజీ (లా & ఆర్డర్) మహేష్ భగవత్, సివిల్ సప్లైస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

హైదరాబాద్, జూలై 13: భారతశక్తి, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సివిల్ సప్లైస్ విజిలెన్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నర్ర ప్రభాకర్ కుమారుడు నర్ర రోహిత్ ప్రతిష్టాత్మక జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో ఆల్ ఇండియా 550 వ ర్యాంక్ సాధించి జాతీయ స్థాయిలో విశేష ప్రతిభ కనబరిచాడు. ఇప్పటికే జేఈఈ మెయిన్స్‌లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రోహిత్, లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో దేశవ్యాప్తంగా 550వ ర్యాంకును సాధించాడు. ఈ విజయంతో దేశంలోని ప్రతిష్టాత్మక ఢిల్లీ ఐఐటీలలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించే అవకాశాన్ని పొందనున్నాడు. తండ్రి పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబం కోసం పడుతున్న కష్టాన్ని దగ్గరగా చూసిన రోహిత్, చదువే తన జీవితాన్ని మార్చే మార్గమని నమ్మి అంకితభావంతో సిద్ధమయ్యాడు. అతని కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం కలిసి ఈ అద్భుత విజయానికి కారణమయ్యాయి. నర్ర రోహిత్ సాధించిన ఈ ఘన విజయంపై తెలంగాణ డీజీ (లా అండ్ ఆర్డర్) శ్రీ మహేష్ భగవత్, ఐపీఎస్, అలాగే తెలంగాణ సివిల్ సప్లైస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఐపీఎస్ హర్షం వ్యక్తం చేశారు. రోహిత్‌ను, ఆయన తండ్రి నర్ర ప్రభాకర్‌ను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పోలీస్ సిబ్బంది కుటుంబాల పిల్లలు కూడా కృషి, పట్టుదలతో జాతీయ స్థాయిలో అత్యుత్తమ విజయాలు సాధించగలరని నర్ర రోహిత్ నిరూపించాడని వారు పేర్కొన్నారు. ఈ విజయం పోలీస్ కుటుంబాలకు మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అభినందించారు.



## ఘనంగా శ్రీ శ్రీ కట్ట మైసమ్మ తల్లి, శ్రీ శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవతల ఆలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం



కుత్బుల్లాపూర్, జూలై 13(భారత శక్తి ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ (కుత్బుల్లాపూర్ డివిజన్) పరిధిలోని జీడిమెట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ కట్ట మైసమ్మ తల్లి మరియు శ్రీ శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవతల ఆలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు విచ్చేసి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ కమిటీ సభ్యులకు బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి శుభాకాంక్షలు తెలియజేసశారు.ఈ కార్యక్రమం లో డా.ఎస్.మల్లారెడ్డి , కృష్ణ,జోగిని రాజు,మహిపాల్ రెడ్డి, దమ్మని కుమారస్వామి,వీరేష్, జోగిని రాజు,దమ్మని యశ్వంత్, మల్లేష్, లక్ష్మణ్, నాగరాజు, శోభన్, ఆంజనేయులు, మధు, దయాకర్,పాపయ్య దొర, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంగడిపేట్ గ్రామ బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం



కుత్బుల్లాపూర్, జూలై 13(భారత శక్తి ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ (పేట్ బషీరాబాద్ డివిజన్) పరిధిలోని అంగడిపేట్ గ్రామంలో గ్రామస్థులు నూతనంగా ప్రతిష్ఠించిన బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో గ్రామస్థులతో కలిసి బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎన్. సందీప్ గౌడ్, ఎం. శ్రవణ్ గౌడ్, శ్రీధర్ గౌడ్, ఎం. సంతోష్ గౌడ్, బి. సత్యనారాయణ, ఆర్. స్వామి గౌడ్, కే. సురేష్, కే. రాకేష్, ఎం. రోహన్ గౌడ్, ఎం. రాహుల్ గౌడ్, జి. హరీష్ గౌడ్, పి. సందీప్ గౌడ్, సూరి, ఎం. అశోక్ గౌడ్, పి. కుమార్ గౌడ్, శరత్, నరేందర్, కే. జైపాల్ గౌడ్, కే. కిరణ్ గౌడ్, నామదేవ్ గౌడ్, విష్ణు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## టేక్వాండో మార్షల్ ఆర్ట్ బెల్ట్ గ్రేడియేషన్ టెస్ట్ కార్యక్రమం




కుత్బుల్లాపూర్, జూలై 13(భారత శక్తి ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ (కుత్బుల్లాపూర్ డివిజన్) పరిధిలోని జీడిమెట్ల గ్రామంలోని న్యూ లిటిల్ లిల్లీ హై స్కూల్‌లో తెలంగాణ టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 8వ టేక్వాండో మార్షల్ ఆర్ట్ బెల్ట్ గ్రేడియేషన్ టెస్ట్ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్, బెల్టులు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ మంజుల ప్రకాష్ బర్మా, చీఫ్ ఎగ్జామినర్ ఏ. కిషోర్ కుమార్, జోగిని రాజు, ఎశ్వంత్, డి. శ్రీనివాస్, సంజీవ్ రెడ్డి, కోచ్‌లు రవీంద్ర కుమార్, శివరాజ్, నవాజ్, సంతోష్, పాపయ్య, సోనీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదమ్ముల మధ్య భూపోరు

### అన్న ట్రాక్టర్‌ను బావిలోకి నెట్టేసిన తమ్ముడు.. జైలుకు తరలింపు!




భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూలై 13: చందుర్తి మండలంలో అన్నదమ్ముల మధ్య చెలరేగిన భూవివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కక్షతో రగిలిపోయిన తమ్ముడు అన్నకు చెందిన లక్షల విలువైన ట్రాక్టర్‌ను ఏకంగా వ్యవసాయ బావిలోకి తోసేసిన అమానుష ఘటన వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం చందుర్తి గ్రామానికి చెందిన మార్త మల్లేశం తన వ్యవసాయ పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నిస్తుండగా, అతని సొంత తమ్ముడు మార్త లక్ష్మిరాజం అక్కడికి చేరుకున్నాడు. చట్టవిరుద్ధంగా పొలంలోకి దూసుకొచ్చిన లక్ష్మిరాజం ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ మెడిశెట్టి శంకర్‌పై రాయితో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిని అడ్డుకోబోయిన అన్న మల్లేశం, డ్రైవర్‌లపై నిందితుడు తిట్లపురాణం అందుకుంటూ చేతులతో విచక్షణారహితంగా దాడి చేశాడు. 'మళ్లీ ఈ భూమి వైపు వస్తే చంపేస్తా' అంటూ ప్రాణభీతి కలిగించేలా తీవ్ర హెచ్చరికలు చేశాడు. ఆనంతరం అక్కడే ఉన్న రూ. 5 లక్షల విలువైన ట్రాక్టర్ (నెం. టీజీ 23 ఏ 4807) ను పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి తోసివేసి ధ్వంసం చేశాడు. దీంతో బాధితుడు మల్లేశం పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన చందుర్తి ఎస్సై రమేష్ తక్షణమే స్పందించి కేసు నమోదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడు లక్ష్మిరాజంను శనివారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ముందు హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది. నిందితుడిని వేగంగా పట్టుకోవడంలో చురుకైన పాత్ర పోషించిన కానిస్టేబుళ్లు రవి, తిరుపతిలను ఎస్సై రమేష్ అభినందించారు.

# మెరిట్ ప్రకారమే గురుకుల సీట్లు

- ఆఫీస్‌కు రావద్దు, మధ్యవర్తులను నమ్మవద్దు
- తల్లిదండ్రులకు విజ్ఞప్తి
- సీట్లు ఇప్పిస్తామని ఎవ్వరైనా ప్రలోభపెట్టితే ఫోన్ చేయండి
- మధ్యవర్తులపై చర్యలు తీసుకుంటాం
- బిసీ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి

**హైదరాబాద్ (భారత శక్తి)** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాల సంస్థలో సీట్లు మెరిట్ ప్రకారమే కేటాయిస్తున్నామని, సీటు రానివారు ఆఫీస్, స్కూల్ చుట్టూ తిరగవద్దని సంస్థ కార్యదర్శి బడుగు సైదులు విజ్ఞప్తి చేశారు. 2026- 27 విద్యా సంవత్సరానికి మెరిట్ ప్రాతిపదికన ప్రవేశాలు జరుగుతున్నాయని, అర్హత గల వారికే సీట్లు కేటాయిస్తామని ఆయన వివరించారు. మెరిట్ ప్రకారం మొదటి విడత, రెండవ విడత సీట్ల కేటాయింపు జరిగిందన్నారు. 5వ తరగతిలో ,6,7,8 లో తరగతుల్లో బ్యాక్ లాగ్ సీట్లు ఇంకా ఏమైనా ఖాళీలు ఉంటే ఆన్ లైన్ లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి విద్యార్థుల మెరిట్ ఆధారంగా అర్హులైన వారికి సీటు కేటాయించబడుతుందన్నారు. ఇంటర్ కాలేజి లో ఎక్కడైనా సీట్లు ఖాళీ గా ఉంటే ఆ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సీటు రాని వారు ఆఫీస్ , స్కూల్ చుట్టూ తిరగవద్దని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది గురుకులాల్లో సీట్లకు పోటీ పెరిగిందని, సీటు రానివారు హైదరాబాద్ హెడ్ ఆఫీస్ లో కానీ, ఫీల్డ్ ఆఫీస్ లలో కానీ, స్కూలు చుట్టూ తిరిగి సమయం వృధా చేసుకోవద్దు అని ఆయన సూచించారు. సీటు కోసం ఎవ్వరి నుంచి దరఖాస్తులు స్వీకరించబడవని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సంస్థ కార్యాలయానికి రావద్దని, అడ్మిషన్లకు దరఖాస్తులు తీసుకోబడవని, మధ్యవర్తులను నమ్మవద్దని సూచించారు. ఎవరైనా సీట్లు ఇప్పిస్తామని చెప్పితే వారి మాట నమ్మవద్దని, అలా చెప్పిన వారి వివరాలు ఫోన్ : 040-23120496 ద్వారా తెలియజేయాలని ఆయన కోరారు. సీట్లు ఇప్పిస్తామని తల్లిదండ్రులను, విద్యార్థులను మోసం చేసేవారి పై పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుంటామని ఆయన హెచ్చరించారు.

### జిల్లా ప్రగతి, వివిధ అభివృద్ధి కార్యక్రమాల

## అమలుపై కలెక్టర్ సమీక్ష

**సిద్దిపేట (భారత శక్తి)**అధికారులు సమన్వయంతో పనిచేయాలని: జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా ప్రగతి, వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలుపై కలెక్టర్ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో డెంగ్యూ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలలు, హాస్టళ్ల పరిసరాల్లో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, వారానికి కనీసం ఒకసారి ఫాగింగ్ నిర్వహించాలని సూచించారు. శానిటేషన్ డ్రైవ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, స్పెషల్ ఆఫీసర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు హాస్టళ్లు, పాఠశాలల్లో నాణ్యమైన భోజనాన్ని అందించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.వనమహోత్సవం కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను ప్రతి శాఖ తప్పనిసరిగా పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గతంలో ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటిన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొంటూ, ఈ ఏడాది కూడా ప్రతి ఉద్యోగి ఒక మొక్కను నాటేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. అలాగే విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో ప్రకృతి, పోషకాహారంపై అవగాహన పెంపొందించాలని సూచించారు.అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ అందేలా ప్రత్యేక నమోదు కార్యక్రమం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు యూనిఫాంలు సకాలంలో అందేలా సంబంధిత శాఖల అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీకిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భవ్యతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

## వెంట వెంటనే పరిష్కరించాలి

### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జిల్లా ప్రతినిధి జులై 13 (భారత శక్తి) ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

### - జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జులై: 13: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లాలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ప్రతి అర్హత కలిగిన చిన్నారికి చేరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు.
సోమవారం కామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా అల్బెండాజోల్ మాత్రలు అందించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, కిశోరులకు సంవత్సరానికి రెండుసార్లు అల్బెండాజోల్ మాత్ర ఇవ్వడం ద్వారా నులిపురుగుల సమస్యను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. నులిపురుగుల కారణంగా పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక ఎదుగుదల మందగించడం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో అర్హులైన 2,46,177 మంది ప్రతి చిన్నారులకు , ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్ర అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు తప్పనిసరిగా మాత్ర వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని కోరారు. జూలై 20న నిర్వహించే మాప్-అప్ డే సందర్భంగా మొదటి విడతలో మాత్రలు తీసుకోలేకపోయిన పిల్లలకు తప్పనిసరిగా మాత్రలు అందచేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. జె.వెంకటి,ప్రోగామ్ అధికారి డాక్టర్.రోహిత్ కుమార్,కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, స్థానిక కౌన్సిలర్ అఖిల, జిల్లా విద్యాశాఖాధికారి మల్లికార్జున్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ చందన ప్రియ, ఎంఈఓ ఎల్లయ్య, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు వై. మాధవి, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల భూములు బలవంతంగా తీసుకోవటం అన్యాయం, అక్రమం.

- భూములు కోల్పోతున్న రైతుల ఆర్తనాదాలు ప్రభుత్వానికి వినిపించవా?
- రాజధానిగా అమరావతి అభివృద్ధి చెందాలి,
- రైతులకు న్యాయం చేయాలి .
- చిగురుపాటి బాబురావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు.
- భూములు కోల్పోతున్న రైతుల పంట పొలాలను పరిశీలించిన సిపిఎం నాయకులు.

**(భారత శక్తి)** రాజధాని ఉండవల్లి ప్రాంతంలో రైతులతో సంప్రదింపులు జరపకుండా, రైతుల వద్ద నుండి బలవంతపు భూసేకరణ చేయటం అన్యాయం, అక్రమమని, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబురావు అన్నారు. రాజధాని ప్రాంతమైన ఉండవల్లిలో సోమవారం సిపిఎం నాయకులతో కలిసి, సి ఆర్ డి ఏ, ప్రభుత్వం ఉండవల్లి రైతుల బలవంతపు భూసేకరణ చేసిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉండవల్లి రాజధాని సిపిఎం కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాబురావు మాట్లాడుతూ సీడ్ యాక్సిస్ రోడ్డు కోసం రైతుల భూములు తీసుకునేందుకు, దౌర్జన్యంగా బుల్డోజర్లతో రైతుల భూములను బలవంతంగా తీసుకున్నారని ఆయన విమర్శించారు. చట్టాలను లెక్కచేయకుండా, కోర్టులో వివాదం ఉండగా, కోర్టు తీర్పులు పట్టించుకోకుండా దౌర్జన్యంగా రైతుల పంట భూములు తీసుకోవటాన్ని సిపిఎం వ్యతిరేకిస్తుందని అన్నారు. మహిళలని చూడకుండా, విచక్షణ రహితంగా మహిళలను జుట్టు పట్టుకొని లాగివేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. భూములు కోల్పోతున్న రైతుల ఆర్తనాదాలు వినకుండా, ప్రభుత్వం భూములు లాక్కోవడం అన్యాయం అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధానిగా ఉండాలని రైతులే స్వయంగా ఉద్యమం చేస్తే, రైతులకు మద్దతు ఇచ్చిన కూటమి ప్రభుత్వం నేడు పేద రైతుల వద్ద నుండి దౌర్జన్యం చేసి, భూములు లాక్కోవడం అన్యాయం కాదా? అని విమర్శించారు. రాజధాని సమస్యను, భూముల సమస్యను జటిలం చేస్తున్నది సి ఆర్ డి ఏ, ప్రభుత్వమేనని బాబురావు ధ్వజమెత్తారు. రైతులతో సంప్రదింపులు జరిపి, ప్రస్తుత మార్కెట్ ధరను దృష్టిలో పెట్టుకొని, భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు.ఎకరం ఆరు, ఏడు కోట్ల విలువచేసే భూములను 73 లక్షల నుండి కోటి 20 లక్షలు అంటూ, రిజిస్ట్రేషన్ వేల్యూ తెలియకుండా ఆర్డర్ ప్రకటించటం దుర్మార్గమన్నారు. 12 సంవత్సరాల క్రితం 50 వేల ఎకరాల భూములు తీసుకున్న వాటికి ఫ్లాట్స్ కేటాయించడానికి, అభివృద్ధి చేయడానికి సమయం చాల లేదా అని ఎద్దేవా చేశారు. రైతులు సీడ్ ఆక్సిస్ రోడ్డుకి వ్యతిరేకం కాదని అన్నారు. మంత్రి నారాయణతో సహా సీఆర్డీఏ అధికారులు రైతులను భూములు ఇవ్వాలని, సీడ్ ఆక్సిస్ రోడ్డుకి పోగా మిగిలింది వదిలేస్తామని చెప్పారని ఆయన గుర్తు చేశారు. ప్రత్యామ్నాయంగా ఆరు నెలల్లో ప్లాట్లు వేసి అభివృద్ధి చేస్తామని అన్నారని చెప్పారు. భూములు ఇవ్వడానికి రైతులు సిద్ధంగా ఉన్నామంటూ, 9.3 పత్రాలతో అంగీకారం తెలిపినా, రైతుల భూములలో దౌర్జన్యంగా మట్టి వేశారని అన్నారు. మాట తప్పింది ప్రభుత్వమేనని, రైతులు కాదన్నారు. రాజధాని భూముల విషయంలో అన్యాయం జరుగుతున్నా, స్థానిక శాసన సభ్యులుగా ఉన్న నారా లోకేష్ నోరు మెదపడం లేదని విమర్శించారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మా ప్రభుత్వం వస్తే రైతులపై కేసులు ఎత్తివేస్తామని, రైతులకు న్యాయం చేస్తామని చెప్పారని అన్నారు. రైతులకు చేసే న్యాయం ఇదేనా? అని బాబురావు ప్రశ్నించారు. కొరియా, రష్యా, సింగపూర్ వంటి పెట్టుబడిదారులతో మాట్లాడే మంత్రి నారా లోకేష్ కు రైతులతో మాట్లాడే తీరిక లేదా అన్నారు. ఉండవల్లి, పెనుమాక గ్రామాలలో రైతుల భూములు బలవంతంగా తీసుకుంటే జనసేన చూస్తూ ఊరుకోదని చెప్పిన పవన్ కళ్యాణ్, జనసేన నేతలు పేదల భూములు లాక్కుంటుంటే ఎందుకు మాట్లాడరని సిపిఎం ప్రశ్నిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి భూ దాహం పట్టుకుందని అన్నారు. రెండవ దశ 43 గ్రామాలలో 1,43,000 ఎకరాలు భూ సేకరణ చేస్తామని అనడం దుర్మార్గమన్నారు. రాజధాని అంటే పారిశ్రామికవేత్తలకి, కాంట్రాక్టర్లకి, నాయకుల కేనా? రైతుల గోడు పట్టదా అని దుయ్యబట్టారు. తక్షణమే భూములు కోల్పోతున్న పేద రైతులకు న్యాయం చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఆరు, ఏడు కోట్ల రూపాయల విలువ గల భూములను సగానికి పైగా విలువను తగ్గించేసి, రైతుల వద్ద దౌర్జన్యంగా భూములు లాక్కోవడం సిపిఎం ఖండిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాజధాని ప్రాంతంలో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రైతులతో సంప్రదింపులు జరపకుండా, సి ఆర్ డి ఏ అధికారులు 200 మంది పోలీసుల బలగాలతో, బుల్డోజర్లతో పేద రైతుల భూములు లాక్కునేందుకు పూనుకోవటం దుర్మార్గమైన చర్య అని అన్నారు. రైతులతో సంప్రదింపులు జరపకుండా, అంగీకారం లేకుండా నిరంకుశంగా సి ఆర్ డి ఏ, ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, సిపిఎం రాజధాని నాయకులు కొత్రపోలు ఈశ్వరరెడ్డి, ఎస్.కె ఎర్ర ఫీర్, టి బక్కి రెడ్డి, కే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కదిరిలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన

- కదిరిలో భవన నిర్మాణ కార్మికుల స్థలాల కబ్జాలను వెంటనే అడ్డుకోవాలి.
- కబ్జాకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలి
- యస్, విష్ణు వర్ధన్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు

**(భారత శక్తి)**500 మంది కార్మికులకు జరిగిన అన్యాయానికి రెవెన్యూ అధికారులు బాధ్యత వహించాలి. మరణించిన 40 మంది కార్మికుల కుటుంబాల పట్టాలను కబ్జా చేసిన దళారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. నకిలీ పట్టాలు సృష్టించిన వారిని, వారికి సహకరించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేసి చట్టప్రకారం శిక్షించాలి. గత విచారణలో అక్రమాలు తేలినా చర్యలు తీసుకోకపోవడం అత్యంత దురదృష్టకరం. అసలైన భవన నిర్మాణ కార్మికులకు వారి స్థలాలను వెంటనే అప్పగించాలి. రెవెన్యూ శాఖలో అక్రమాలకు పాల్పడిన వారిపై నిష్పక్షపాత విచారణ జరపాలి. కార్మికుల హక్కులను హరించే భూ మాఫియాపై పోలీసులు చర్యలు తీసుకోవాలి కార్మికులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం ఆగదు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### హైదర్ బస్తీలో విద్యార్థులకు

## నోట్ బుక్స్ పంపిణీ

### - పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

**(భారత శక్తి)** బంగారు భవిష్యత్తు కు విద్య ఎంతో ప్రధానమైందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం రాంగోపాల్ పేట డివిజన్ హైదర్ బస్తీలో గల హిందీ మహా విద్యాలయం లో తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 160 మంది విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి విద్యా బోధన జరగాలంటే అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. పేద విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేసే గొప్ప కార్యక్రమం చేపట్టిన తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. విద్యార్థులు మంచిగా చదువుకోవాలని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లు అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, అత్తిలి అరుణ గౌడ్, అసోసియేషన్ ప్రతినిధులు అభిషేక్ విజయ్, శ్రీనాధ్, మాశెట్టి శ్రీనివాస్, విజయ్, డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు కిషోర్, ఆంజనేయులు, నార్ల దీపక్ గుప్తా, కోటేశ్వర్ గౌడ్, గణేష్, అభిషేక్, జనార్దన్, రాజు తదితరులు ఉన్నారు.

## రావులపాలెం కొత్తకాలనీలో

# యువకుడి దారుణ హత్య

**అంబేద్కర్ కోనసీమ(భారత శక్తి)** రావులపాలెం కొత్తకాలనీలో ఆదివారం అర్ధరాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది. అను సాయి అలియాస్ నల్ల సాయి (23) అనే యువకుడిని గుర్తుతెలియని వ్యక్తులు రాయితో తలపై బలంగా కొట్టి హత్య చేసినట్లు సమాచారం. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఈ దారుణ ఘటనతో కొత్తకాలనీ ప్రాంతంలో తీవ్ర కలకలం రేగింది. హత్యకు గల పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికానున్నాయి.

# శివాలయాలకు భక్తుల తాకిడి

**హైదరాబాద్(భారత శక్తి)**మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం ఒకేరోజు రావడంతో తెలుగు రాష్ట్రాల్లోని శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ప్రముఖ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలానికి రద్దీ భారీగా పెరిగింది. సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పాతాళగంగలో స్నానాలు ఆచరించి, భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకుంటున్నారు. దీంతో అధికారులు వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేశారు. వేములవాడ రాజన్న ఆలయంలోనూ భక్తుల రద్దీ పెరిగింది.

## ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన

# ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**- రైతు బీమా జీవో వెంటనే విడుదల చేయాలని వినతి**

**తూర్పుగోదావరి(భారత శక్తి)** సోమవారం నాడు తూర్పుగోదావరి జిల్లాలో పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కలిశారు. రైతుల పంటలకు బీమా సదుపాయం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే తన వ్యక్తిగత కార్యదర్శి రాజమౌళిని పిలిచారు. రైతు బీమాపై ఇప్పటికే ఆరో తేదీన ప్రభుత్వ ఉత్తర్వు జారీ చేయడం జరిగిందని తెలిపారు.ఉత్తర్వు జారీ అయినప్పటికీ ఇప్పటివరకు బహిరంగంగా విడుదల కాలేదని, దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వివరించారు. వెంటనే ఉత్తర్వును విడుదల చేసి అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.రైతుల సమస్యపై తక్షణమే స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతుల తరపున ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ధన్యవాదాలు తెలియజేశారు.

## అన్న అక్క మెంటర్‌షిప్‌తో జెడ్పీహెచ్ఎస్

# పద్మానగర్‌లో ప్రత్యేక శిక్షణ ప్రారంభం



**కరీంనగర్(భారత శక్తి)** ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు, ఉన్నత విద్యపై అవగాహన పెంపొందించేందుకు అన్న?అక్క మెంటర్‌షిప్ కార్యక్రమంలో భాగంగా జెడ్పీహెచ్ఎస్ పద్మానగర్‌లో ప్రత్యేక శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్) గణితశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఎం. అర్చన, కళాశాల విద్యార్థులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నోడల్ అధికారి మధు రాజేష్ మాట్లాడుతూ, డిగ్రీ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మార్గనిర్దేశం చేయడం ద్వారా ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఎం. దినేష్ కుమార్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం విద్యార్థులకు ఉన్నత లక్ష్యాల సాధనలో ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. డా. ఎం. అర్చన మాట్లాడుతూ, గణితం, సైన్స్‌తో పాటు ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, కెరీర్ అవకాశాలపై నిరంతర మార్గదర్శకత్వం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొనగా, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డా. పి. నితిన్ తదితరులు నిర్వాహకులను అభినందించారు.

## 42 ఏళ్ల తర్వాత ఎలగందుల

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

**- రేకుర్తిలో ఎస్ఎస్‌సీ 1984 బ్యాచ్ అపూర్వ సమ్మేళనం**



**కొత్తపల్లి(భారత శక్తి)** ఎలగందుల గ్రామానికి చెందిన 198384 విద్యా సంవత్సరపు పదో తరగతి (ఎస్ఎస్‌సీ) బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం రేకుర్తిలోని ల్యాంప్స్ ఫామ్ హౌస్ లో ఘనంగా జరిగింది. పాఠశాల విడిచి 42 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ఆత్మీయ కలయికలో మిత్రులంతా ఒకే వేదికపై చేరి బాల్యస్మృతులను నెమరువేసుకున్నారు. పాఠశాల రోజుల్లో జరిగిన మధుర సంఘటనలు, స్నేహితులతో గడిపిన అనుభవాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. ?ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, గతంలో 2010లో తొలి సమ్మేళనం నిర్వహించి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించినట్లు గుర్తుచేశారు. అప్పట్లో పాఠశాల గ్రంథాలయానికి అవసరమైన పుస్తకాలను అందజేసి, పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించామన్నారు. మళ్లీ 16 ఏళ్ల అనంతరం రెండోసారి కలుసుకోవడం పాత స్నేహాలను మరింత బలపరిచిందని ఆనందం వ్యక్తం చేశారు. ఇటువంటి కలయికలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని, ఇకపై ప్రతి ఏటా ఇలాంటి సమావేశాలు నిర్వహించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు, పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని నిర్ణయించినట్లు తెలిపారు.?పాల్గొన్నవారు ఈ కార్యక్రమంలో తమకు విద్యాబోధ చేసిన రాచమల్ల వెంకటయ్య టీచర్, కొండలరావు టీచర్, నారాయణరెడ్డి టీచర్ సేవలను పూర్వ విద్యార్థులు ప్రత్యేకంగా స్మరించుకున్నారు. గురువుల ఆశీస్సులతో తమ జీవితాల్లో సాధించిన విజయాలను గుర్తుచేసుకుంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇట్టి కార్రక్రమంలో బోనాల కిషన్ ఏఎస్పి, మామిడి రమేష్ ఎన్టిపిఎ, కోటేశ్వర్ లేబర్ ఆఫీసర్, జి శ్రీనివాస్, డి ఏ ఓ, రాచమల్ల సుగుణాకర్, ఆంజనేయులు, ఉమ్మర అలీ, స్వామి, శ్రీనివాస్ రెడ్డి, ఉమాదేవి, వనజ, శాంతా, పద్మావతి పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడి అరెస్ట్



**హుజురాబాద్(భారత శక్తి)** హుజూరాబాద్ లోని మామిండ్లవాడకు చెందిన చింత సునీత(35) హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు హుజూరాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి సోమవారం తెలిపారు. హత్య జరిగిన కేవలం 36 గంటల్లోనే ఈ కేసును చేయించినట్లు వివరించారు. సోమవారం హుజూరాబాద్ పోలీసు స్టేషన్ లో హత్య కేసు వివరాలను ఆమె వెల్లడించారు. హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన చింత సునీత (35) గత కొంతకాలంగా హుజూరాబాద్ మామిండ్లవాడలో నివాసం ఉంటుంది. ఆమె భర్త కుమార్ మృతి చెందగా, గత ఐదు సంవత్సరాలుగా మోతే కిరణ్ తో సహజీవనం చేస్తుంది. వీరిద్దరు మామిండ్లవాడ గ్యాస్ గోదాం సమీపంలో ఓ అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. సునీత తన పక్కన ఉన్న ఇంట్లో ముతోజు భాగ్య అనే మహిళతో స్నేహం పెంచుకుందన్నారు. తరచూ వీరిద్దరు కలిసి తిరుగుతుండటంతో సునీత వ్యభిచారం చేస్తుందనే అనుమానం కిరణ్ కలిగిందన్నారు. ఈ అనుమానంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవన్నారు. ఈ నెల 10న కిరణ్, సునీత ఇద్దరు కలిసి మద్యం సేవింవారన్నారు. ఇదే విషయమై మళ్లీ గొడవ జరగడంతో ఆగ్రహానికి గురైన కిరణ్ ముందుగా సునీత గొంతును చేతులతో పిసికి, అనంతరం చిర ముక్కతో గొంతు బిగించి, కాలితో మెడపై తొక్కి హత్య చేశాడన్నారు. ఎవరికి తనపై అనుమానం రాకుండా ఉండేందుకు సునీత మృతదేహాన్ని ఎత్తుకొని వెళ్లి తన స్నేహితురాలైన ముతోజు భాగ్య ఇంటి సమీపంలోని బావిలో పడేశాడన్నారు. సునీత ధరించిన లో దుస్తులు (ప్యాంట్, డ్రాయర్) ను బావికి సమీపంలోని చెట్టు వద్ద పడవేసి, అక్కడి నుంచి పరారై కరీంనగరకు వెళ్లిపోయాడని పేర్కొన్నారు. సిఐ కరుణాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 13న సోమవారం హుజూరాబాద్ కు తిరిగి వచ్చాడనే పక్కా సమాచారం అందటంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, స్వచ్ఛందంగా నేరాన్ని ఒప్పుకున్నాడన్నారు. సంఘటన జరిగిన ఇంటిని, మృతదేహాన్ని పడవేసిన బావిని, దుస్తులు పడవేసిన స్థలాన్ని చూపించాడన్నారు. సంఘటన స్థలం నుంచి పగిలిన గాజులు, గాజు ముక్కలు, పుస్తెల పూసలు, కాలి పట్టి తదితర కీలక ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే బావి సమీపంలో పడవేసిన మృతురాలి లో దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, కేసు దర్యాప్తు కొనసాగుతోందని వివరించారు. మహిళ హత్య కేసును కేవలం 36 గంటల్లోనే ఛేదించి నిందితుడిని పట్టుకున్నామన్నారు. సిఐ కరుణాకర్, ఎస్ఐ లు రవి, శ్రీనివాసరావు, సిబ్బంది మోహన్, అవినాష్, మహేందర్, శ్రీధర్, అనిల్ లను ఏసిపి అభినందించారు.

## కార్మికుల సమస్యల పరిష్కారానికి

# కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా



**కరీంనగర్(భారత శక్తి)** కరీంనగర్‌లో కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో వేలాది మంది కార్మికులు తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపారు. కార్మికులకు ఈఎస్ఐ ఆసుపత్రి, కార్మిక భవనం, ఇందిరమ్మ ఇళ్లు, 'కార్మిక బంధు' పథకం, ఆసరా పెన్షన్, స్థానికులకు ఉపాధి రక్షణ వంటి డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వారు కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు తమ పూర్తి మద్దతు కొనసాగుతుందని హామీ ఇచ్చారు.

## గంగాధర మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా చిరుత మంగ

**- నియామకపు పత్రం అందజేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**



**చొప్పదండి ని.వటగంగాధర(భారత శక్తి)** జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ అధ్యక్షుడు, చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచన మేరకు గంగాధర మండల కేంద్రానికి చెందిన చిరుత మంగను మహిళా కాంగ్రెస్ పార్టీ కమిటీ గంగాధర మండల అధ్యక్షురాలిగా నియమిస్తూ మహిళా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం కరీంనగర్ జిల్లా గంగాధర ప్రజా కార్యాలయంలో నియామకపు పత్రాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిరుత మంగకు అందజేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో గంగాధర మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా తనకు అవకాశం కల్పించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు, మహిళా కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంత్రి మహేందర్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నారెడ్డి , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి మహేందర్,సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పురుమల్ల మనోహర్,మాజీ జెడ్పిటిసి సత్తు కనకయ్య,సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షులు ముద్దం నగేష్,సర్పంచ్ లు రేండ్ల శ్రీనివాస్,లింగాల లింగయ్య,పడాల రాజన్న,కాంగ్రెస్ పార్టీ నాయకులు గుజ్జుల బాపు రెడ్డి,పడితపల్లి కిషన్,కంకణాల రాజ గోపాల్ రెడ్డి,కర్ర బాపు రెడ్డి,రాచమల్ల,భాస్కర్, మేర్గ కొండయ్య,తోట సంధ్య,పిల్లి మహేష్,సాయిని ఐలయ్య,తాళ్ల శ్రీనివాస్,తాళ్ల సురేష్, సంపత్,దాతు అంజి కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 20 అర్జీలు స్వీకరణ

**- సమస్యల సత్వర పరిష్కారానికి కమిషనర్ ఆదేశాలు**



**కరీంనగర్ (భారత శక్తి)** కరీంనగర్ నగరపాలక సంస్థ కళాభారతిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ వివిధ డివిజన్ల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 20 అర్జీలను స్వీకరించారు. వీటిలో టౌన్ ప్లానింగ్‌కు 15, ఇంజనీరింగ్‌కు 1, రెవెన్యూకు 2, శానిటేషన్‌కు 1, బర్త్ అండ్ డెత్ విభాగానికి 1 దరఖాస్తు వచ్చింది. ఆక్రమణల తొలగింపు, అనధికార నిర్మాణాలు, పన్ను సవరణ, కొత్త ప్రాపర్టీలు, నల్లా కనెక్షన్, తాగునీటి సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు అందాయి. ప్రజావాణికి వచ్చిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ అయాజ్, డిప్యూటీ కమిషనర్ ఖాధర్ మోహియోద్దీన్, అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## చేతివృత్తులను ఆదరించండి

# హస్త కళలను ప్రోత్సహించండి

**పెదవాల్తేరు..(భారత శక్తి)** దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన చేతి వృత్తులను ఆదరించాలని.. హస్త కళలను ప్రోత్సహించాలని విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పిలుపునిచ్చారు.. సోమవారం ఇక్కడ కరక చెట్టు పోలమాంబ ఆలయం వద్ద ఆలిండియా క్రాఫ్ట్ బజార్ ను ముఖ్యఅతిథిగా హాజరై వెలగపూడి ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 రాష్ట్రాలకు చెందిన చేతివృత్తులు.. హస్తకళలు. చేనేత వస్తువులు ఉత్పత్తి ధరలకే విక్రయిస్తుండడంతో వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.. వినియోగదారులు అందిస్తున్న అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.. ఆల్ ఇండియా క్రాఫ్ట్ బజార్ పేరుతో దేశంలోనీ వివిధ ప్రాంతాల్లో లభ్యమయ్యే వస్తువులను ఒకే చోటకు తీసుకువచ్చి ప్రదర్శించడం.. విక్రయించడం వల్ల అన్ని వస్తువులను ఒకే చోట సందర్శించి తక్కువ ధరలకు కొనుగోలు చేసే అవకాశం ఉంటుందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ తక్కువ ధరకు లభ్యమయ్యే ఈ బజార్ ను ప్రజలు ఉచితంగానే తిలకించవచ్చునన్నారు.

అలాగే నాణ్యమైన చీరలు.. గృహోపకరణాలకు అవసరమయ్యే సామగ్రి అంతా ఇక్కడ అందుబాటులో ఉందన్నారు.. కావున ఆయా ప్రాంతాల ప్రజలు ఆలిండియా క్రాఫ్ట్ బజార్ ను సందర్శించాలని గంట్ల శ్రీను బాబు కోరారు..ఎగ్జిబిషన్ నిర్వాహకులు.. విశాఖ ఆర్టీసియన్స్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు ×మొహమ్మద్ నసీం×మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో హైదరాబాద్ నుంచి ముత్యాలు.. కలంకారి పెయింట్స్.. రాజస్థాన్ బెడ్ షీట్స్.. బెంగాల్ కాటన్ సారీస్.. కాటన్ డ్రెస్ మెటీరియల్.. మైసూర్ రోజ్ వుడ్.. తో పాటు అనేక రకాల వస్తువులను అందుబాటులో ఉంచామన్నారుఈ ప్రదర్శన ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందన్నారు.. తక్కువ ధరకు నాణ్యమైన వస్తువులను కొనుగోలు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.. ఈ కార్యక్రమం లో పోలమాంబ ఆలయ దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మద్ది శ్రీనివాస్ రెడ్డి . తెలుగుదేశం పార్టీ మైనారిటీ విశాఖ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ రహీమతుల్లా తదితరులు పాల్గొన్నారు..

# 10వ డివిజన్ కట్టరాంపూర్‌లో రూ.10 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**కరీంనగర్ (భారత శక్తి)** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 10వ డివిజన్ కట్టరాంపూర్‌లో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ సాధారణ నిధులతో ఈ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు పాల్గొని అభివృద్ధి పనులను ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్ సొగాని కొమురయ్య, మున్సిపల్ అధికారులు, కాలనీవాసులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 61 కోట్లు దాటిన డిజిటల్ పేమెంట్స్



**హైదరాబాద్ (భారత శక్తి)**స్మార్ట్‌ఫోన్లలో ఉండే బయోమెట్రిక్ అథెంటికేషన్ (ఆన్-డివైస్) ఆధారంగా జరిగిన యూపీఐ పేమెంట్లు 2026 జూన్ నెలలో 61.1 కోట్లు దాటాయి. ఈ మొత్తం లావాదేవీల విలువ రూ. 25,416 కోట్లుగా నమోదైంది. రోజువారీ అవసరాల కోసం ప్రజలు ఈ విధానాన్ని ఎంతగానో ఆదరిస్తున్నారని ఈ గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఫీచర్ ద్వారా వినియోగదారులు తమ స్మార్ట్‌ఫోన్‌లోని ఫింగర్‌ప్రింట్ లేదా ఫేషియల్ రికగ్నిషన్ ఉపయోగించి జఖఎ పేమెంట్లను సులభంగా పూర్తి చేయవచ్చు.యూపీఐ వినియోగదారులు తమ రోజువారీ చెల్లింపుల కోసం బయోమెట్రిక్ ఆధారిత అథెంటికేషన్ ఎక్కువగా ఎంచుకుంటున్నారు. ఇది డిజిటల్ చెల్లింపుల రంగంలో మరింత వేగవంతమైన, సరళమైన మరియు సులువైన పద్ధతి వైపు మారుతున్న కాలానికి సంకేతంగా నిలుస్తోంది. ఈ ఫీచర్ వ్యక్తుల మధ్య జరిగే చెల్లింపులకు , అలాగే వ్యాపారులకు చేసే చెల్లింపులకు కూడా సపోర్ట్ చేస్తుంది. దీనివల్ల నిత్యం చేసే చెల్లింపులు మరింత వేగంగా, సులువుగా పూర్తవుతున్నాయి.ఈ బయోమెట్రిక్ అథెంటికేషన్ సదుపాయం రూపే క్రెడిట్ కార్డ్ ఆన్ యూపీఐ లావాదేవీలకు కూడా అందుబాటులో ఉంది. దీనివల్ల యూపీఐ పిన్ అవసరం లేకుండానే క్రెడిట్ కార్డ్ ద్వారా పేమెంట్లు చేయవచ్చు. సాధారణంగా సేవింగ్స్ ఖాతా నుండి యూపీఐ పేమెంట్ చేసేటప్పుడు ఉండే అదే వేగం, సౌకర్యాన్ని ఇది క్రెడిట్ కార్డ్ లావాదేవీలకు కూడా అందిస్తుంది."బయోమెట్రిక్ విధానానికి పెరుగుతున్న ఆదరణను చూస్తుంటే, యూపీఐ వినియోగదారులు సులభమైన, వేగవంతమైన పేమెంట్ అనుభవాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని అర్థమవుతోంది. జూన్ నెలలోనే రికార్డు స్థాయిలో 60 కోట్లకు పైగా లావాదేవీలు నమోదు కావడం విశేషం. రూపే క్రెడిట్ కార్డ్ ఆన్ యూపీఐతో సహా అన్ని రకాల చెల్లింపుల్లోనూ ఈ విధానానికి మంచి స్పందన వస్తోంది. ఇప్పటికే పలు బ్యాంకులు, యూపీఐ యాప్‌లు తమ కస్టమర్లకు బయోమెట్రిక్ సదుపాయాన్ని అందిస్తున్నాయి. రాబోయే రోజుల్లో సురక్షితమైన, సౌకర్యవంతమైన ఈ పద్ధతిని ఎంచుకునే వారి సంఖ్య మరింత పెరుగుతుందని భావిస్తున్నాము" అని ఎన్‌పీసీఐ గ్రోత్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోహిని రాజోలా అన్నారు.స్మార్ట్‌ఫోన్‌లోని వేలిముద్ర లేదా ఫేస్ లాక్ వాడటం ద్వారా, వినియోగదారులకు యూపీఐ పిన్ గుర్తుపెట్టుకోవాల్సిన లేదా ఎంటర్ చేయాల్సిన అవసరం తగ్గుతుంది. ఇది లావాదేవీలను చాలా వేగంగా పూర్తి చేయడమే కాకుండా, పేమెంట్లు ఫెయిల్ అవ్వకుండా సక్సెస్ రేటును పెంచుతుంది.వివిధ బ్యాంకులు, యూపీఐ యాప్ లలో ఈ సదుపాయం విస్తరిస్తుండటంతో, భారతీయుల రోజువారీ చెల్లింపుల శైలిలో బయోమెట్రిక్ కీలక పాత్ర పోషించనుంది. రాబోయే నెలల్లో కూడా ఈ ఫీచర్‌కు ఆదరణ మరింత పెరుగుతుందని ఎన్‌పీసీఐ ఆశిస్తోంది. ఇది సురక్షితమైన, ఎలాంటి అడ్డంకులు లేని డిజిటల్ చెల్లింపుల రంగంలో యూపీఐ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుంది

## మెదక్ ఎంపీ రఘునందన్ రావు హ్యూస్టన్ పర్యటన

**- భారతీయ-అమెరికన్ ప్రవాసులతో సమావేశం**

**హ్యూస్టన్, టెక్సాస్(భారత శక్తి)** ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ-యూఎస్ఏ సంస్థ మెదక్ లోక్సభ సభ్యుడు రఘునందన్ రావు గౌరవార్థం హ్యూస్టన్లో ఒక విశేష సామాజిక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి స్థానిక భారతీయ ప్రవాస సమాజం నుండి 200 మందికి పైగా సభ్యులు హాజరయ్యారు.కార్యక్రమం అమెరికా మరియు భారతదేశ జాతీయ గీతాల ఆలాపనతో ప్రారంభమై, ఆ తర్వాత సంప్రదాయ దీపారాధన కార్యక్రమంతో అధికారికంగా ప్రారంభించారు.సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఎంపీ రఘునందన్ రావు భారతదేశంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితిపై సవివరమైన అవలోకనాన్ని అందించారు. అలాగే, "ఒక దేశం - ఒకే ఎన్నిక" వంటి ప్రధాన బిల్లులతో సహా, చర్చలో ఉన్న ముఖ్యమైన శాసనపరమైన పరిణామాలపై ప్రేక్షకులకు లోతైన అవగాహన కలిగించారు. అలాగే, భారత గౌరవనీయ ప్రధాన మంత్రి దేశ ప్రగతి మరియు అభివృద్ధి కోసం ఎలాంటి కృషినైనా వదలకుండా అవిశ్రాంతంగా పనిచేస్తున్న తీరును కూడా వివరించారు.తన ప్రసంగం అనంతరం, ఎంపీ ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో పాల్గొని, న్యాయపరమైన మరియు రాజకీయ అంశాల నుండి సాంస్కృతిక మరియు వ్యక్తిగత విషయాల వరకు హాజరైన వారి నుండి వచ్చిన విభిన్న ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఇది ఆయన పర్యటనపైనా, ఆయన ప్రస్తావించిన విస్తృత అంశాలపైనా సమాజం చూపిన లోతైన ఆసక్తిని ప్రతిబింబించింది. ఈ కార్యక్రమంలో స్థానిక సామాజిక నాయకులు కూడా తమ అభిప్రాయాలను పంచుకుంటూ, ఎంపీ రఘునందన్ రావును హ్యూస్టన్కు స్వాగతం పలికారు.షుగర్ ల్యాండ్ సిటీ కౌన్సిల్ సభ్యులు సంజయ్ సింఘాల్, తన అభిప్రాయాలను సభతో పంచుకుంటూ, స్థానిక ప్రభుత్వంలో తన పాత్ర ద్వారా భారతీయ-అమెరికన్ సమాజానికి తోడ్పాటు అందించేందుకు తాను చేస్తున్న నిరంతర కృషి గురించి ప్రస్తావించారు.

## వైభవంగా స్వర్ణరథోత్సవం



**శ్రీశైలం (భారత శక్తి)**ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ రోజు (13.07.2026) శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది. కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా ఈ రోజు వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది. ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, అతివృష్టి అనావృష్టి నివారించబడాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు లోకకల్యాణానికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. అనంతరం భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ ఉదయం గం.7.30లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి నంది మండపం వరకు ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది.సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, తప్పెట చిందులు, మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. ఈ కార్యక్రమములో చీఫ్ విప్ జి.వి. ఆంజనేయులు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు ఏ.వి. రమణ, ఆలా అనిల్ కుమార్ ఆలయ విభాగం సహాయ కార్యనిర్వహణాధికారి కె. వేంకటేశ్వరా రావు, అర్చకస్వాములు, పలువిభాగాల అధికారులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## భారీగా తగ్గిన బంగారం ధరలు




**ముంబాయి(భారత శక్తి)** దేశంలో బంగారం ధరలు భారీగా తగ్గాయి. 24క్యారెట్ల 10గ్రా. బంగారం ధర రూ.1420 తగ్గి రూ.1,42,910కి చేరింది. 22క్యారెట్ల 10గ్రా. బంగారం రూ.1300 తగ్గి రూ.1,31,000కి చేరింది. కిలో వెండి ధర రూ.2,40,000.

## ఖమ్మంలో కాంట్రాక్ట్
# పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన

**ఖమ్మం(భారత శక్తి)** ఖమ్మం లో కాంట్రక్ట్ పారిశుద్ధ్య కార్మికులు ఆందోళనకు దిగారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట విధులు బహిష్కరించి నిరసనకు దిగారు. వేతనాల పెంపు, రక్షణ పరికరాలు, పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళన చేసారు. డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంట్రాక్టర్తో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ హామీ ఇచ్చారు.

## ప్రేమ వేధింపులతో యువతి ఆత్మహత్య

**మంచిర్యాల (భారత శక్తి)**మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం టేకుమట్లలో విషాదం నెలకొంది. ప్రేమ పేరుతో వెంకటేష్ అనే సింగరేణి ఉద్యోగి వేధింపులు భరించలేక మాధవి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెంకటేష్పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి ఎదుట బంధువులు ఆందోళన కు దిగారు.

### విజయవాడలో ప్రభుత్వాసుపత్రి
## శానిటేషన్ సిబ్బంది ఆందోళన

**విజయవాడ(భారత శక్తి)** విజయవాడలో ప్రభుత్వాసుపత్రి శానిటేషన్ సిబ్బంది ఆందోళనకు దిగారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు భారీగా చేరుకున్నారు. రెండు నెలలు బకాయిలు పెడితే ఎలా బతకాలంటూ ప్రశ్నిస్తున్నారు. గతంలో ఆందోళన చేస్తే జీతాలు విడుదల చేస్తామంటూ ప్రభుత్వం ప్రకటించింది. తిరిగి మళ్లీ పాత పద్ధతే కొనసాగించిందని వారు ఆరోపించారు. కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకొని ఆందోళన నిర్వహించారు.

## తాగు నీటకోసం మహిళల అందోళన

**ఆసిఫాబాద్ (భారత శక్తి)** త్రాగు నీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం డబ్బా ధరంపల్లిలో ఆందోళనకు దిగారు. రెండు నెలలుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని మహిళల ఆవేదన. ఖాళీ బిందెలతో ప్రధాన రహదారిపై నిరసనకు దిగారు. ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

## వర్షాల కోసం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

**నిర్మల్ (భారత శక్తి)** భైంసా మండలం హాస్గుల్ గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని గ్రామదేవతలకు అభిషేకాలు నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో గంగా జలాలతో పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది గ్రామ పండుగ నిర్వహించడం ఆనవాయితీ అని విడీసీ సభ్యులు వెల్లడించారు.

## ఉద్యోగులకు చంద్రన్న బోడిగుండు

**విజయవాడ (భారత శక్తి)**ఉద్యోగులకు చంద్రన్న బోడిగుండు' నినాదంతో చంద్రబాబు సర్కారుపై ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వినూత్న నిరసనకు దిగింది. ఏపీజీఈఎఫ్ ప్రెసిడెంట్ వెంకట్రామిరెడ్డి, ఇతర ఉద్యోగులు గుండు చేయించుకున్నారు. 'ఉద్యోగులకు చంద్రన్న బోడిగుండు' అంటూ ప్లకార్డులతో నిరసనకు దిగారు. ఉద్యోగులు, వాలంటీర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. పీఆర్సీ, ఐఆర్, డిఏలు సహా బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేసారు.

### జూలై 14న "కలెక్టరేట్ పికెటింగ్"
# జయప్రదం చేయండి

**-యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ పిలుపు**




**బద్వేలు (భారత శక్తి)** ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12 వ పిఆర్సీని తక్షణమే అమలు చేయాలని, పెండింగ్ డిఏ లను, ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జూలై 14వ తేదీ చేపట్టిన కడప "కలెక్టరేట్ ముట్టడిని" జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ పిలుపునిచ్చారు. ప్రొద్దుటూరులోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాదన విజయకుమార్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు అనేక ఆశలు పెట్టుకున్నారని, అయితే ప్రభుత్వం ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరుతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర నిరుత్సాహంతో ఉన్నారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేసి, సమస్యలను పరిష్కరించడాన్ని విస్మరిస్తున్నారన్నారు. 12వ పిఆర్సీ గడువు ముగిసి మూడేళ్లు అవుతున్నా పిఆర్సీని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. 11వ పిఆర్సీని సైతం అప్పటి వైసిపి ప్రభుత్వం మూడున్నరేళ్లు ఆలస్యంగా అమలు చేయడంతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులతో పాటు సర్వీసులో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు జరుగుతున్న నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం తక్షణం 12వ పిఆర్సీ కమిషన్ ను ఏర్పాటు చేసి, పిఆర్సీ అమలయ్యే వరకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 29 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను కూటమి ప్రభుత్వం కొంతమేరకు చెల్లించినప్పటికీ, ఇంకా 25 వేల కోట్ల రూపాయల పైబడి బకాయిలు పేరుకపోయాయన్నారు. వీటి చెల్లింపులలో నిర్దిష్టమైన కాల వ్యవధి లేకపోవడం వల్ల పూర్తిస్థాయిలో బకాయిల చెల్లింపులు జరగడం లేదన్నారు. నాలుగు డిఏలు పెండింగ్ ఉన్నా పాలకులు కనీసం స్పందించడం లేదని విమర్శించారు. మూడు సంవత్సరాలుగా సరెండర్ లీవ్ బకాయిల చెల్లింపులు లేవని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు, పాత పెన్షన్ అమలు లాంటి విధానాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. 2004 కు ముందు ఉద్యోగ నియామక ప్రక్రియ పూర్తయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలుపై ప్రభుత్వ ఉత్తర్వుల జారీలో జాప్యం తగదన్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి మండలి ఆమోదం సైతం పొందినప్పటికీ ఉత్తర్వులను విడుదల చేయడంలో కాలయాపన ఎందుకని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉద్యోగులకు ఇచ్చిన హెల్త్ కార్డులపై ఉద్యోగులకు వైద్యం అందడం లేదని ఆరోపించారు. నగదు చెల్లించి వైద్యం పొందిన మెడికల్ బిల్లులు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆమోదం పొందినప్పటికీ వాటి చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నదని విమర్శించారు. దీనిపై కమిటీ నియమించినా ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నారు. కరోనా మహమ్మారిలో మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టడంలో ప్రభుత్వ అలసత్వం సరికాదన్నారు. తక్షణం కారుణ్య నియామకాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలను కారణంగా చూపి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత సాధించాలనడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విద్యాహక చట్టం-2009 సెక్షన్ 23(1) కి సవరణకు కృషి చేయాలని కోరారు. చట్ట సవరణ జరిగే వరకూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ పరీక్షను, ఆఫ్ లైన్ విధానంలో నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ, తక్షణం 12 వ పిఆర్సీ కమిషన్ ను ఏర్పాటు చేయాలని, పిఆర్సీ అమలయ్యే వరకు 29 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని, పెండింగ్ డిఏ లను విడుదల చేయాలని, ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ జూలై 14వ తేది ఫ్యాప్టో ఆధ్వర్యంలో చేపట్టిన కడప కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించాలని, లేకపోతే తగు మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎన్.కంబగిరి, ఎం.శ్రీను వాసులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పి.శశి కిరణ్ కుమార్, కె.చెంచి రెడ్డి, పి.నాగరాజు, వి.వి.రమణా రెడ్డి, కె.ఈశ్వరయ్య, ఎ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### పోలీసులు విచారణకు
# హాజరయిన యాంకర్ గమన

**గన్నవరం(భారత శక్తి)** ప్రశ్న రావణ్ కేసులో యూట్యూబ్ ఛానల్ లో కోయాంకర్ గా వ్యవహరించిన గమన, వైకాపా నేత ఉమామహేశ్వరనాయుడి సోదరుడు ఇంద్రసేనాచౌదరికి పోలీసులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు గమన, ఇంద్రసేనాచౌదరి గన్నవరం డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నాడు విచారణకు హాజరైయారు. పోలీసులు రావణ్ తో సంబంధాన్ని ఆరా తీస్తున్నట్లు సమాచారం.

## ఎల్బీనగర్ కాంగ్రెస్‌లో ప్లెక్సీ వార్

**హైదరాబాద్ (భారత శక్తి)**ఎల్బీనగర్ కాంగ్రెస్ లో ప్లెక్సీ వార్ ముదరింది. పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ పై అనుచిత వాక్యాలకు నీరసనగా స్టేట్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘం నాయకులు యాదవ సంఘం నాయకుల మన్సూరాబాద్ లోని శివ చరణ్ రెడ్డి ఇంటిని ముట్టడి చేసి ఇంటిని అద్దాలను ధ్వంసం చేసారు. పరస్పరం ఇరువుర్గాల మధ్య తోపులాట కర్రలు రాళ్లతో దాడి చేసుకున్నాయి.

# సీఎం నివాసాన్ని ముట్టడించిన
## ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు



**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణ రాష్ట్రం లో ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్లో ఫీజుల నియంత్రించాలని ఆప్ నేతలు డిమాండ్ చేసారు. సోమవారం నాడు సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడించడానికి ప్రయత్నించారు. , ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని , విద్యా శాఖకు మంత్రిని కేటాయించాలని , వివిధ విద్యారంగ సమస్యల ను పరిష్కరించాలని అందళనకారులు డిమాండ్ చేసారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన నాయకులు, తెలంగాణ ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ నాయకులు అందరూ ముఖ్యమంత్రి నివాసం దగ్గరికి చేరుకోగా కాసేపు ఆమ్ ఆద్మీ పార్టీ (ంంఖ ) నాయకులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. అందోళనకారులను పోలీసులు అరెస్టు చేసి మధురానగర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు

## ఎస్ఐఆర్‌ను 6 నెలలు పొడిగించాలి

**- మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**

**(భారత శక్తి)**బి ఆర్ ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలలో పర్యటించి ప్రత్యేక ఓటరు సవరణ (ాఎఖీ) కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై ఎమ్మెల్యే తలసాని కి పలువురు ఓటర్లు ఫిర్యాదులు చేసారు. ఎన్యుమరేటర్ ఫారం పిలప్ చేసే విషయంలో బీఎల్వో లకే సరైన అవగాహన లేదని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.సిబ్బంది సరిపడా లేరు... సిబ్బందిని పెంచాలని అధికారుల వైఖరి పట్ల ఆగ్రహం వ్యక్తం చేసారు. 2002 ఓటరు జాబితా బీఎల్వో ల వద్ద కూడా లేవు. 2002 లో ఉన్న నియోజకవర్గాలు.. ప్రస్తుత నియోజకవర్గాలు మారాయి. ఎన్యుమరేటర్ ఫారం పిలప్ చేసే విషయంలో అంతా గందరగోళం ఉంది. ఈ నెల 24 తో ఎస్ఐఆర్ కార్యక్రమం గడువు ముగుస్తుంది. ఇప్పటి వరకు 10 శాతం కూడా పూర్తి కాలేదు...11 రోజులలో 100 శాతం ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు.

### "సంకల్పం" కార్యక్రమం నిర్వహించిన
# నల్లపాడు పోలీసులు

**- మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలు మరియు మహిళల భద్రతపై విద్యార్థులకు అవగాహన,.**



**గుంటూరు (భారత శక్తి)**నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని చైతన్య కాలేజ్, గోరంట్ల, విద్యాసంస్థల్లో ఈ రోజు (13.07.2026) కళాశాల యాజమాన్యాల సహకారంతో "సంకల్పం" అనే మాదకద్రవ్యాలను అరికట్టడానికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక మరియు చట్టపరమైన దుష్పరిణామాలపై పోలీసులు సమగ్రంగా వివరించారు. అదేవిధంగా కళాశాలల్లో మహిళలపై జరిగే నేరాల నివారణ, మహిళల భద్రత, చట్టాలపై అవగాహన, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.× ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బందితో పాటు నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ. భాస్కర్ గారు, ఎస్సై రామకృష్ణ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు....

## ఏఆర్ కానిస్టేబుల్ మరియదాస్ మృతిపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి



**అమరావతి. (భారత శక్తి)** ప్రకాశం జిల్లా ఒంగోలు బైపాస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ మరియదాస్ మృతి చెందడం బాధాకరమని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారుప్రజల రక్షణ కోసం విధులు నిర్వహించిన పోలీసు సిబ్బందిని కోల్పోవడం పోలీసు శాఖకు తీరని లోటని ఆమె అన్నారు..మరియదాస్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు..ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు

ప్రమాదంలో ,గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య చికిత్స అందించాలని అధికారులను ఆదేశించిన ఆమె, ప్రమాదానికి దారితీసిన కారణాలపై సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మరియదాస్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని హోంమంత్రి ఆకాంక్షించారు..



తండ్రి కష్టాలను గుర్తుచేసుకున్న

# భాగ్యశ్రీ బోర్సే

'లెనిన్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి భాగ్యశ్రీ బోర్సే. తాజాగా చిన్ననాటి జీవితంలోని కష్టాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగ వ్యాఖ్యలు చేసింది. తాను పుట్టిన వెంటనే తండ్రి ఉద్యోగం కోల్పోయారని, ఆ తర్వాత కుటుంబం ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు చెప్పింది. తమది దిగువ మధ్యతరగతి కుటుంబమని, చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు తమ కోసం ఎంత కష్టపడ్డారో కళ్లారా చూశానని తెలిపింది. ఇంట్లో ప్రతి రూపాయిని ఎంతో జాగ్రత్తగా ఖర్చు చేసేవారని భాగ్యశ్రీ చెప్పింది. రూ.10 పచ్చిమిర్చి, రూ.10 పాలకూర కొనుగోలు చేసిన వివరాలనూ నోట్‌బుక్‌లో రాసుకునేవారని, ఒక వారం రూ.300 ఖర్చయితే తర్వాతి వారం ఎలా గడపాలా అని తల్లిదండ్రులు ఆలోచించేవారని గుర్తు చేసుకుంది. చిన్నతనంలో డబ్బు విలువ తెలియకపోయినా, పెరిగేకొద్దీ తల్లిదండ్రుల కష్టాలు అర్థమయ్యాయని వివరించింది. తన జీవితంలో ఎన్నటికీ మర్చిపోలేని ఓ సంఘటనను భాగ్యశ్రీ గుర్తు చేసుకుంది. "నాకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.. దయచేసి నాకు ఉద్యోగం ఇవ్వండి" అంటూ తన తండ్రి ఒకరి వద్ద వేడుకున్నారని తెలిపింది. చిన్న వయసులో తండ్రిని ఆ స్థితిలో చూడటం చాలా బాధ కలిగించిందని చెప్పింది. అప్పుడే ఆయన మళ్లీ ఎప్పుడూ అలాంటి పరిస్థితిని ఎదుర్కోకూడదని నిర్ణయించుకున్నానని, జీవితంలో తాను సాధించాలనుకున్న ప్రతి లక్ష్యం వెనుక తల్లిదండ్రులే ప్రేరణగా ఉన్నారని వెల్లడించింది.

ఔరంగాబాద్‌కు చెందిన భాగ్యశ్రీ బోర్సే కొంతకాలం నైజీరియాలో చదువుకుని, తర్వాత ముంబైలో మోడలింగ్ ప్రారంభించింది. బాలీవుడ్‌లో చిన్న పాత్రలతో కెరీర్ ప్రారంభించిన ఆమెకు రవితేజ సరసన నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమా మంచి గుర్తింపు తీసుకొచ్చింది. అనంతరం విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్, రామ్ పోతినేని వంటి హీరోలతో నటించింది. ఇటీవల అఖిల్ అక్కినేని సరసన నటించిన 'లెనిన్' సినిమాతో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.

# చోర శికామణులు



రామ్‌తేజ్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్, నరేష్, సంపూర్ణేష్‌బాబు ముఖ్య తారలుగా తెరకెక్కుతున్న యాక్షన్ క్రైమ్ కామెడీ థ్రిల్లర్ 'చోర శికామణులు'. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం ఆనంద్ కూర్మా. బానూరు నాగరాజు నిర్మాత. ఈ చిత్రం ప్రారంభోత్సవం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. నిర్మాతలు వి.దామోదరప్రసాద్, టి.ప్రసన్నకుమార్, ప్రముఖ దర్శకుడు త్రినాథరావు నక్కిన కలిసి స్క్రిప్ట్‌ని దర్శకునికి అందించారు. ముహూర్తపు సన్నివేశానికి త్రినాథరావు నక్కిన గౌరవ దర్శకత్వం వహించారు. ఈ నెల 25 నుంచి పాట చిత్రీకరణతో రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఆనంద్ రాజవిక్రమ్.

# తెగించి తీసుకున్న నిర్ణయమిది



అస్తిత్వం, ఆత్మాభిమానం విషయాల్లో సమంత అస్సలు రాజీపడరు. 'విజయాన్ని సాధించాల్సింది వ్యక్తి మాత్రమే. ఆ వ్యక్తి ఆడా, మగా అనేది వ్యవస్థలో అనవసరం. అసలు ఆ ఆలోచనే అర్థరహితం' అంటారు సమంత. ఆమె తాజా చిత్రం 'మాఇంటి బంగారం' రూ.100 కోట్ల వసూళ్లు దాటింది. టాలీవుడ్‌లో ఈ క్రెడిట్ సాధించిన తొలి మహిళాప్రధాన చిత్రమిదేనని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా ఈ సినిమా విడుదలకు ముందు జరిగిన ఓ సంఘటనను సామ్ తన ఇన్‌స్టా ద్వారా పంచుకున్నారు. "మాఇంటి బంగారం' విడుదలకు ముందు అసలు ఈ సినిమా గురించి ఎవరైనా మాట్లాడుకుంటారా? మా ప్రయత్నం ప్రేక్షకులకు చేరుతుందా? అని ఆలోచించాం. ఇందులో భాగంగా ఓ ఎగ్జిబిటర్‌కి నా స్నేహితుడు ఫోన్ చేసి ' 'మాఇంటి బంగారం' గురించి జనాల్లో ఆసక్తి ఉందా? అసలు డబ్బులు వస్తాయంటారా?' అనడిగాడు. 'ఆ.. హీరోయిన్ సినిమాలను ఎవరు చూస్తారండీ.. ఎవరైనా పెద్ద హీరో పక్కన నటిస్తే ఓకే. ఎందుకంటే ఆమె అందంగా ఉంటుంది.. అందరికీ తెలుసు. కానీ ఆమే అంతా అంటే ఎవరొస్తారు చెప్పండి!?' అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడాడు ఆ ఎగ్జిబిటర్. ఆ మాటలు నేను వింటున్నట్టు అతనికి తెలీదు. నిజానికి ఈ అభిప్రాయం అతనిది మాత్రమే కాదు. చాలామందిలో ఇదే అభిప్రాయం ఉంది. మార్పు రావాలంటే తెగించి, ధైర్యంగా నిర్ణయం తీసుకోవాలి. నేను తీసుకున్నాను.. సఫలీకృతమయ్యాను. ఇది ఓ గొప్ప మార్పుకు నాంది అవుతుందని భావిస్తున్నా. ఇకనుంచి మహిళా ప్రధాన చిత్రాలను ఎవరూ తక్కువచేసి మాట్లాడకూడదు. మాట్లాడరని ఆశిస్తున్నా' అంటూ ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు సమంత.

కథలో ఎమోషన్స్

# ఆకట్టుకుంటాయి



'తాతయ్య సూపర్‌స్టార్ కృష్ణ నాకు దేవుడు. బాబాయ్ మహేశ్ నన్నెంతో సపోర్ట్ చేస్తున్నారు. టీజర్, ట్రైలర్ చూసి అభినందించారు. నాన్న ఉండుంటే బావుండేది. అజయ్‌భూపతి అద్భుతమైన కథ రాశారు. అందులో ఎమోషన్స్ మిమ్మల్ని ఆకట్టుకుంటాయి. సాంకేతికంగా కూడా సినిమా అద్భుతంగా ఉంటుంది. థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది. లెజెండరీ యాక్టర్ మోహన్‌బాబుతో కలిసి నటించడం గొప్ప అనుభవం. ఇది నా తొలి సినిమా అయినా ఇంతటి అభిమానం చూపిస్తున్న మీ అందరికీ థ్యాంక్స్' అని సూపర్‌స్టార్ కృష్ణ మనవడు ఘట్టమనేని జయకృష్ణ అన్నారు. ఆయన్ను హీరోగా పరిచయం చేస్తూ అజయ్‌భూపతి తెరకెక్కిస్తున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని కథానాయిక. మోహన్‌బాబు పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. పి.కిరణ్ నిర్మాత. అగ్ర నిర్మాత సి.అశ్వనీదత్ సమర్పకుడు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఘట్టమనేని జయకృష్ణ మాట్లాడారు. డైరెక్టర్ అజయ్ భూపతి మాట్లాడుతూ 'ఈసినిమాలో జయకృష్ణ, రాషా తడానీ జంట కన్నుల పండుగగా ఉంటుంది. యాక్షన్ మోడ్‌లో సాగే ఈ సినిమాలో అద్భుతమైన ప్రేమకథ కూడా ఉంటుంది. ఇందులో జయకృష్ణ నటన ఘట్టమనేని అభిమానులు పండుగ చేసుకునేలా ఉంటుంది' అని నమ్మకంగా చెప్పారు. ఈ సినిమాలో నటించడం పట్ల కథానాయిక రాషా తడానీ ఆనందం వెలిబుచ్చింది. ఇంకా చిత్రబృందంతోపాటు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, ఏపీ రాజకీయ ప్రముఖులు కేసినేని చిన్ని, బొండా ఉమ కూడా మాట్లాడారు.

# మహాభారతం చదవండి..

## కల్కి పార్ట్ 2 కోసం వెయిట్ చేయండి..

**- నాగ్ అశ్విన్ స్ట్రాంగ్ కౌంటర్!**



పాన్ ఇండియా దర్శకుడు నాగ్ అశ్విన్ సాధారణంగా సోషల్ మీడియాలో వివాదాలకు దూరంగా ఉంటారు. అయితే తన బ్లాక్‌బస్టర్ చిత్రం కల్కి 2898 ాూణ పై గత కొద్ది రోజులుగా వస్తున్న విమర్శల నేపథ్యంలో ఆయన తొలిసారి మౌనం వీడి స్పందించారు. ముఖ్యంగా అఖిల్ అక్కినేని నటించిన 'లెనిన్' సినిమా విడుదలైన తర్వాత మొదలైన పోలికలు, కర్ణుడి పాత్రపై వస్తున్న కామెంట్లకు నాగ్ అశ్విన్ తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. జూలై 10న విడుదలైన అఖిల్ అక్కినేని 'లెనిన్' సినిమా బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకెళ్తోంది. ఈ చిత్రంలో కన్నడ నటుడు ప్రమోద్ పంజు పోషించిన వసంత్ పాత్రకు ప్రేక్షకుల నుంచి విశేష ప్రశంసలు లభిస్తున్నాయి. ఆయన నటనను కొనియాడుతూ ఓ నెటిజన్ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఆ పోస్ట్‌లో సిల్వర్ స్క్రీన్‌పై కర్ణుడి పాత్రను ఇలా చూపించాలి అని పేర్కొనడంతో, కొందరు నెటిజన్లు 'కల్కి 2898 ాూణ'లో కర్ణుడి పాత్ర చిత్రీకరణపై విమర్శలు చేయడం ప్రారంభించారు. సినిమాలో కర్ణుడిని అతిగా గ్లోరిఫై చేశారని, మహాభారతంలోని అసలు కథకు భిన్నంగా కొన్ని అంశాలను చూపించారని సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. వివాదం రోజురోజుకూ పెరగడంతో, ఇంతకాలం స్పందించని నాగ్ అశ్విన్ ఎట్టకేలకు సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ప్రముఖ ఆర్థికవేత్త, రచయిత వివేక్ దేబ్‌రాయ్ ఆంగ్లంలో అనువదించిన మహాభారతం పుస్తకంలోని ఒక పేజీని షేర్ చేస్తూ విమర్శలకు సమాధానం ఇచ్చారు. ఆ పోస్ట్‌లో ఆయన, ఇవి ద్రోణ వధ పర్వంలో అర్జునుడితో శ్రీకృష్ణుడు చెప్పిన మాటలు. దయచేసి మహాభారతం చదవండి. ముఖ్యంగా వివేక్ దేబ్‌రాయ్ అనువాదాన్ని చదవాలని నేను సూచిస్తున్నాను అని పేర్కొన్నారు. అంతేకాదు, శ్రీకృష్ణుడు అర్జునుడి ఎదుట కర్ణుడిని ఎన్నిసార్లు ప్రశంసించాడో ఒకసారి తెలుసుకోండి. మన చరిత్రపై నాకు ఎంతో గౌరవం ఉంది. నేను ఏం చేస్తున్నానో నాకు పూర్తిగా తెలుసు. 'కల్కి పార్ట్ 2' కోసం వేచి ఉండండి అంటూ నాగ్ అశ్విన్ ధీమాగా స్పందించారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా "వెయిట్ ఫర్ పార్ట్ 2" అనే ఒక్క మాటతోనే సీక్వెల్‌పై అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచేశారు 'కల్కి 2898 ాూణ' మొదటి భాగంలో ప్రభాస్ నటన, విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు, సంతోష్ నారాయణన్ అందించిన నేపథ్య సంగీతం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అయితే కర్ణుడి పాత్రను ఎలా చూపించారనే అంశంపై అప్పటి నుంచే కొంత చర్చ కొనసాగుతోంది. తాజాగా 'లెనిన్' సినిమా తర్వాత ఆ చర్చ మళ్లీ తెరపైకి రావడంతో నాగ్ అశ్విన్ నేరుగా స్పందించారు.నాగ్ అశ్విన్ ఇచ్చిన సమాధానం తర్వాత ఇప్పుడు సోషల్ మీడియాలో అభిమానులు విస్తృతంగా చర్చిస్తున్నారు. రెండో భాగంలో కర్ణుడి పాత్రకు మరింత ప్రాధాన్యం ఉంటుందా? మహాభారతానికి సంబంధించిన మరిన్ని అంశాలను ఎలా చూపించబోతున్నారు? అనే అంశాలపై ఆసక్తి వ్యక్తమవుతోంది.

# 'లెనిన్'పై మెగాస్టార్ ప్రశంసలు..

## అఖిల్ నాకు మరో కొడుకులాంటి వాడన్న చిరంజీవి





అక్కినేని అఖిల్ హీరోగా నటించిన 'లెనిన్' చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లు రాబడుతూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖుల నుంచి ప్రశంసల వెల్లువ కొనసాగుతోంది. తాజాగా మెగాస్టార్ చిరంజీవి కూడా చిత్రబృందాన్ని ప్రశంసించారు.

ఆయన సోషల్ మీడియా వేదికగా 'లెనిన్' యూనిట్‌ను అభినందిస్తూ ఒక సందేశాన్ని పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'లెనిన్' చిత్రంపై అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని, ఈ విషయం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని చిరంజీవి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఒక సినిమా విజయం సాధించడమే కాకుండా, అందరి నుంచి గొప్ప ప్రశంసలు అందుకోవడం మరింత సంతోషాన్నిచ్చే విషయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విజయం సందర్భంగా చిత్రబృందం మొత్తానికి ఆయన తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా అఖిల్ అక్కినేని నటన గురించి చిరంజీవి ప్రత్యేకంగా ప్రస్తావించారు. "అఖిల్ నాకు మరో కొడుకులాంటి వాడు. ప్రతి సినిమాతో నటుడిగా మరింత పరిణతి సాధిస్తూ, ఎదుగుతున్న అతడిని ఇలా చూడటం చాలా ఆనందంగా ఉంది" అంటూ మెగాస్టార్ ప్రశంసలు కురిపించారు. ఈ భారీ విజయం అఖిల్ కెరీర్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేర్చడానికి నాంది కావాలని ఆకాంక్షించారు. అలాగే, తన చిరకాల మిత్రుడు నాగార్జునకు కూడా చిరంజీవి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అక్కినేని కుటుంబానికి ఇంతటి ఆనందాన్ని అందించిన ఈ విజయం వెనుక ఉన్న ప్రతి ఒక్కరూ ప్రశంసలకు అర్హులని అన్నారు. దర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరు, కథానాయిక భాగ్యశ్రీ బోర్సే, నిర్మాతలు, ఇతర సాంకేతిక నిపుణులకు కూడా శుభాకాంక్షలు తెలియజేశారు. అయితే, తాను ఇంకా 'లెనిన్' చిత్రాన్ని చూడలేదని, ప్రేక్షకుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందన చూశాక సినిమా చూడాలనే ఆసక్తి మరింత పెరిగిందని చిరంజీవి వెల్లడించారు. త్వరలోనే ఈ చిత్రాన్ని చూస్తానని పేర్కొన్నారు. బాక్సాఫీస్ వద్ద 'లెనిన్' ఇదే విజయ పరంపరను కొనసాగించి మరిన్ని రికార్డులు సృష్టించాలని ఆయన ఆకాంక్షించారు. చిరంజీవి చేసిన ఈ పోస్ట్‌తో మెగా, అక్కినేని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## నిదానంగా సాగుతున్న
# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ

**విజయవాడ, (భారత శక్తి)** రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదనే చర్చ రాజకీయ వర్గాల్లో కొనసాగుతోంది. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు ముగియడానికి కొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉన్నప్పటికీ, నమోదవుతున్న స్పందన ఆశించిన స్థాయికి చేరుకోలేదని సమాచారం. దీంతో అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ పరిణామాలను ఆసక్తిగా గమనిస్తున్నాయి.అధికారుల సమాచారం ప్రకారం, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా నమోదైన స్పందన 50 శాతం మార్కును దాటలేదని తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఈ శాతం మరింత తక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో ఓటర్ల వివరాల సేకరణ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని చెబుతున్నారు. దీంతో నిర్ణయించిన గడువులోపు పూర్తి స్థాయిలో ప్రక్రియ పూర్తవుతుందా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.నగర ప్రాంతాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ అక్కడ కూడా ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల సంఘం ఇంటింటికీ అవసరమైన దరఖాస్తు ఫారాలను పంపిణీ చేసినప్పటికీ, వాటిని పూర్తి వివరాలతో తిరిగి సమర్పించే విషయంలో ఓటర్ల నుంచి స్పందన తక్కువగా ఉందని తెలుస్తోంది. ఈ కారణంగా మొత్తం ప్రక్రియ మందగించినట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు.రాజకీయ పార్టీల దృష్టిలో ఈ ప్రక్రియకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఎందుకంటే ఓటరు జాబితాలో పేర్లు సక్రమంగా నమోదు కావడం ఎన్నికల సమయంలో కీలక అంశంగా మారుతుంది. అందుకే అన్ని పార్టీలు తమ తమ కార్యకర్తల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి ఫారాలు సకాలంలో సమర్పించేలా చూడాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు.క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే చాలా మంది ఓటర్లకు ఈ ప్రక్రియపై పూర్తి అవగాహన లేదని తెలుస్తోంది. ఫారాలు ఎలా నింపాలి, ఎవరికి ఇవ్వాలి, ఏ పత్రాలు అవసరం, పాత ఓటరు జాబితాలో పేరు లేకపోతే ఏం చేయాలి వంటి విషయాల్లో ఇంకా గందరగోళం కొనసాగుతోందని సమాచారం. ఈ పరిస్థితిని అధిగమించాలంటే అధికారులు, రాజకీయ పార్టీలు, స్థానిక సిబ్బంది కలిసి ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు.ప్రత్యేకించి 2002 నాటి ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు, లేనివారు అనుసరించాల్సిన విధానం గురించి కూడా ప్రజలకు స్పష్టత కల్పించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. అవసరమైన పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకుని, గడువు ముగిసేలోపు దరఖాస్తులు పూర్తి చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురుకాకుండా ఉంటాయని సూచిస్తున్నారు.గడువు ముగిసే వరకు మిగిలిన రోజుల్లో నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంపై అధికారులు దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో రాజకీయ పార్టీలు కూడా తమ కార్యకర్తలను మరింత చురుకుగా రంగంలోకి దింపి ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నాలు ప్రారంభించే అవకాశం ఉందని భావిస్తున్నారు.మొత్తంగా చూస్తే, ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకం. సరైన సమాచారం, అవసరమైన పత్రాలు, సమయానికి దరఖాస్తుల సమర్పణ వంటి అంశాలపై ప్రతి ఓటరు అప్రమత్తంగా ఉంటేనే ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో విజయవంతమవుతుంది. లేకపోతే తుది ఓటరు జాబితాపై ప్రభావం పడే అవకాశం ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# ఏజెన్సీ ప్రాంతాలపై జనసేన కన్ను

**విశాఖపట్టణం, (భారత శక్తి)** ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఏజెన్సీ ప్రాంతాలపై అధికార కూటమి ప్రత్యేక దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత ఎన్నికల ఫలితాలను విశ్లేషించిన తర్వాత గిరిజన నియోజకవర్గాల్లో పార్టీ బలాన్ని మరింత పెంచాలని ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని చెబుతున్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ బాధ్యతలో కీలక పాత్రను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు అప్పగించినట్లు ప్రచారం జరుగుతోంది.ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్ ఇటీవల ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నారని సమాచారం. రహదారులు, తాగునీరు, విద్యుత్, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెబుతున్నారుప్రత్యేకించి ఎన్నో దశాబ్దాలుగా సరైన రోడ్డు సౌకర్యం లేని గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలుస్తోంది. "అడవి తల్లి బాట" వంటి కార్యక్రమాల ద్వారా మారుమూల ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేసే పనులు వేగవంతం చేసినట్లు అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ చర్యలతో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధిపై ప్రజల్లో సానుకూల స్పందన పెరుగుతుందని కూటమి నాయకులు భావిస్తున్నారు.అభివృద్ధితో పాటు గిరిజనులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు సమాచారం. ముఖ్యంగా అడవి ప్రాంతాల్లో ఏనుగుల సంచారం వల్ల పంటలు, ఆస్తులకు కలుగుతున్న నష్టాన్ని తగ్గించే చర్యలు, విద్యుత్ సౌకర్యాల విస్తరణ, గ్రామీణ కనెక్టివిటీ పెంపు వంటి అంశాలపై సంబంధిత శాఖలు పనిచేస్తున్నాయని చెబుతున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రజలతో మరింత సన్నిహిత సంబంధాలు ఏర్పడతాయని అధికార పార్టీ అంచనా వేస్తోంది.రాజకీయంగా పరిశీలిస్తే, 2009 నుంచి ఏజెన్సీ నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభావం ఎక్కువగా కొనసాగిందని ఎన్నికల ఫలితాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. 2024 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కూటమి మంచి ఫలితాలు సాధించినప్పటికీ, అరకు పార్లమెంట్ స్థానం మాత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఖాతాలోకి వెళ్లడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వచ్చే ఎన్నికల నాటికి ఏజెన్సీ ప్రాంతాల్లో పార్టీ బలాన్ని పెంచుకోవాలనే లక్ష్యంతో కూటమి ముందుకు సాగుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు చేరువయ్యే అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక సమస్యల పరిష్కారం, గిరిజన సంక్షేమంపై ప్రత్యేక దృష్టి వంటి అంశాల ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని అధికార పార్టీ ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు.మరోవైపు విపక్షం కూడా ఈ ప్రాంతాల్లో తన బలాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తోంది. దీంతో రానున్న రోజుల్లో ఏజెన్సీ నియోజకవర్గాలు రాష్ట్ర రాజకీయాల్లో మరింత కీలకంగా మారే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలే భవిష్యత్ ఎన్నికల్లో ఈ ప్రాంత ఓటర్ల తీర్పును ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా నిలిచే అవకాశముందని భావిస్తున్నారు.

# ఎస్ఐఆర్ అవగాహనా కార్యక్రమంలో
# పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం

**రంగారెడ్డి(భారత శక్తి)** శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీలో ఎస్ ఐ ఆర్ అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బిఆర్ఎస్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు పాల్గొన్నారు.ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ప్రతి ఇంటికి తిరిగి ఓట్లు పోవ్వివకుండా జాగ్రత్త పడాలి. కాంగ్రెస్ బిజెపి ప్రభుత్వాలు కలిసి తెలంగాణ ప్రజలను మోసం చేసే విధంగా ఈ కార్యక్రమం వుందని అన్నారు. అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు ఇవ్వలేకే ఓట్లు తొలగించే డ్రామా ఎస్ఐఆర్. గడపగడపకు తిరిగి వివరాలు సేకరించవలసిన అధికారులు ఒకే చోట ఖీ ఫారంలు పంచుతున్నారు. అధికారులు వచ్చిన సమయంలో ఇంట్లో లేకపోతే వాళ్ళ ఓట్లు తొలగించే పన్నాగం పడుతున్నారు అధికారులు. అధికారులు సైతం కాంగ్రెస్ ఏజెంట్లుగా పనిచేస్తున్నారు . అధికారుల ధోరణి మారకపోతే న్యాయస్థానానికి వెళ్ళి పిర్యాదు చేశాం. బిఆర్ఎస్ కార్యకర్తలు బీఎల్వో లతో కలిసి ఓట్లు తొలగించకుండా వివరాలు సేకరించేలా పనిచేయాలని అన్నారు.

# హోంశాఖపై అసంతృప్తులు

**కాకినాడ, (భారత శక్తి)** కూటమిలో కొద్దిపాటి కుదుపు.. హోం శాఖ తీరుపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పోలీసులపై కినుక వహించారని తెలుస్తోంది. సోషల్ మీడియా కేసుల విషయంలో దూకుడుగా వ్యవహరించాలంటూ పోలీసు శాఖలోని టాప్ బాస్‌ల దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన రెస్పాన్స్ రావడం లేదని ఆయన ఆగ్రహంగా ఉన్నాట.కొన్ని రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లో రావణ్ అంశం నడుస్తోంది. ఓ సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం.. దానికి జనసైనికులు ఆగ్రహం చెందడం.. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా చాలా చోట్ల కేసులు నమోదు కావడం జరిగింది. ఆ తర్వాత నిషేధిత సంస్థల ఐడియాలజీని ప్రోత్సహించేలా.. వీడియోలు రూపొందించారన్న విషయంపై రావణ్‌పై జంఖం చట్టం కింద కేసు నమోదు చేసే వరకూ అది దారితీసింది.ఈ విషయానికే కొంత ఇబ్బందికర పరిస్థితి ఉన్న తరుణంలో.. ఇప్పుడు కూటమికి మరో సమస్య వచ్చింది.సోషల్‌మీడియాలో చేస్తున్న వ్యాఖ్యలు, తనపైన కానీ ప్రభుత్వంపైన కానీ.. సోషల్ హార్మోనీని దెబ్బతీసేలా పనిచేస్తున్న వారి విషయంలో కానీ పోలీసులు అనుకున్నంత వేగంగా.. స్పష్టంగా పనిచేయడం లేదని పవన్ కళ్యాణ్ భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రశ్న రావణ్ ఒక్కరే కాదు.. మరికొందరిపై కూడా కేసులు నమోదు చేయాలన్నది ఆయన అభిమతమని.. ఆ విషయంలో పోలీసు శాఖ చొరవ చూపిచడం లేదన్న అసంతృప్తి ఆయనలో ఉంది. ఈ విషయాన్ని ఆయన నేరుగా ఓ పోలీసు ఉన్నతాధికారినే అడిగారని కూడా తెలుస్తోంది. విశ్వసనీయంగా తెలిసిన విషయం ప్రకారం ఆయన చాలా సీరియస్‌గానే దీనిపై మాట్లాడారని.. కానీ పోలీసుల నుంచి తాను ఆశించిన సమాధానం రాలేదని తెలిసింది. దీనికి పవన్ కళ్యాణ్ నొచ్చుకున్నారని చెబుతున్నారు. ఆ తర్వాత దానిని సర్దుబాటు చేయడానికి జనసేన– టీడీపీ నుంచి రెండు వైపులా ప్రయత్నాలు జరిగాయి. పోలీసులు ఈ విషయంలో మరింత దూకుడుగా లేకపోవడానికి కారణం.. చర్యలు తీసుకోవాల్సిన వ్యక్తులు తెలంగాణలో ఉండటం. ఇప్పటికే రావణ్, జర్నలిస్ట్ ఐఖీ అరెస్టుల వ్యవహారం తెలంగాణలో రచ్చకు దారితీసింది. ఏపీ పోలీసులు ఇష్టారాజ్యంగా వచ్చి ఇక్కడ నుంచి మనుషులు తీసుకెళు‌న్నారంటూ.. పొలిటికల్ పంచాయతీ నడిచింది. ఇప్పుడు ఇంకో స్టెప్ ముందుకు వేస్తే అది అనవసరంగా ఇబ్బందులకు దారితీస్తుందని వారు భావిస్తున్నారు. సాధారణంగా అరుదుగా నమోదు చేసే జంఖం చట్టాన్ని రావణ్‌పై పెట్టడంపై చర్చ నడుస్తోంది. దీనికి సరైన జస్టిఫికేషన్ పోలీసులు ఇవ్వాల్సి ఉంటోంది. చాలా మంది మాజీ ఎఖూ, ప్రజా సంఘాల వారు ఈ చర్యను తప్పు పడుతున్నారు. దీనిపై విజయవాడలో రౌండ్ టేబుల్ మీటింగ్ జరిగింది.

జంఖంని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుతున్నారన్న భావనను ఈ సమావేశం వ్యక్తం చేసింది. ఈ పరిస్థితులన్నీ ప్రభుత్వం, పోలీసు శాఖపైన ఒత్తిడి పెంచుతున్నాయి. ఇప్పుడు కొత్త తలనొప్పులు తలకెత్తుకోవడం ఎలా అని.. పోలీసు శాఖ అనుకుంటోంది. అదే సమయంలో ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న పార్టీని ఒప్పించడం సవాల్‌గానే ఉంది. కూటమి ప్రభుత్వంలో ఇంతకు ముందు కూడా ఇలాంటి సిచ్యువేషన్స్ ఎదురయ్యాయి. వాటిని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ క్లియర్ చేసుకుని వచ్చారు. పవన్ కళ్యాణ్ తన సర్జరీ కోసం ముంబై వెళ్లడంతో ఇవాళ కేబినెట్ మీటింగ్ కు హాజరుకాలేదు. ఇది ముందుగానే షెడ్యూల్ అయిన విషయం అయినా ఈ టైమ్‌లోనే ఇలా జరగడం కూడా కూటమిలో కొంచం కుదుపుకు కారణం అయింది.


# పవన్ ట్రాప్‌లో జగన్




**నెల్లూరు, (భారత శక్తి)** రాజకీయాలు ఇలానే ఉండాలని లేదు. ఒకే విధంగా ఉంటే వాటిని రాజకీయాలు అనరు. చాణక్య నీతి ఆధారంగా రాజకీయాలు సాగుతూ ఉంటాయి. రాజకీయం అంటేనే పరమపద సోపానం లాంటిది. నిచ్చెనలు.. పాములు.. ఇలా చాలా ఉంటాయి. ఇందులో తెలివిగా వ్యవహరించిన వారు మాత్రమే పరమపద సోపానంలో విజయం సాధించగలుగుతారు.గతంలో ఏపీ రాజకీయాలలో వైసీపీ అధినేత రకరకాల చక్రవ్యూహాలు రచించేవారు. ఆయన వెంట నాడు విజయసాయిరెడ్డి.. వంటి నాయకులు ఉండేవారు. వారు తమ బుర్రకు పదును పెట్టి ఆలోచనలు చేసేవారు. వాటిని జనంలోకి తీసుకెళ్లేవారు జగన్. తద్వారా నాడు టిడిపి ప్రభుత్వానికి.. జనసేన పార్టీకి ఇబ్బందికరమైన వాతావరణం కలిగించేవారు. జగన్ వేసిన ఉచ్చులలో ప్రధానంగా వారు చిక్కుకునేవారు. 2019 ఎన్నికల్లో జరిగింది అదే. అందువల్లే జగన్ ఏకపక్షంగా అధికారంలోకి రాగలిగారు.జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. టిడిపి తరఫున మహాసేన రాజేష్ సోషల్ మీడియాలో గట్టిగా మాట్లాడేవారు. నాడు మహాసేన రాజేష్ పవన్ కళ్యాణ్.. జగన్ ను విమర్శించేవారు. చంద్రబాబును ఒక్క మాట కూడా అనేవారు కాదు. ఇటీవలి ప్రశ్న రావణ్ కూడా ఏపీ సీఎం, ఐటీ మంత్రిని ఒక్క మాట అనలేదు. కేవలం పవన్ కళ్యాణ్ మీద మాత్రమే దాడి చేసేవారు. ఇష్టానుసారంగా మాట్లాడేవారు. జడ శ్రావణ్ కూడా జన సేన అధినేత ను టార్గెట్ చేసుకొని విమర్శించేవారు.. అయితే ఎన్నడూ కూడా ఏపీ సీఎం, ఆయన కుమారుడిని విమర్శించే వారు కాదు.రావణ్.. జడ శ్రావణ్ వ్యవహార శైలి రోజురోజుకు దారుణంగా మారుతున్న నేపథ్యంలో..పవన్ కళ్యాణ్ పై. తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్న నేపథ్యంలో.. జనసేన నాయకులకు కడుపు రగిలిపోయింది. పవన్ కళ్యాణ్ నుంచి ఆదేశాలు రావడంతో వారు కేసులు పెట్టడం మొదలుపెట్టారు. ఫలితంగా పోలీసులు కేసులు కట్టి రావణ్ మీద చర్యలు తీసుకోవడం మొదలుపెట్టారు. ఒకరకంగా పోలీసులకు అరెస్ట్ చేసే పరిస్థితి మాత్రమే కల్పించి.. తాను ఏంటో నిరూపించుకున్నారు పవన్. ఈ విషయంలో టిడిపికి కూడా పవన్ కళ్యాణ్ మాటకు ఊ కొట్టడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది.పవన్ కళ్యాణ్ గట్టిగా నిలబడడంతో రావణ్ లాంటివాళ్ళు ఇప్పుడు నోరు మూసుకొని కూర్చున్నారు. వాస్తవానికి ఇక్కడ రావణ్ లేదా శ్రవణ్ వల్ల వైసీపీకి పెద్దగా ఉపయోగం లేదు. ఎందుకంటే వైసీపీకి దళిత క్రైస్తవులు ఓట్లు ఆల్రెడీ ఉన్నాయి. మొదటి ఎన్నికల్లో కొంత మాత్రమే తగ్గాయి. ఎస్సీ.. ఎస్టీలు కూడా జగన్మోహన్ రెడ్డికి అండగా ఉన్నారు. అలాంటప్పుడు శ్రావణ్ విషయంలో.. రావణ్ విషయంలో జగన్ ఎందుకు తొందర పడుతున్నారు.. ఎందుకు ఆయన వకాల్తా పుచ్చుకుంటున్నారో అర్థం కావడం లేదు. పవన్ కళ్యాణ్ వేసిన ట్రాప్ లో పడి జగన్ ఇబ్బంది పడుతున్నారు. ఇదే సమయంలో హిందువుల పట్ల జగన్మోహన్ రెడ్డిని విలన్ లాగా చిత్రీకరించే ప్రయత్నాన్ని పవన్ విజయవంతంగా పూర్తి చేశారు.

# భయమా..ప్రకాష్ రాజ్ ?

**హైదరాబాద్, (భారత శక్తి)** యూట్యూబర్ రావణ్ దేశద్రోహం, ఉపా చట్టం కింద అరెస్ట్ అయి జైలుకు వెళ్లిన ఉదంతంలో ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ పేరు ప్రముఖంగా తెరపైకి రావడంతో సోషల్ మీడియాలో ఆయనపై పెద్ద ఎత్తున ట్రోలింగ్, ప్రచారం మొదలైంది. దీనిపై ప్రకాష్ రాజ్ నా ప్రశ్నించే గొంతును ఎవరూ ఆపలేరంటూ కొత్తగా వీడియో విడుదల చేశారు. తాను మౌనంగా లేనని, జనసైనికులు, కొన్ని ఛానళ్లు, యూట్యూబర్లు చేస్తున్న అబద్ధాల ప్రచారాన్ని గమనిస్తున్నానని తెలిపారు. వీటన్నిటికీ దిగజారండి, దిగజారుతూనే ఉండండి అని వ్యాఖ్యానిస్తూ, వారి దిగజారుడుతనాన్ని ప్రపంచం చూస్తోందంటూ ట్వీట్ చేశారు. ప్రకాష్ రాజ్ పైపైన ఎంత ధైర్యంగా మాట్లాడుతున్నా.. లోపల మాత్రం కేసు తీవ్రత చూసి తీవ్ర ఆందోళనలో ఉన్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. దేశద్రోహం కేసులో ఇరుక్కున్న రావణ్‌తో ప్రకాష్ రాజ్‌కు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయనేది ప్రధాన ఆరోపణ. రావణ్‌తో పాటు కొంతమంది ఒక ముఠాగా ఏర్పడి, ఏపీలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో కుల, మతాల మధ్య చిచ్చు పెట్టేలా వ్యూహాత్మక కుట్రలు చేశారనే ప్రచారం గట్టిగా నడుస్తోంది. గతంలో రావణ్ చేసిన పలు వివాదాస్పద పోస్టులను, వీడియోలను ప్రకాష్ రాజ్ సపోర్ట్ చేస్తూ రీట్వీట్లు చేయడం.. ఇప్పుడు ఈ విచారణ తన దాకా వస్తుందనే భయంతోనే ఆయన ప్రశ్నించే గొంతు అంటూ ముందస్తు రక్షణ కవచం వెతుక్కుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రకాష్ రాజ్ కెరీర్ అంతా పరిశీలిస్తే.. ఆయన ఎప్పుడూ సమాజం కోసమో, సామాన్య ప్రజల సమస్యల కోసమో క్షేత్రస్థాయిలో ప్రశ్నించిన దాఖలాలు లేవనేది బహిరంగ రహస్యం. ఆయన వేసే ప్రశ్నలు కేవలం ఒక వర్గాన్ని టార్గెట్ చేసేలా, ఆయన వ్యక్తిగత, రాజకీయ ఎజెండాలకు ఉపయోగపడేలా మాత్రమే ఉంటాయనే వాదన బలంగా ఉంది. అందుకే ప్రజాసమస్యలపై స్పందించని ఆయన ప్రశ్నల ను సామాన్యులు పెద్దగా పట్టించుకోరు. కానీ, ఈసారి వ్యవహారం కేవలం రాజకీయ విమర్శలతో ఆగిపోయేలా లేదు. ప్రభుత్వ నిఘా



వర్గాలు, పోలీసులు ఈ డిజిటల్ కుట్రల వెనుక ఉన్న అసలు లింకులను పక్కా ఆధారాలతో బయటకు తీస్తున్నారు. చట్టం ముందు అందరూ సమానులే కాబట్టి, నిజాలు పూర్తిగా నిరూపితమైతే ప్రకాష్ రాజ్ సైతం లీగల్ చిక్కులను, కఠిన చర్యలను ఎదుర్కోక తప్పదని భావిస్తున్నారు.ప్రస్తుతం ఈ వ్యవహారంలో పోలీసుల తదుపరి అడుగులు ప్రకాష్ రాజ్ మెడకు చుట్టుకునేలా కనిపిస్తున్నాయి. అరెస్ట్ అయిన రావణ్ మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్‌లలో లభ్యమైన కీలక డేటా, చాటింగ్ హిస్టరీతో పాటు.. ఈ ఛానల్‌కు ఫండింగ్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న గమన అనే మహిళను పోలీసులు త్వరలోనే విచారించనున్నారు. గమన నోటీసుల విచారణలో తేలే అంశాలు, రావణ్ ఫోన్ డాక్యుమెంట్లు క్రోడీకరిస్తే.. ఈ సోషల్ మీడియా నెట్‌వర్క్ వెనుక ప్రకాష్ రాజ్ పాత్ర ఏంటనేది అధికారికంగా బయటపడే అవకాశం ఉంది. తెరవెనుక నడిచిన అసలు కథ స్క్రిప్ట్ బయటకు వస్తే, అది ప్రకాష్ రాజ్ కే సమస్యలు తెచ్చిపెట్టవచ్చు.

# 17న రాయపాడు స్టేషన్ శుభారంభం

**విజయవాడ, (భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రైల్వేస్టేషన్ అందుబాటులోకి రానుంది. విజయవాడ శివారు ప్రాంతంలోని రాయనపాడు రైల్వేస్టేషన్ జూలై 17వ తేదీ నుంచి అందుబాటులోకి రానుంది. జూలై 17న రైల్వేస్టేషన్ ప్రారంభించేందుకు అధికారులు ముహూర్తం ఖరారు చేశారు. విజయవాడ రైల్వేస్టేషన్‌పై రద్దీ పడుతున్న నేపథ్యంలో.. ఆ ప్రభావం తగ్గించేందుకు రాయనపాడును శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి చేశారు. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద రూ.35 కోట్లతో ఆధునికీకరణ చేపట్టారు రైలు ప్రయాణికులకు గుడ్ న్యూస్.. ఏపీలో కొత్త రైల్వేస్టేషన్ అందుబాటులోకి రానుంది. విజయవాడ సమీపంలోని రాయనపాడు రైల్వేస్టేషన్ జూలై 17న ప్రారంభం కానుంది. విజయవాడ రైల్వేస్టేషన్‌పై రద్దీ తగ్గించేందుకు రాయనపాడు రైల్వేస్టేషన్‌ను శాటిలైట్ స్టేషన్‌గా విజయవాడ శివారు ప్రాంతంలో అభివృద్ధి చేశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ. 35 కోట్లు ఖర్చు చేసి రాయనపాడు రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనులు చేపట్టారు. పనులు పూర్తి కావటంతో జూలై 17వ తేదీ రాయనపాడు రైల్వేస్టేషన్ ఆరంభించేందుకు ముహూర్తం ఖరారైంది.మరోవైపు అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద రాయనపాడు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లు ఆధునీకరించారు. రైలు ప్రయాణికుల కోసం విశ్రాంతి గదులు ఏర్పాటు చేశారు. టికెట్ కౌంటర్లు, టాయిలెట్స్ తీర్చిదిద్దారు. ఆర్వో తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. అలాగే రైలు స్టేషన్ మాస్టర్, ఇతర సిబ్బంది కోసం రైల్వేస్టేషన్‌లో గదులు నిర్మించారు. రైల్వేస్టేషన్ ఎంట్రీతో పాటు మొత్తం ప్రాంగణమంతా పచ్చదనం ఉండేలా తీర్చిదిద్దారు. ఇక్కడ ఇంకో విశేషం ఏమిటంటే స్థానిక ప్రత్యేకతను ప్రయాణికులకు పరిచయం చేసేలా కొండపల్లి బొమ్మల పెయింటింగ్స్ వేశారు.మరోవైపు రాయనపాడు రైల్వేస్టేషన్ మీదుగా ప్రస్తుతం రోజూ 12 రైళ్ల వరకూ రాకపోకలు సాగిస్తున్నాయి. రాబోయే రోజులలో రాయనపాడు రైల్వేస్టేషన్ మీదుగా మరిన్ని రైళ్లను నడపనున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా రూ.5.77 కోట్లతో ఆధునిక టాయిలెట్లు, ఏసీ ప్రీపెయిడ్ వెయిటింగ్ హాల్ నిర్మించారు.దివ్యాంగుల కోసం మరుగుదొడ్లు నిర్మించారు. రూ.13.33 కోట్లతో ప్లాట్‌ఫామ్‌ల ఆధునికీకరణ.. దివ్యాంగులకు అనువుగా టాక్టైల్ పాత్ ఏర్పాటు చేశారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్, రెండు లిఫ్టులు, రైల్వేస్టేషన్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టారు. ఆధునిక సదుపాయాలు, హైటెక్ హంగులతో తీర్చిదిద్దిన రాయనపాడు రైల్వేస్టేషన్ జూలై 17న ప్రారంభం కానుంది. ఈ రైల్వేస్టేషన్ అందుబాటులోకి వస్తే విజయవాడ రైల్వేస్టేషన్ మీద ఒత్తిడి తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. అందుకే వేగంగా పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యారు

# ప్రతి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం

**కూకట్ పల్లి (భారత శక్తి)**ఇది ప్రజా ప్రభుత్వమని ప్రజలు ప్రస్తావించిన ప్రతి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని వసంత నగర్ డివిజన్ గ్రీన్ వ్యూ కాలనీలో స్థానిక ప్రజల ఆహ్వానం మేరకు కాలనీలో పర్యటించిన రమేష్ విస్తృతంగా పర్యటించారు. తాము నివసించేందుకు కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు రోడ్లు విద్యుత్తు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడాన్ని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు దీనిపై స్పందించిన ఆయన కొద్దిరోజులు వ్యవధి లోనే కాలనీకి అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు అనంతరం సర్ పత్రాల పంపిణీ పైన వాటిని పూర్తి చేయడం పైన ప్రజలకు అవగాహన కల్పించారు ప్రతి ఒక్కరూ తమకు ఇచ్చిన పత్రాన్ని పూర్తి చేసి తిరిగి అధికారులకు అందజేయాలని సూచించారు పార్టీకి చెందిన స్థానిక నాయకులు సైతం సర్ పత్రాలను పూర్తి చేయడంపై ప్రజలకు సహకరించాలని సూచించారు.

# బీజేపీకి చుక్కలు చూపిస్తున్న పీకే



**పాట్నా, (భారత శక్తి)** బీహార్ రాజకీయాల్లో ఇప్పుడు ఒకే పేరు మార్మోగుతోంది.. అదే ప్రశాంత్ కిషోర్ . మూడు దశాబ్దాలుగా భారతీయ జనతా పార్టీకి అజేయమైన కోటగా ఉన్న బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పీకే ఎంట్రీ ఇవ్వడమే ఆలస్యం, అక్కడ పొలిటికల్ మైండ్ గేమ్‌తో కమల దళానికి ఆయన చుక్కలు చూపిస్తున్నారు. నామినేషన్ వేసిన కేవలం 24 గంటల వ్యవధిలోనే బీజేపీ అభ్యర్థి అభిషేక్ సిన్హా అర్ధాంతరంగా బరి నుంచి తప్పుకున్నారు. ఒకప్పుడు తెరవెనుక ఉండి దేశవ్యాప్తంగా ఎందరో నాయకులను గెలిపించిన ఈ కింగ్‌మేకర్, ఇప్పుడు తానే నేరుగా ప్రజాక్షేత్రంలోకి దిగి ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు.బంకీపూర్ ఉపఎన్నిక బరిలో ప్రశాంత్ కిషోర్ స్వయంగా నిలబడటంతో బీజేపీ తీవ్ర ఆత్మరక్షణలో పడింది. పీకే లాంటి చాణక్యుడి ముందు అభిషేక్ సిన్హా చాలా బలహీనమైన అభ్యర్థి అని ఆ పార్టీ అంతర్గత సర్వేల్లో తేలడమే కాకుండా, ఆయనకు సంబంధించిన కొన్ని వివాదాస్పద ఆర్థిక లావాదేవీల చిట్టా పీకే చేతికి చిక్కిందనే ప్రచారం పట్నా రాజకీయాలను కుదిపేస్తోంది. ఆ ఆధారాలు ఎన్నికల ప్రచారంలో బయటపడితే పార్టీ పరువు గంగలో కలుస్తుందని భావించిన అధిష్టానమే, బంటితో బలవంతంగా నామినేషన్ ఉపసంహరింపజేసింద భావిస్తున్నారు. ఈ పరిణామంతో, ప్రత్యర్థులను ఈడీ, సీబీఐలతో భయపెట్టే బీజేపీ.. ఇప్పుడు ఓటమి భయంతో తానే రంగు మార్చి పారిపోతోందంటూ పీకే వేసిన సెటైర్లు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.నష్టనివారణ చర్యల్లో ఓ బీజేపీ యువజన విభాగంలో పనిచేసే నీరజ్ కుమార్ సిన్హాను కొత్త అభ్యర్థిగా అత్యవసరంగా బరిలోకి దించింది. ఐదుసార్లు వరుసగా గెలిచిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ రాజ్యసభకు వెళ్లడంతో ఖాళీ అయిన ఈ స్థానం, కమలదళానికి అత్యంత ప్రతిష్టాత్మకం. గత 2025 ఎన్నికల్లో ఇక్కడి నుంచి ఆర్జేడీ అభ్యర్థి రేఖా కుమారిపై నితిన్ నవీన్ 51 వేల ఓట్ల భారీ మెజారిటీతో గెలిచారు. అయితే, ఇప్పుడు పీకే స్వయంగా రంగంలో ఉండటం, ఆర్జేడీ తరఫున మళ్లీ రేఖా కుమారి పోటీలో నిలవడంతో ఈ ఉపఎన్నిక రసవత్తరమైన త్రిముఖ పోరుగా మారింది.జులై 30న జరగబోయే పోలింగ్, ఆగస్టు 3న వచ్చే ఫలితాలను ప్రశాంత్ కిషోర్ తన రాజకీయ భవిష్యత్తుకు ఒక రెఫరెండం గా ప్రకటించారు. మొదటి విడతలోనే అభ్యర్థిని మార్చాల్సి వచ్చేలా చేసి బీజేపీ డిఫెన్స్‌లో పడిందనే నెరేటివ్‌ను సెట్ చేయడంలో పీకే ఇప్పటికే సగం విజయం సాధించారు. మూడు దశాబ్దాలుగా జనసంఘ్, ఆర్ఎస్ఎస్ మూలాలున్న బంకీపూర్ ఓటర్లు పీకే డిజిటల్ , గ్రౌండ్ మేనేజ్‌మెంట్ ప్రయోగాలకు జై కొడతారా, లేక సాధారణ బూత్ స్థాయి కార్యకర్తని నిలబెట్టిన బీజేపీకే ఓటేస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది.

## వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్"



**కడప, జూలై 13(భారత శక్తి ):** మెంబెర్ సెక్రటరీ శ్రీమతి బి.యంన్.వి.పీవంబిందం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారితో సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఎస్.బాబా ఫక్రుద్దీన్ కడప వారు తన ఛాంబర్, న్యాయ సేవా సదన్ కడప నందు "వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్" లో పాల్గొనడము జరిగినది. ఈ మీటింగులో ఖైదీలకు సంబంధించి బెయిల్స్, అప్పీళ్లు, ష్యూరిటీలు, నగదు సర్యూటీలు, సాధికార కమిటీ, చట్టపరమైన సహాయం డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్స్, మొదలగు అంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీలు పాల్గొన్నారు.

## జిల్లాలోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలి

**- టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి**

**- అధ్యక్షులు పుప్పాల దేవిదాస్ డిమాండ్.**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూలై 13: (భారత శక్తి)** జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులందరికీ ప్రభుత్వం తక్షణమే ఇళ్ల స్థలాలు కేటాయించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పుప్పాల దేవిదాస్ మాట్లాడుతూ, సమాజానికి నాలుగో స్థంభంగా నిలుస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.

అయితే ప్రభుత్వం ఏర్పడి చాలాకాలం గడిచినా ఆ హామీ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రాల్లోనే కాకుండా మారుమూల మండలాల్లో సైతం జర్నలిస్టులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. అలాంటి జర్నలిస్టుల సేవలను గుర్తించి, వారికి ఇళ్ల స్థలాలు కేటాయించడం ద్వారా ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి మరింత ప్రాధాన్యత ఇచ్చి, ఇళ్ల స్థలాలతో పాటు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వినతిపత్రాన్ని స్వీకరించి, సంబంధిత ప్రభుత్వ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు, మండల శాఖల ప్రతినిధులు, జిల్లా కేంద్రం మరియు మండల కేంద్రాల్లో పనిచేస్తున్న పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## జన జాగరణ యాత్రకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు తరలిరావాలి




**జగిత్యాల, జూలై 13 (భారత శక్తి ప్రతినిధి):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని కేజీఆర్ పాఠశాలలో సోమవారం టీఎస్ సీపీఎస్ ఈయూ ఆధ్వర్యంలో జన జాగరణ యాత్ర గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సర్వ సతీష్ మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ 1 తర్వాత నియమితులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం లేకపోవడంతో పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రత, కనీస పెన్షన్ లేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ఆధ్వర్యంలో 33 జిల్లాల గుండా జన జాగరణ బస్సు యాత్ర చేపట్టినట్లు తెలిపారు. జూలై 25, 26 తేదీల్లో జగిత్యాల జిల్లాలో జరిగే యాత్రలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని, అలాగే ఆగస్టు 23న హైదరాబాద్‌లో జరిగే భారీ బహిరంగ సభకు హాజరై సీపీఎస్ రద్దు ఉద్యమానికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌పీలు గుండు విజయ్, అన్నం మహేష్, అభయ్ రాజ్, ప్రవీణ్, దాసరి జయంత్, ఉమేష్, రాష్ట్ర కార్యదర్శులు చుక్క కిరణ్, సందుపట్ల రమేష్, సిర్రా శ్రీనివాస్, అనుమల్ల నరేందర్, ఉషకోల శివప్రసాద్, జోగం శ్రీనివాస్, నీలం సంపత్, బండారి సతీష్, చిట్టినేని విజయ్, హరికృష్ణ, మహేష్, రాజేష్ పాల్గొన్నారు. ?

## బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన బండారి గంగాధర్



**శివంపేట్, జూలై 13( భారత శక్తి న్యూస్):** మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని శివంపేట్ మండలం పిల్లుట్ల గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధికార ప్రతినిధి, ప్రముఖ సంఘసేవకులు బండారి గంగాధర్ ప్రభుత్వం తరపున బాధితుడు బండారి వెంకటేశంకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా బండారి గంగాధర్ మాట్లాడుతూ, పేద ప్రజలకు వైద్య చికిత్సల వల్ల కలిగే ఆర్థిక భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఆసుపత్రి వైద్య ఖర్చులకు ఈ చెక్కు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బండారి గోపి, మ్యద్దర్ల రాజు, పిల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల హక్కుల చట్టం - 2016ను సమర్థవంతంగా అమలు చేయాలి

**- ఎన్నికల హామీలు అమలు చేసి ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి. - అంత వరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై తమ పోరాటం ఆగదు:గిద్దె రాజేష్**

**సూర్యాపేట, భారత శక్తి ప్రతినిధి, జూలై 13:** సూర్యాపేట జిల్లా మోతె మండలంలో వికలాంగుల హక్కుల చట్టం--2016ను సమర్థవంతంగా అమలు చేసి వికలాంగుల హక్కులను పరిరక్షించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ కోరారు. సోమవారం సంఘం మండల అధ్యక్షులు జిల్లేపల్లి శివకృష్ణ, జిల్లా క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జంజీరాల సుధాకర్ నేతృత్వంలో మోతె మండల నూతన ఎస్సై లచ్చిరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వికలాంగుల హక్కుల చట్టం--2016ను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు వికలాంగుల భద్రత, గౌరవం, హక్కుల పరిరక్షణ కోసం తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ ఎస్సైకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ మాట్లాడుతూ, వికలాంగుల హక్కుల చట్టం--2016 కేవలం ఒక చట్టం మాత్రమే కాదని, వికలాంగులకు సమాన హక్కులు, గౌరవప్రదమైన జీవనం, రక్షణ కల్పించే సామాజిక భరోసా చట్టమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ చట్టంలోని ముఖ్యంగా సెక్షన్ 91, సెక్షన్ 92 నిబంధనలను ప్రతి పోలీసు స్టేషన్ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో వికలాంగులు ఇప్పటికీ వివక్ష, అవమానాలు, బెదిరింపులు, దాడులు, సామాజిక నిర్లక్ష్యాన్ని ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా మానసిక వికలాంగ మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి కేసుల్లో పోలీసులు రాజీ ప్రయత్నాలకు తావు ఇవ్వకుండా చట్టప్రకారం వెంటనే కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్థాయి నాయకుల నుంచి రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధుల వరకు కొందరు వికలాంగులను వారి వైకల్యాన్ని అవమానకరంగా ప్రస్తావిస్తూ దూషించడం, చిన్నచూపు చూడడం, వేధింపులకు పాల్పడటం అత్యంత బాధాకరమని గిద్దె రాజేష్ అన్నారు. వైకల్యాన్ని అవమానించడం కూడా చట్టరీత్యా శిక్షార్హమైన చర్యేనని, ఇలాంటి ఘటనలపై పోలీసులు రాజీపడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని, వికలాంగులపై జరిగే వివక్ష, దాడులను అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు.

గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో వికలాంగులకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పించిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికల హామీలు అమలు చేసి ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పించే వరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తమ ప్రజాస్వామ్య పోరాటం ఆగదని గిద్దె రాజేష్ స్పష్టం చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన నూతన ఎస్సై లచ్చిరెడ్డి వికలాంగుల సమస్యలపై సానుకూలంగా స్పందించి, తన పరిధిలో వికలాంగుల హక్కుల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ మోతే మండల అధ్యక్షులు జిల్లేపల్లి శివకృష్ణ, జిల్లా క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జంజీరాల సుధాకర్, సంఘం నాయకులు బొడ్డు ధనమూర్తి, గజ్జి దుర్గయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## సీఈఐఆర్‌తో విశిష్ట విజయాలు సాధిస్తున్న జిల్లా పోలీసులు

**- 76.8% మొబైల్ రికవరీ రేటుతో రాష్ట్రంలో మూడవ సంవత్సరం మొదటి స్థానం.**

**- 13 లక్షల విలువ గల 90 మొబైల్ ఫోన్లు రికవరీ.**

**- యజమానులకు అందజేత: జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్**



**రాజన్న సిరిసిల్ల, జూలై 13(భారత శక్తి ):** జిల్లా పోలీసులు మొబైల్ ఫోన్ రికవరీలో 76.8% శాతం మొబైల్ రికవరీ రేటు సాధించి,రాష్ట్రంలో మూడవ సంవత్సరం ప్రథమ స్థానంలో నిలవడం జిల్లా పోలీస్ యంత్రాంగం నిరంతర పర్యవేక్షణ,సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించిన తీరుకు నిదర్శనమని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. సోమవారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెల్ ఫోన్ రికవరీ మేళాలో జిల్లాలో గత కొన్ని రోజుల నుండి పోయిన,చోరీకి గురైన సుమారు 13లక్షల రూ.విలువ గల 90 ఫోన్ల ఆచూకీ మన రాష్ట్రంలోనే కాకుండా పొరుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుండి రికవరీ సంబంధిత మొబైల్ ఫోన్ల యజమనులకి అందజేయడం జరిగింది. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ లేనిదే ఒక చిన్న లావాదేవీ కూడా చేయలేని, మన యొక్క విలువైన సమాచారం బ్యాంక్ అకౌంట్స్, పాస్ వర్డ్స్ వంటివి మొబైల్‌లో సేవ్ చేసి పెట్టుకుంటారని తెలిసిన నేరగాళ్లు మొబైల్ దొంగిలించి,వీక్ పాస్ వర్డ్స్ లను బ్రేక్ చేసి ఫోన్ పే,గూగుల్ పే తదితర మద్యమాల ద్వారా డబ్బులు కాజేస్తున్నారన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు కేవలం మొబైల్ ఫోన్ మాత్రమే కాకుండా తమ వ్యక్తిగత సమాచారంతో సహ డబ్బులను కూడా కోల్పోవడం జరుగుతుందన్నారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే CEIR పోర్టల్ ( https://www.ceir.gov.in ) నందు బ్లాక్ చేసి, సంభందిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

### ప్రజలకు ముఖ్య గమనిక

సెకండ్‌హ్యాండ్ మొబైల్ ఫోన్ కొనుగోలు చేసే వారు తప్పనిసరిగా సంబంధిత మొబైల్ షాప్ యజమాని నుండి బిల్లు లేదా రసీదు తీసుకోవాలని,తక్కువ ధరకు లభిస్తుందని భావించి, దొంగిలించబడిన ఫోన్ అని తెలియక కొనుగోలు చేసిన అమాయక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దొంగిలించబడిన మొబైల్ ఫోన్ అని తెలిసి కూడా కొనుగోలు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోబడతాయన్నారు.

మొబైల్ ఫోన్ అమ్మలనుకునే వారు తప్పని సరిగా సంబంధిత కంపెనీలకు ఎక్స్ఛేంజ్ , విక్రయించాలే తప్ప తెలియని వ్యక్తులకు లేదా అనధికారికంగా మొబైల్ షాపులకు విక్రయించవద్దని, ఇటువంటి మొబైల్ ఫోన్లు సైబర్ నేరాలకు వినియోగించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా జిల్లాలో పోయిన మొబైల్ ఫోన్స్ రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో కృషి చేస్తున్న ఐ.టి కోర్ ఎస్.ఐ కిరణ్ కుమార్ ,కానిస్టేబుల్ రాజాతిరుమలేష్ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. పోయిన మొబైల్ ఫోను మళ్లీ దొరకదనుకున్న మొబైల్ ఫోన్ జిల్లా పోలీసులు టెక్నాలజీ ఉపయోగించి ఫోన్ రికవరీ చేసి అందించినందుకు సంబంధిత బాధితులు జిల్లా ఎస్పీ కి, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్.ఐ సురేష్, ఐటి కోర్ ఎస్.ఐ కిరణ్ కుమార్, ఆర్.ఐ యాదగిరి,కానిస్టేబుల్ రాజాతిరుమలేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిధులతో నిర్మించిన ప్రెస్ క్లబ్ భవనం అందరు జర్నలిస్టులకు చెందాలి

**- అన్ని జర్నలిస్టు సంఘాల సభ్యులకు సమాన అవకాశాలు కల్పించాలి.**

**- ఆర్డీవో, ఎంపీడీవోలకు టీయూడబ్ల్యూజే హెచ్-143 వినతి.**



**భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూలై 13:** వేములవాడ పట్టణంలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో, ప్రభుత్వ నిధులతో నిర్మించిన ప్రెస్ క్లబ్ భవనం ఏ ఒక్క సంఘానికి పరిమితం కాకుండా వేములవాడ ప్రాంతంలోని జర్నలిస్టులందరి ప్రయోజనార్థం ఏర్పాటు చేయబడిందని, అందువల్ల అన్ని జర్నలిస్టు సంఘాల సభ్యులకు సమాన అవకాశాలు కల్పిస్తూ భవనాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే హెచ్-143 వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలి ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కుమారి, ఎంపీడీవో బింగి కీర్తన లకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తిగా ఉన్న ప్రెస్ క్లబ్ భవనం వేములవాడ ప్రాంతంలోని జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన కార్యక్రమాలు, సమావేశాల నిర్వహణ కోసం నిర్మించబడిందని తెలిపారు. కాబట్టి ఏ ఒక్క సంఘానికో లేదా కొంతమంది వ్యక్తులకో పరిమితం చేయకుండా, అన్ని జర్నలిస్టు సంఘాల సభ్యులు సమాన హక్కులతో భవనాన్ని వినియోగించుకునే విధంగా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని స్వీకరించిన ఆర్డీవో కుమారి, ఎంపీడీవో కీర్తనలు ఈ అంశంపై సమగ్ర విచారణ నిర్వహించి, ప్రభుత్వ నిబంధనలు, రికార్డులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## కూలీల ప్రాణాలు తీసిన ఆర్టీసీ హైర్ బస్సు

**- డ్రైవర్ 'నరన్'ను విధుల నుంచి తొలగించిన డిపో మేనేజర్ ప్రకాశ్ రావు**



**భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూలై 13:** వేములవాడ అర్బన్ మండలం అనుపురం సమీపంలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కూలీల మృతికి కారణమైన హైర్ బస్సు డ్రైవర్‌పై అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. బాధ్యుడైన డ్రైవర్ ఎం. నరన్ (బ్యాడ్జ్ నెం. 52247) ను తక్షణమే విధుల నుండి తొలగిస్తూ సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాష్ రావు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అనుపురం సమీపంలో జరిగిన ఈ ప్రమాదం పలు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. రోడ్డుపై వెళ్తున్న కూలీలను ఆర్టీసీ హైర్ బస్సు బలంగా ఢీకొట్టడంతో ముగ్గురు కూలీలు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మరికొందరు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, ప్రయాణికులు హుటాహుటిన స్పందించి క్షతగాత్రులను రక్షించేందుకు చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం వేర్వేరు ఆసుపత్రులకు తరలించారు. ఘోర దుర్ఘటనపై టీజీఎస్‌ఆర్టీసీ యంత్రాంగం తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేసింది. ప్రమాదం జరిగిన వెంటనే సిరిసిల్ల డిపో అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రాథమిక విచారణలో డ్రైవర్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించడంతో, డిపో మేనేజర్ ప్రకాష్ రావు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డ్రైవర్ ఎం. నరన్‌ను విధుల నుంచి తొలగిస్తూ తక్షణ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రయాణికులు, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లేలా వ్యవహరించే డ్రైవర్ల పట్ల కఠినంగా ఉంటామని అధికారులు హెచ్చరించారు.

## ప్రజా ఫిర్యాదులపై బాధ్యతాయుతంగా స్పందించాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి





**కడప, జూలై 13(భారత శక్తి ):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించి, అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవనంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అధికారులు అలసత్వం వీడి ప్రతి అర్జీపై ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని సూచించారు. భూ సంబంధిత సమస్యలను రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పరిశీలనలో పీజీఆర్ఎస్ నిర్వహణలో జిల్లా పనితీరు మెరుగ్గా ఉన్నప్పటికీ, అర్జీల పరిష్కారంలో ఆలస్యం లేకుండా అన్ని శాఖలు మరింత అప్రమత్తంగా పనిచేయాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పరిశీలన చేసి, అర్జీదారులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులు తెలుసుకొని సరైన సమాధానాలు ఇవ్వాలని, పొంతనలేని నివేదికలు సమర్పించరాదని అధికారులను హెచ్చరించారు. తహసీల్దార్లు, శాఖాధిపతులు, పీజీఆర్ఎస్ సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి సమాచార లోపాలు లేకుండా చూడాలని సూచించారు. పిజిఆర్ఎస్ ద్వారా పరిష్కరించిన అర్జీలపై ప్రజల సంతృప్తి (పబ్లిక్ సాటిస్ఫాక్షన్) స్థాయిని కూడా ప్రభుత్వం నిరంతరం పరిశీలిస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అందువల్ల ప్రతి ఫిర్యాదును నాణ్యతతో పరిష్కరించి, అర్జీదారులు సంతృప్తి చెందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి డీపీవో వెంకటసుబ్బయ్య, ఎస్.ఎస్.ఈ. ఏపిసి అనురాధ, డీఆర్‌డీఏ పీడీ జి. రాజ్యలక్ష్మి, డీఎస్ఓ రఘురాం, డిఎంహెచ్ఓ డా. రవిబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446,
Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy